ఆంధ్రప్రదేశ్



ఫిబ్రవరి 1966

25 పైసలు

జననం

2-10-1904



నిర్యాణం

11-1-1966

భారతరత్న

లాల్ బహద్దుర్ శాస్త్రి

ఆంధ్రప్రదేశ్

సంపుటి: 10
సంచిక : 4
ఫిబ్రవరి, 1966
మాఘం - ఫాల్గుణ 1887 శకం

ప్రధాన సంపాదకులు
టి. రామచంద్రరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఈ సంచికలో

మొదటి చిత్రం
వనితల వలువల మేలికలయిక
ఫోటో, డి యస్. నాయుడు

రెండవ చిత్రం
ఫోటో టి. రామచంద్రరావు

-డవ, నాలుగవ చిత్రాలు
ఫోటోలు 'శ్రీధర్'

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు.

మహారథుడు

మన ప్రియతమ ప్రధాని లాల్‌బహద్దుర్‌శాస్త్రి యిక మనమధ్య లేరు: ఇది హృదయాన్ని కలచివేసే సంగతి: ఆయన హఠాన్మరణంతో మన జాతీయ చరిత్రలోని ఒక ఉజ్జ్వలమైన, ఒక వైభవోపేతమైన అధ్యాయము సమాప్తమైనది. ఆయన మన నుండి, మన దేశాన్నుండి మెరపుతీగవలె విరమించుకున్నారు.

రూజ్‌వెల్టు స్థానాన్ని ఆక్రమించడానికి మరొక రూజ్‌వెల్టు లేకపోయినట్టే, నెహ్రూ ఆసనాన్ని ఆక్రమించడానికి నెహ్రూ స్థాయి కలిగిన మరొకవ్యక్తి ఉండలేదు. కాని ఆటంబాంబును ప్రయోగించి, రెండవ ప్రపంచయుద్ధానికి భరతవాక్యం పలుకడం ద్వారా రూజ్‌వెల్టు స్థానాన్ని ఆక్రమించిన హారీ ట్రూమన్ చరిత్రను నిర్మించాడు. అదేవిధంగా జవహర్‌లాల్‌నెహ్రూ తరువాత మన సాయుధబలాలను పాకిస్తాన్ భూభాగంలోకి పురోగమింపచేసి, తద్వారా పాకిస్తాన్ తన దురాక్రమణచర్యల్ని నిలిపివేయడానికి అవసరమయిన మహత్తర నిర్ణయాన్నితీసుకోడం ద్వారా లాల్‌బహద్దుర్‌శాస్త్రి చరిత్రాత్మకమైన కార్యాన్ని నిర్వహించారు.

మహాత్మాగాంధీజీకి నిజమైన శిష్యుడు లాల్‌బహద్దుర్‌శాస్త్రి. దేశానికి నిస్వార్థంగా సేవచేయడమే ఆయన జీవితపు పవిత్ర ఆశయం; అదే ఆయన పరమావధి. ఆయన మస్తిష్కం, మేధస్సు, ఆయన ఆలోచనలు యెన్నడుగూడ అధికారంవల్ల మరులుగొనలేదు; అవి అధికారానికి లొంగిపోలేదు. తను కోరిన ఫలితాలను తన సేవ అందించలేదని భావించినప్పుడల్లా ఆయన తన వైఫల్యాన్ని అంగీకరించి, తన అధికారస్థానాన్ని వదులుకొనడంలో వెనుకాడలేదు. దేశంలోని వివిధప్రాంతాల్లో జరిగిన రైల్వే ప్రమాదాల కారణంగా ఆయన తన రైల్వే మంత్రిపదవికి ఏ అరమరికలు లేకుండా యిచ్చిన రాజీనామా ఆయన నిష్కామసేవాసక్తికి, అధికారంలో ఆయనకున్న నిరాసక్తతకు ప్రబలనిదర్శనం.

నవ్యనవనీత సమానమైన, చిన్నారి బాలలకు సాదృశమైన ఆయన రూపురేఖలు అత్యంత సరళమైన ఆయన ఆత్మను ప్రతిబింబించేవి. ముగ్ధముకావించెడి తన సరళత, నిష్కాపట్యము, నిరాడంబరత, ముక్కుసూటి వైఖరులచేత ఆయన ధనవంతులు, బీదలఅన్న తారతమ్యము లేకుండా అందరిప్రేమకు పాత్రుడైనాడు.

పుట్టుకతోనే ఆయన అక్షరాలా రాజకీయ చతురుడు. స్నేహితునితోగాని, శత్రువుతోగాని ఆయన యెన్నడూ పరుషమైన, బాధాకరమైన మాటలు పలుకలేదు. గాంధీవలెనె, లాల్‌బహద్దుర్‌శాస్త్రి మాటలుగూడ యెల్లప్పుడూ సున్నితమై సుదృఢమైనవి. స్పష్టత ఆయన ఉపన్యాసాల ప్రత్యేకత; అందులో ఆయన ఆలోచనల నిర్దుష్టత గోచరమయ్యేది.

సంప్రదింపులలో ఆయన అఖండుడు; అయితే ప్రాతిపదిక సూత్రాల విషయంలోమాత్రం ఆయన రాజీబేరాలకు అంగీకరించే వాడుకాదు. కాశ్మీరులోని పవిత్ర కేశ అవశేష అపహరణ వ్యవహారంలోను, అంతరంగికమైనపార్టీ సమస్యల్లోను ఆయన చూపిన దక్షత ఆయనను భవిష్యద్దేశనాయకునిగా భాసింపజేసినది. అందువల్ల తరువాత సంవత్సరాల్లో జవాహర్‌లాల్ ఆయనను తన ఆంతరంగికునిగా ఎంచుకొనడం, ఆయనను తన వారసునిగా సూచించడం ఆశ్చర్యకరమైన విషయంకాదు.


శాస్త్రీజీ ప్రధానమంత్రిపదవిలోనికి వచ్చినప్పుడు భాషావివాదము, మన సరిహద్దుల మీద దాడివంటి అనేక క్లిష్టమైన, జటిలమైన సమస్యలు ఆయనను చుట్టుముట్టినవి. అంతులేని చాకచక్యంతో, అనితర సాధ్యమైన నేర్పుతో, ఆసమస్యలన్నిటిని యెదుర్కొని ఆయన ఒక్కసారిగా ప్రపంచస్థాయిని అందుకొన్నాడు.

ఇటీవల తాష్కెంట్‌లో పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్‌తో ఆయనజరిపిన సంభాషణలు, అక్కడకుదిరిన ఒప్పందము ఆయన జీవితవైభవానికి మకుటాయమానమైనవి. క్లిష్టమైన యీకార్యంలో గణనీయమైన ఓరిమిని ప్రదర్శించి ఆయన అంతర్జాతీయ రంగంలో భారతదేశపు గౌరవాన్ని యినుమడింపజేసినాడు. శాంతి, సౌభ్రాతృత్వాల కొరకు, ఆసియాలోను తదితర ప్రాంతాలలోను కంటకప్రాయమైన సమస్యలను పరిష్కరించడానికి తమ తాష్కెంట్ విజయం ద్వారా లాల్‌బహద్దుర్‌శాస్త్రి, ఒక నూతన మార్గాన్ని ప్రపంచానికి చూపించారు. ఒక్కమాటలో చెప్పాలంటే, అంతర్జాతీయవ్యవహారాల్లో శాస్త్రీజీ ఘనవిజయానికి తాష్కెంట్ జయపతాక.

ఇక యిక్కడ దేశవ్యవహారాల్లో కూడా, అన్ని జాతీయ సమస్యలలోనూ ప్రతిపక్షాలను అంతరంగిక సంప్రదింపులకు పిలిచి, క్లిష్టసమయాలలో జాతి ఆలోచనలను సాకల్యంగా గ్రహించెడి ఒక నూతన విధానాన్ని శాస్త్రీజీ రూపొందించినారు.

శాస్త్రీజీ పట్టుపాన్పులో పుట్టలేదు; వారసత్వంగా ఆయనకు సంపదలు లభ్యం కాలేదు. అంతేకాదు, ఆయన తన వారసులకు గూడ ఆస్తిని సంపాదించి వెళ్ళలేదు. ఆయన అధివసించిన ఉన్నత పదవుల దృష్ట్యా యీ సంఘటల్ని గమనించినప్పుడు ఆయన అత్యున్నత వ్యక్తిత్వం యెంతటిదో మనకు స్పష్టం కాగలదు. నిజంగా, యిది ప్రజాహిత రంగంలో పనిచేస్తున్న వారందరికి నిరంతరం స్మరణీయమైన ఒక పాఠం వంటిది; ప్రజాసేవా పరాయణత్వాన్ని ఉద్దీపంపజేసెడి ఉజ్వలమైన ఒక ప్రమిదవంటిది.

జైహింద్!



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

శ్రీమతి ఇందిరాగాంధి

జీవిత విశేషాలు

"నామీద టాగూర్ ప్రభావం ఎంతగానో వుంది నా తల్లిదండ్రులను అరెస్టు చేయడానికి తరచుగా పోలీసులు రావడం, ఆ హడావిడీ, ఆగలాటాలతో నాకు స్వగృహంలో శాంతి లేకపోయింది. టాగూర్ సమక్షంలో నాకు శాంతి లభించేది" అని భారత తొలిమహిళాప్రధాని, శాంతిదూత జవహర్లాల్‌నెహ్రూ కుమార్తె శ్రీమతి ఇందిరాగాంధీ అన్నారు నిజమే తండ్రివద్దనుండి కేవలం రాజకీయ విజ్ఞానాన్నే గాక రసదృష్టినీ, విహంగావలోకనాన్నీ గూడా సంక్రమింపజేసుకున్నారనడానికి గ్లింప్సెస్‌ఆఫ్ వరల్డ్ హిస్టరీయే తార్కాణం 'నీకునేను ఏ బహుమతులివ్వగలను? ఈ స్థూల జగత్తుకు సంబంధించని, యీ గాలీ, యీ మనస్సు, యీ ఆత్మా— వీటికి మాత్రమే సంబంధించిన వాటిని మాత్రమే నీకు యివ్వగలను ఈ కాన్కలను యీ సమున్నతమైన జైలు గోడలుగూడా యివ్వనీకుండా అడ్డుపడవు' అని ఒక ఉత్తరంలో నెహ్రూ ఇందిరకు రాశారు

గ్లింప్సెస్‌ఆఫ్ వరల్డ్ హిస్టరీ అన్నది నెహ్రూ జైలులో వున్నప్పుడు కుమార్తెకు వ్రాసిన ఉత్తరాల సంకలనం ఆ వుత్తరాలే కుమార్తెకు తండ్రియిచ్చిన వెలలేని మాణిక్యాలు ఏ తండ్రీకూడా అంతకు మించి గొప్ప బహుమతిని ఏ కుమార్తెకూ యివ్వలేరు అనేకానేక విషయాలను, అటు భారతీయ సంస్కృతివైభవాలనూ, యిటు ప్రపంచ చరిత్రనూ వివరిస్తూ చిన్ననాడే ఆమెలో బహుముఖ విజ్ఞానానికి అంకురార్పణ చేశారు ఈనాటి శ్రీమతి ఇందిరా గాంధీ రాజకీయ నాయకత్వానికి ఆనాడే శిక్షణ ఆరంభమయింది తర్వాత తండ్రి రాజకీయ జీవితంవల్ల ప్రభావితమై అనేక ప్రత్యక్ష, పరోక్ష సంఘటనలద్వారా మరింతగా రాజకీయ చతురిమనూ సునిశిత దృష్టినీ అలవరచుకున్నారు

1917 నవంబరు పంధొమ్మిదవ తేదీన అలహాబాదులో ఇందిరాప్రియదర్శిని జన్మించింది. భారతదేశంలోనూ, ఆతర్వాత స్విడ్జర్లండ్, ఆక్స్‌ఫర్డ్‌లలోనూ విద్యాభ్యాసం చేసింది, కొంతకాలంపాటు విశ్వభారతిలో చదువుకుంది

తాతగారి కాలంనుండీ వంశపారంపర్యంగా వస్తున్న రాజకీయ వాతావరణం ఇందిరను చిన్ననాడే ప్రభావితం చేసింది చిన్నప్పటినుంచే స్వాతంత్ర్యభావాలు ఆమెలో జీర్ణించుకు పోయాయి రాజకీయాలను ఆమె ఉగ్గుపాలతోనే నేర్చుకుంది ఇందిర 12 సంవత్సరాల వయసులోనే కాంగ్రెసు సంస్థకు చిన్నపిల్లలందరినీ ఒక్కటిగా చేర్చి బాలసేనను తయారు చేసింది ఈసేన మొదట్లో 6000 మందితో ప్రారంభమై అటుతర్వాత దేశవ్యాప్తంగా 60000 మంది సభ్యులతో విస్తృత సంస్థగా రూపొందింది

చదువుకునే రోజుల్లో రాజకీయ ఆందోళనల్లో, విద్యార్థి ఆందోళనల్లో ఉత్సాహంతో పాల్గొనేది కొన్ని సందర్భాలలో ప్రధాన పాత్ర వహించేదికూడాను 21వ ఏట కాంగ్రెసులో చేరింది

1942 లో ఇందిర ఫిరోజ్‌గాంధీని వివాహమాడింది వివాహం జరిగిన కొద్దికాలానికే, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నందుకు నూతన దంపతులకు జైలుశిక్ష విధించబడింది శ్రీమతి ఇందిరకు రాజీవ, సంజయ అని ఇద్దరు కుమారులు కలిగారు కొంతకాలం కుటుంబమంతా అలహాబాదులోని స్వగృహం ఆనందభవన్‌లోనే వున్నారుగాని తర్వాత స్వాతంత్ర్యానంతరం ఢిల్లీకి వచ్చేశారు

1947లో దేశవిభజన జరిగిన అనంతరం మతకల్లోలాలు ప్రారంభమైనపుడు, మహాత్మాగాంధీ ఆదేశానుసారం కల్లోల ప్రాంతాలకు వెళ్ళి విశేషంగా సేవచేసింది అప్పటినుండీ ఆమె జీవిత పంథాయే మారిపోయింది సాంఘిక సేవ, దీనజన రక్షణ ఆమెకు అత్యంత ప్రీతిపాత్రమైనాయి

1955నుండి ఆమె కాంగ్రెసు కార్యవర్గ సభ్యురాలేగాక కాంగ్రెసు పార్టీలో మహిళా విభాగపు అధినేతగాకూడా పనిచేసింది

1959లో శ్రీమతి ఇందిర నాగపూరులో జరిగిన అఖిలభారత కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షత వహించింది కొరియాలో భారత సేనలు వున్నప్పుడు వారికిసౌకర్యాలు కలుగజేయడానికై ఆమె విరాళాలు పోగుచేసింది విదేశాలలో పనిచేస్తున్న భారత దళాలకై ఇంకా యీనిధి ఉపయోగపడుతూనే వుంది

1962లో చైనా దురాక్రమణ జరిపినప్పుడు సైనికుల సంక్షేమానికి నిధులు ప్రోగుచేయుట మొదలైన పనుల్లో విర్విరామంగా శ్రీమతి ఇందిరకృషిచేసింది యుద్ధరంగంలో సైనికుల సాహసాన్ని స్వయంగా చూసేందుకై అగ్రస్థావరాలకు ఆమె వెళ్ళింది

రాజకీయ సామాజిక సమస్యలలో ఆసక్తి ప్రదర్శించటమేగాక విద్యా, లలిత కళల్లోగూడా విశేష ఆసక్తి ప్రదర్శించింది ఇటీవలే సంగీత, నాటక అకాడమీ అధ్యక్ష

రాలిగా రాష్ట్రపతి ఆమెను నియమించారు. అంతేగాక గ్రంథపఠనం, ఈత, వర్షాకాలపు క్రీడలు అంటే ఆమెకు తగనిఅభిరుచి.

దేశంలో సామాన్యబీద ప్రజలందరితోనూ ఆమె సన్నిహితత్వం ఏర్పరుచుకోకలిగింది. ఇందులో తన తండ్రి సాంప్రదాయాన్ని అనుసరించింది. భారతదేశం నలుమూలలకుపోయి, గ్రామస్థులకు హిందీ భాషలోనే ఉపన్యాసాలిచ్చింది. 1937 నాటికే ఆమె విస్తృత భారత ప్రజానీకంతో ముఖ్యంగా మహిళాలోకంతో సన్నిహితత్వం సంపాదించుకోగల్గింది.

అలహాదాద్ జిల్లాలో గ్రామీణ స్త్రీలకు శిశువులకు శిక్షణకై స్థాపించిన కమలా నెహ్రూ విద్యాలయంలో, ద్రిమ్మరులైన, బాలుర శిక్షణకై 'బాల సహయోగ్, సంస్థను ఆమె స్థాపించింది. దానికధ్యక్షురాలు కూడా ఆమె. దేశంలో వివిధ ప్రాంతాలలో నెలకొల్పిన 'బాలవిహార' కేంద్రాలుకూడా ఆమె సృష్టే. భారత శిశుసంక్షేమ సంస్థకు ఆమె అధ్యక్షురాలు. అంర్జాతీయ శిశుసంక్షేమ సంస్థకుకూడా ఉపాధ్యక్షపదవి స్వీకరించింది.

కేంద్ర సాంఘిక సంక్షేమసంఘం అఖిల భారత చేతిపనుల సంఘాలలో చైతన్యయుతంగా కృషిచేస్తూ వచ్చింది. లలితకళలు, విద్యలపట్ల శ్రీమతి ఇందిరాగాంధికికలఆసక్తి సుప్రసిద్ధమే. ఆమె కేంద్ర విద్యాశాఖ సలహా సంఘంలో సభ్యురాలు, ఢిల్లీలోని అనేక సాంస్కృతిక సంఘాలతో ఆమెకు సంబంధం ఉంది. ఐక్యరాజ్యసమితి విజ్ఞాన శాఖ యునెస్కో కార్యవర్గంలో చాలాకాలం సభ్యురాలుగా ఉన్నది. ఈనాడు రిపబ్లిక్ దినోత్సవాల్లో, జానపద నృత్యాలు. సాంస్కృతిక ప్రదర్శనలు నిత్యవ్యవహారాలుగా మారటం ఆరంభంలో ఆమె జరిపిన కృషిఫలితమే. ఇవన్నీకూడా ఆమెకుఅనేక విషయాలలో కుతూహలం కలదనీ ఆమె వ్యక్తిత్వం బహుముఖంగా విస్తృతి చెందినదనీ వ్యక్తంచేస్తాయి. ఆమె వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది పెంపొందించడంలో ఎన్నో శక్తులు తోడ్పడ్డాయి.

భారత్ — పాకిస్తాన్ సరిహద్దుమీదుగా పెద్దఎత్తున అక్రమ ప్రవేశం జరుగుతున్న సమయంలోను, రెండుదేశాల సేనలమధ్య పోరాటం జరుగుతున్న సమయంలోను, — జమ్మూ — కాశ్మీర్‌లోని కల్లోలిత ప్రాంతాలను, తదితర సరిహద్దు రాష్ట్రాలను మొదటగాసందర్శించిన కేంద్రమంత్రిణి ఆమెయే.

శ్రీమతి గాంధి, తనకు తానుగా, తన తండ్రితోకలిసి ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆసియా రాజ్యాలలో విస్తృతంగా పర్యటించింది.

రష్యానుకూడా ఆమె పలుసార్లు సందర్శించింది. ప్రపంచాన్ని "ఒక్కవూపు వూపిన" అక్టోబర్ విప్లవం సమయంలో ఆమె జన్మించినందువల్ల, సోవియట్ యూనియన్ అభివృద్ధిపట్ల ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ, తరచూ ప్రసంగాలు చేసేది. అమెరికాలోనివారికికూడా టెలివిజన్ కార్యక్రమాల ద్వారాను, ప్రసంగాలద్వారాను ఆమె ఎవరో పరిచయమయింది.

ప్రపంచ విజ్ఞాన సమితి సమావేశంలో పాల్గొన్న భారతీయ ప్రతినిధివర్గానికి ఆమె నాయకత్వం వహించింది. నాలుగు సంవత్సరాలపాటు విజ్ఞానసమితి కార్యవర్గం సభ్యురాలిగా కూడా వున్నది.

శ్రీమతి ఇందిరాగాంధికి పరిపాలనా వ్యవహారాలు మాత్రం కొత్త. జవహర్‌లాల్ నెహ్రూ నిర్యాణం తర్వాతనే అంటే 1964 జూన్‌లోనే ఆమె కేంద్ర మంత్రివర్గంలో జేరింది. కేంద్ర రేడియో సమాచార శాఖా మంత్రిగా పనిచేసిన కొలదికాలంలోనే ఆమె ప్రచార యంత్రాంగంలో నూతనోత్తేజాన్ని ప్రవేశపెట్టింది. తన మంత్రిత్వశాఖ కార్యకలాపాలను చక్కదిద్దింది.

మౌలానా ఆజాద్, పండిట్ పంత్, లాల్‌బహదూర్ శాస్త్రి ప్రభుతులు, దేశఅగ్ర నాయకులందరూ శ్రీమతి ఇందిరాగాంధిని ఎంతగానో గౌరవించారు. 1964లో పార్టీ నాయకులుగా ఎన్నికైన తర్వాత ఆమెకే ప్రథమంగా మంత్రిపదవిని శ్రీ శాస్త్రి ఇవ్వజూపటం ఆమెలో ఆయనకుకల విశ్వాసాన్ని సూచిస్తున్నది. శ్రీ శాస్త్రి ఆమెకు చాలా సీనియర్ స్థానం—నాలగవ ర్యాంకు—ఇచ్చి ఆరుగురు కాబినెట్ మంత్రులు మాత్రం ఉండే మంత్రివర్గ అత్యవసర సంఘంలో ఆమెకు స్థానం ఇచ్చారు.

శ్రీ నెహ్రూ చివరిరోజులలో, ఆయనకు వారసురాలిగా, శ్రీమతి ఇందిరాగాంధిని ప్రతివారు పేర్కొనటం జరిగింది. నెహ్రూ మంత్రివర్గంలో ఆమెకు స్థానం కలిగించడానికి పెక్కుమంది సీనియర్ నాయకులు ప్రయత్నాలు జరిపినప్పటికీ, స్వాభిజాత్యం గల శ్రీమతి గాంధిగాని, శ్రీ నెహ్రూగాని ఆ అభిప్రాయాన్ని ప్రోత్సహించలేదు. పార్లమెంటు సభ్యురాలు కావడానికూడా ఆమె నిరాకరించింది.

అయితే, ఆమెకు అఖిలభారత కాంగ్రెస్ సంఘంతో అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి. 1959లో ఎ ఐ. సి. సి. అధ్యక్షపదవికి ఎన్నుకోబడేవరకూ, ఆమె కేంద్ర పార్లమెంటరీబోర్డులోసభ్యులుగ ఉండేవారు.

అధ్యక్షపదవిని, నిర్వహించిన కొద్దికాలంలోనూ, పార్టీ కార్యక్రమాలలో ఇతోధిక సమన్వయాన్ని సాధించగలిగిగారు. ఆమె నాయకత్వంతో అగ్రనాయకులకు కార్యకర్తలకు మధ్యనున్న అగాధం తొలగిపోయి, సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ కాలములోనే ప్రత్యేకభాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలన్న మహారాష్ట్ర, గుజరాత్ ప్రజల కోరికలు నెరవేరాయి. ఈ రాష్ట్రాలు ఏర్పడటంలో ఆమె గణనీయమైన పాత్ర నిర్వహించారన్నదికూడా చాలా మందికి తెలిసిందే.

శ్రీమతి గాంధి, ప్రజాశికలలోనూ, స్వయం శక్తిలోనూ, అన్నిమతాల పవిత్రతనూ కాపాడే మతాతీత రాజ్యాంగంలోనూ, గట్టి నమ్మకం ఉన్నవ్యక్తి. ఈ లక్షణాలు అలీన వైదేశిక విధానము, భారత ప్రజా

స్వామ్యానికి పటిష్ఠమైన పునాది నేర్పరిచిన వని ఆమె అభిప్రాయం. ఈ విధానాలే లేక పోతే, ఇటీవల సంభవించిన విషమ పరిస్థితినుంచి భారత్ శక్తివంతంగా ఆవిర్భవించి ఉండేది కాదని ఆమె విశ్వాసం. ఆర్థికాభ్యుదయానికి సామ్యవాదం ఒక్కటే మార్గమనీ, ఆమె భావిస్తున్నారు.

ప్రపంచమంతటా విస్తృతంగా ఆమె వలె పర్యటించినవారు మరొకరు లేరు. తండ్రితోపాటు ఆమె ప్రపంచంలో మూలమూలలకు వెళ్ళివచ్చింది. సోవియట్ రష్యా, అమెరికా, ఆసియాఆఫ్రికా ఖండాలలో నూతనంగా స్వాతంత్ర్యం అందుకొన్న ఎన్నోదేశాలు పర్యటించివచ్చింది. గత రెండు దశాబ్దాలలో ఆమె కలుసుకోని ప్రపంచ నాయకులులేరు. ఇవి అన్నీకూడా ఆమె వ్యక్తిత్వాన్ని పెంపొందించటంలో తోడ్పడ్డాయి. ఆమెనల్గురు అమెరికా అధ్యక్షులను-ట్రూమన్, ఐసెన్‌హోవర్, కెన్నెడీ, జాన్సన్‌లను కలుసుకోవటమేకాక, టిటో, నాసర్, కోసగిన్‌లవంటి మహానాయకులతో కూడా పరిచయం కల్గించుకొన్నది. ఈ వ్యక్తులతో సంభాషణవల్ల క్షణక్షణం మారుతున్న అంతర్జాతీయ రాజకీయాలలోని అంతర్వాహినులుఆమెకు అవగాహనం అయ్యాయి.

17 సంవత్సరాలు నూత్నచరిత సృష్టి అవుతూండగా ఆమె స్వయంగా చూడగల్గింది. తండ్రిని చూడవచ్చిన మహామహులందరికీ ఆమె ఆతిథ్య మిచ్చేది. చైనా భారతదేశంపై దాడి చేసినప్పుడు, దేశంలో అంతకు మున్నెరుగని అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు, శ్రీమతి గాంధి, యుద్ధరంగం ప్రథమశ్రేణులను సందర్శించి, సైనికులు ఎలా బ్రతుకున్నారో ఎలా పోరాడుతున్నారో స్వయంగా చూచి, సైనికుల సంక్షేమానికై వివిధ సంస్థలను ఏర్పరిచింది. సిటిజెన్సు సెంట్రల్ కౌన్సిల్ (కేంద్ర పౌరసంఘం) అధ్యక్షురాలుగా, జాతిరక్షణ కృషికి కదలిక కల్పించింది.

1964 లో ప్రధాని నెహ్రూ చనిపోయినపుడు ప్రధాని శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి కేంద్రంలో సమాచార మంత్రిగా రావలిసిందిగా ఆమెను ఆహ్వానించారు, ఆ మంత్రిత్వశాఖ నిర్వహించిన కొద్దికాలంలోనే వివిధ సమాచార శాఖలను, ముఖ్యంగా ఆలిండియా రేడియోను ఆమెచాలా మెరుగు పరిచింది. దేశంలో టెలివిజన్ ప్రవేశానికి ఎంతో దోహదం కల్పించింది.

తండ్రివలెనె శ్రీమతి ఇందిరాగాంధి కూడా భారతప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. ఒక కొత్త ప్రధాని ఈ విధంగా ప్రజల ప్రేమాభిమానాలను, ఆశీర్వచనాలను, విశ్వాసాన్నీ ఆదినుంచే పొందగలగడం — నిజంగా చాలా అరుదుగా జరిగే సంఘటన—తన తండ్రిపక్క సమస్థాయిలో నిలవాలంటే అదెంతటి కష్టసాధ్యమో. అందుకు ఎంతటి కార్యదీక్ష అవసరమో శ్రీమతి ఇందిరాగాంధీ గుర్తించారు. అందుచేతనే ఆమె భారత కాంగ్రెసు పార్లమెంటరీ నాయకురాలుగా ఎన్నికైన అనంతరం ప్రసంగిస్తూ ''గతంలోని మహానాయకులు వేసిన బాటలో దేశం పురోగమించాలి. వారు రూపొందించిన ప్రాథమిక విధానాలను అనుసరించాలి ... మీరునాపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను నిర్వహించగలనని ఆశిస్తున్నాను. జాతికీ, పార్టీకి సేవ చేస్తానని ప్రమాణస్వీకారం చేస్తున్నాను" అన్నారు.

ఆమె అసాధారణప్రజ్ఞ, బహుముఖ విజ్ఞానం, రాజకీయ చతురత దేశాన్ని ప్రగతి పథంలో, శాంతిమార్గంలో నడిపించగలదు అనడంలో ఎట్టిసందేహమూలేదు.

ప్రభుత్వ నిర్ణయాలు

లెవీ పద్ధతిద్వారా వడ్లను సేకరించెడి విధానం ప్రవేశ పెట్టబడిన పదిహేడు జిల్లాలకు బదులుగా తొమ్మిది సరిహద్దు జిల్లాలయిన నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురము, మహబూబ్‌నగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ మరియు శ్రీకాకుళంలలో మాత్రమే వడ్ల ఉత్పత్తిదారులనుండి వడ్లలెవీని తీసుకొనే విధానాన్ని కొనసాగించడానికి ప్రభుత్వం నిర్ణయించినది

జిల్లాలో వడ్ల లెవీ ఉన్నప్పటికినీ లేనప్పటికినీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం యిరువది జిల్లలలోను బియ్యం మిల్లుల ఉత్పత్తి మీద నూటికి 75 వంతుల చొప్పున లెవీ ఉండగలదు. కేవలము హాల్లర్లతోనె నడుస్తున్న మిల్లుల బియ్యంమిల్లులు లెవీ ఆర్డర్ నుండి మినహాయింపబడినవి

అన్ని జిల్లాలలోను డెబ్బది అయిదు శాతం చొప్పున బియ్యం మిల్లులలెవీని మిల్లులు ప్రభుత్వానికి విక్రయించిన తరువాత మిగిలినబియ్యం కలెక్టర్ వుత్తర్వులప్రకారంపంపిణీచేయబడగలదు.

వడ్లలెవీ కొనసాగుతున్న తొమ్మిది జిల్లాలయందు వడ్లు మరియు బియ్యం నిలువల వివరాలను ప్రకటించవలసిన అవసరంలేదు. ఈ తొమ్మిది జిల్లాలు గాక మిగిలిన జిలల్లాయందు నెలకు ఒకసారి వడ్లు మరియు బియ్యం నిలువల వివరాలు ప్రకటించ బడగలవు.

వడ్ల మీద లెవీ కొనసాగించబడుచున్న తొమ్మిది సరిహద్దు జిల్లాల యందు వర్షాల సహాయంతోను, నీటివనరుల సహాయం లేకుండాను పండించ బడుతున్న వడ్లమీద వడ్లలెవీ ఉండదు.

లాల్ బహద్దుర్ శాస్త్రి - ఒక పరిశీలన

పి. వి. నరసింహారావు

లాల్‌బహద్దుర్ శాస్త్రి పరమపదించి యిన్నిరోజులయినా ఆయనమరణించారని యిప్పటికీ నమ్మలేకుండా వున్నాం అతినెమ్మదియైన, స్వచ్ఛమైన కంఠమూ, పొట్టి ఆకారమూ, నిష్కల్మషమైన చూపులూ మనోవీధిలో తారట్లాడుతూనే వున్నాయి ఆయన సౌశీల్యాన్ని, సహృదయతనూ భారత ప్రజలుగాని, ప్రపంచ మానవాళిగాని తేలిగ్గా మర్చిపోలేరు ఆయన దృఢసంకల్పాన్నీ, అద్భుతమైన ఆత్మస్థైర్యాన్నీ మెచ్చుకోకుండా వుండలేరు

నెహ్రూ- శాస్త్రీలను పోలిస్తే చాలా ఆసక్తికరమైన, తెలుసుకోవలసిన భిన్నత్వాలు కనిపిస్తాయి మనకు నిజానికి అనేక విషయాలలో యిద్దరికీ సామీప్యత వుంది ప్రాతిపదిక సూత్రాలను అంటిపెట్టుకుని వుండడం, మానవత, ఔదార్యం, మాతృదేశాభిమానం, అతివాద ధోరణులకు స్వస్తిపలకడం— యిలాంటి వాటిలో యీ యిరువురికీ సన్నిహిత సామీప్యత వుంది ఈ యిరువురికీ కాంగ్రెసులో పనిచేసిన అనుభవం, శిక్షణా వున్నాయి గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంలో యీ యిరువురూ ప్రముఖపాత్ర వహించినవారే అయితే యీ పోలిక యింతవరకే ఇతర విషయాలలో ఎవరి వ్యక్తిత్వాలు వారివే

నెహ్రూలో ఒకానొక ప్రత్యేకమైన రసదృష్టి (ఈస్తటిక్ సెన్స్), రాజకీయ సిద్ధాంతాలమీద తనదైన ఒక మొండిధోరణి కనిపిస్తాయి సాహిత్య పరంగా ఒక విశిష్ట వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నారు శాస్త్రీయ విజ్ఞానంతోనూ, హేతువాదంతోనూ విడిపోలేని ఒక స్పష్టమైన తాత్వికచింతనగల వ్యక్తి వీటన్నిటినీ మించి భావ వ్యక్తీకరణలో దిట్ట చెప్పదలచుకున్నది స్పష్టంగా, వివరంగా, ఆకర్షణీయంగా చెప్పగల చతురుడు దీనివల్ల అంతర్భూతంగా ఉండిపోయిన అనేకలక్షణాలు తేటతెల్లమైనాయి ఈ లక్షణాలన్నీ నెహ్రూ విశిష్ట వ్యక్తిత్వాన్ని వెలుగులోకి తెచ్చాయని ఒప్పుకోవలసిందే అయితే యీ లక్షణాలే ఆయన ముందు కొన్ని గిరులు గీసి, ఆమధ్య ఆయనను వుంజేశాయి లాల్‌బహదూర్ శాస్త్రిది దీనికి పూర్తిగా భిన్నం అతి సాధారణ జీవితమూ, అణకువా, వాస్తవదృక్పథమూ ఆస్తికత్వమూ- యివన్నీ ఆయనలో అపురూపంగా ఒదిగివున్నాయి తను చేయదలచిన పనిలో పూర్తిగా అంకితమయ్యే గుణాన్నీ, దానిపై హృదయపూర్వకమైన అపార విశ్వాసాన్నీ ఆయనలో ఉద్దీపింపజేశాయి నిజమైన కర్మయోగివలె ధర్మపథాన్ని వీరు విశ్వసించారు వజ్రసంకల్పమూ, అచంచల విశ్వాసమూ హస్తగతం చేసుకున్నారు నెహ్రూ దృష్టిలో అతి గంభీరమూ, అర్థంకానిదీ ఏదో అది శాస్త్రిగారి దృష్టిలో అతి నిరాడంబరమైన, అతి సామాన్యమైన వాస్తవ విషయం గాంధేయ సిద్ధాంతాలకు నెహ్రూ ఆధునిక భాష్యం చెప్పితే నెహ్రూ సిద్ధాంతాలను ఆయన నాలుగుమూలల్లోకీ వ్యాపింపజేసి వెలుగులతో నింపారు అమోఘమూ, అపూర్వమూ అయిన వీరి యీ కృషి అధునాతన భారతావనిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది నెహ్రూ, శాస్త్రీలను పోల్చడానికి ఒక చిన్న ఉదాహరణ చాలు నెహ్రూను సమున్నత హిమాలయగిరి శిఖరంగా అభివర్ణిస్తే శాస్త్రిని స్వచ్ఛమూ, స్ఫటిక ప్రకాశమూ గలిగి అంతరరూపాలను ప్రతిఫలింపజేయగల చిన్న మంచుముక్కగా పేర్కొనవచ్చు

ఒక విషయం మర్చిపోగూడదు నెహ్రూ సుదీర్ఘమైన పద్దెనిమిది సంవత్సరాలు దేశానికి సారధ్యం వహించారు శాస్త్రి పద్దెనిమిది నెలలుమాత్రమే సారధ్యం వహించారు గతుకులతో, అగాధాలతో నిండిన దారిలో అత్యంత ప్రతిభావంతంగా, శ్లాఘనీయంగా దేశాన్ని నడిపించారు పద్దెనిమిది నెలలకాలంలో ప్రతి సమయమూ, ప్రతిక్షణమూ అత్యంత ప్రధానమైన సంఘటనతో నింపి, పద్దెనిమిది సంవత్సరాల ప్రాముఖ్యతనీ యీ కొద్దిపాటి కాలానికే కలిగించారు నెహ్రూకు చైనావారి దురాక్రమణ ఒక పెద్ద గొడ్డలిపెట్టయింది దానినుండి ఆయన తేరుకోనేలేదు శాస్త్రి నాయకత్వం అసలు యీవిధమైన గొడ్డలిపెట్టుతోనే ఆరంభమయింది ప్రమాదాల అంగడిలోంచే ఆయన ప్రయాణం చేయవలసివచ్చింది అడుగడుగునా అవాంతరాలే! కచ్ విషయంలో ఎంతో అనుభవశాలిగా, అత్యంత సమర్ధుడుగా శాంతికాముకుడుగా నిరూపించుకున్నారు శాస్త్రీజీ ఇటీవలి పాకిస్తాను దురాక్రమణ కాలంలో శాస్త్రి ఏ శాంతికాముకునికీ లేనంత సహనాన్ని ప్రదర్శించారు. తనదేశం ప్రాదేశిక సమగ్రతకూ, స్వాతంత్ర్యానికీ ప్రమాదం సంభవించివున్న తరుణంలో దేశ నాయకత్వాన్ని వహించే బాధ్యతగలవ్యక్తి ఎవరైనా, అతదెంత శాంతికాముకుడైనా, ఇంత సహనాన్ని

ప్రదర్శించివుంటారని భావించలేం ఇటు స్వదేశంలోనూ, అటు సరిహద్దుల వద్దా కరిన పరీక్షను వీరు ఎదుర్కొనవలసి వచ్చింది తమ స్వయంశక్తిని గుర్తించి ఏమాత్రం కలవరపాటూ, ఆర్భాటమూ లేకుండా దృఢచిత్తంతో ఎదుర్కొన్నారు అతి స్వల్పవ్యవధిలోనే కీర్తిశిఖరాన్ని అధిరోహించారు తాష్కెంట్ ఒప్పందంతో వీరి కీర్తి పతాకస్థాయి చేరుకోగానే, తన ఉద్యోగవిధి నిర్వర్తించబడింది గనుకా, జీవితం సఫలమైంది గనుకా యిక జీవించవలసిన అవసరం కనిపించలేదన్నట్టు అకస్మాత్తుగా అదృశ్యమైపోయారు వారి మరణం అత్యంత విషాదకరమైనది అయితే అదొక అపూర్వమైన, అద్భుతమైన విషాదం ఆ మరణం బహు కొద్దిమందికే ప్రసాదించబడుతుంది

సిద్ధాంతరీత్యా గాంధీ, నెహ్రూ, శాస్త్రి- వీరు ముగ్గురూ ఒకే కోవకు చెందినవారు ఇలా అన్నంతమాత్రంచేత ఒకొరికొకరు కార్బనుకాపీ కావలసిన పనిలేదు ప్రవక్త, నాయకుడు— యీ యిరువురి మేలికలయికే గాంధీజీ అన్నివిధాలా నాయకుడి గుణగణాలుగలిగిన సామాన్యమూర్తి–నెహ్రూజీ. మరి శాస్త్రీజీయో ... ఆయన వేరు ఆయన నాయకుడూ, కార్యకర్తా — యీ రెండింటి మేలికలయిక ఒక విధంగా నెహ్రూకన్న యీయనే గాంధీజీకి సన్నిహితుడనవచ్చు. గాంధీ తత్వానికి భాష్యకారకుడు నెహ్రూజీ అయితే, శాస్త్రి దానిని ఆచరణలో పెట్టిన క్రియాశీలుడు తెలియనివిషయాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఆయనకు వుండి అందువల్లనే అటు జ్ఞానులమధ్యా— యిటు జనసామాన్యులమధ్యా హత్తుకుపోయి తిరగగలిగారు. ఈ విషయంలో యీయనకు యీయనే సాటి

ఒక నిర్ణయాన్ని చేయడంలో ఆయన తీసుకునే చొరవే ఆయనప్రతిభకు తార్కాణం అలా చేయగలగడం ఒకపట్టాన అయ్యేపని కాదు చాలా కష్టసాధ్యమైనపని అది బాగా యోచించి, పూర్వాపరాలు ఆలోచించి సమగ్ర పరిశీలనానంతరం చేసిన నిర్ణయాలు అవి అని అనడంలో ఏమాత్రం సందేహం వుండదు యుద్ధంలో విజయలక్ష్మిని అంటిపెట్టుకునే అదృష్టదేవతకూడా వుంటుందని భావించడం ఎల్లవేళలా నిజం కాదని ప్రతి బహిరంగసభలోనూ ఆయన నొక్కిచెప్పుతూ వచ్చేవారు, తనప్రజలను గూర్చి బాగా అవగాహన చేసుకుని వారి శక్తియుక్తులు వెనుకబడిపోయే ప్రమాదాన్ని రానివ్వక నిత్యమూ వారిని ప్రబోధించాలన్న అవసరాన్ని గుర్తించినట్టు యిక్కడ స్పష్టపడుతుంది మనకు. వీరి వాస్తవ దృక్పథానికి, ముందుచూపుకు యిదే తార్కాణం

సుదీర్ఘమైన తన రాజకీయ జీవితంలో అటు రాష్ట్రంలో వున్నప్పుడుగానీ, యిటు కేంద్రంలో వున్నప్పుడుగానీ శాస్త్రీజీ ఎవరికీ ఎప్పుడూ ఇబ్బందికరంగా తయారు కాలేదు అంటే అర్థం–నలుగురికీ నచ్చని నిర్ణయాలు తీసుకోకుండా వున్నారనికాదు తను తీసుకునే నిర్ణయాలలో ప్రత్యక్షంగా తను కనిపించరు ఆ విధంగా జాగ్రత్తపడతారు దెబ్బ కనిపించకుండా కొట్టడమంటామే– అదీ అన్నమాట ఈ విషయంలో బహు చతురుడు యీయన ఈయన విజయానికి తెరమరుగు కారణం యిదే, నెహ్రూ వారసుడిగా కలనైనా తలంచని నాయకత్వ పదవికి ముక్తకంఠంతో ఎన్నుకోబడడానికి కూడా యిదొక కారణం

మనమంతా సరిగా గుర్తించని విషాదం ఒకటి ఆయన జీవితంలో వుంది పేదతనంలోనే ఆయన జీవించారు పేదతనంలోనే మరణించారు ఆయన వ్యక్తిత్వానికి ఇదొక కొత్తచూపు వారి శ్రీమతికి భృతినీ, పిల్లలకు ఉపకారవేతనాలనూ యిచ్చినా కూడా ప్రత్యామ్నాయంగా అగుపించని అతి విషాదమైన విశిష్ట వ్యక్తిత్వం అది ఆయనలో నిజమైన భారతీయత జీర్ణించుకుపోయివుంది. స్వామీ రామతీర్థ శిష్యుడాయన గృహస్థాశ్రమం నిర్వహిస్తున్నప్పటికీ నిజానికి ఆయన అసలైన సన్యాసిగానే జీవించి, మరణించారు శరీరంలో ఆత్మ ప్రవేశ నిష్క్రమణాల వలెనే, ఇహలోకంలోకి అడుగుపెట్టి వెళ్ళిపోయారు

చరిత్రగతిలో శాస్త్రి పూర్తివ్యక్తిత్వం తేటతెల్లం కాకపోదు రాజకీయ జీవితంలో చాలాకాలం వారు తెరమరుగుననే వుండిపోయారు కష్టాలు ఒక్కుమ్మడిగా వచ్చిపడ్డాయి, ఆ చిక్కుల్ని ఒకదానితర్వాత ఒకటి విప్పుకుంటూ వచ్చారు ఈ కొద్దిపాటి కాలంలోనూ ఆయన చేపట్టిన ప్రతి సమస్య యించుమించు విజయవంతంగా పరిష్కరింపబడడమో, చివరి మెట్టుమీద తొలగిపోవడానికి సిద్ధంగా వుండడమో— మనకు కనిపిస్తుంది ఇలాంటి సమయంలో మన నావికుడు కన్నుమూశాడు ఐతే యీ యాత్రకు అంతంటూ లేదు మరో సురక్షిత స్థానం జేరుకునే వరకూ తుఫానుగాలుల్నీ, విషనాలుకల్తో ఎగసిపడే అలల్నీ, భీకర కరవాలాల్లాంటి పిడుగుల్నీ దాటుకుని ధైర్యస్థైర్యాలతో సాహసంగా ప్రయాణించాల్సివుంది ఈ కల్లోల జలధిని వెనక్కునెట్టుకుంటూ మరో ప్రశాంత సాగరగర్భంలోకి ప్రయాణించాలి ఆ తర్వాత మరో మజిలీ. ఈ ప్రయాణానికి ముగింపంటూ లేదు

ఏ యిద్దరు నాయకులూ ఒకేలాగున వుండరు భారతదేశంలో మరో గాంధీ

పుట్టబోరు అలానే మరో నెహ్రూజీ, మరో శాస్త్రీజీ కూడా ఈనాడు భారతభారతదేశానికి కావలసింది కేవలం ప్రధానమంత్రి కాదు ఒకగొప్ప నాయకుడుకాదు కోట్లాది భారతీయుల హృదయారామాలలో ప్రతిష్ఠించదగిన మూలవిరాట్టు కావాలి తమ నాయకుని అడుగుజాడల్లో నడవడమే కాదు భారతీయులకు కావలసినది, ఆయనను ఆరాధించాలి. నాయకుడిని అనుసరించాలన్న వాంఛ ఎంత గాఢంగా భారతీయ హృదయాలలో స్పందిస్తుందో ఆయనను ఆరాధించాలన్న భావం అంత గాఢంగానూ పెనవేసుకుపోయి వుంటుంది. ప్రజాస్వామ్యం విజయవంతమై వుండకపోతే శాస్త్రి జీవితానికి అర్థమేలేదు గాంధీవల్ల నెహ్రూ ఎలా వచ్చారో, ఇరువురివల్లా శాస్త్రికూడా అలానే వచ్చారు. ప్రజాస్వామిక వ్యవస్థే అలాంటిది. గాంధీ, నెహ్రూ, శాస్త్రీల సమ్మేళనంతో రేపు మరో నాయకుడు తలెత్తుతాడు అందువల్ల మన ప్రియతమ నాయకుని మరణానికి మనం దుఃఖిస్తూ కూర్చోనవసరం లేదు. భవిష్యత్తును భయంకరంగా ఊహించుకో నక్కరలేదు నిరాశను వింపుకో నక్కరలేదు. మనం చేయవలసిందల్లా ప్రజాస్వామ్య పతాకాన్ని ఉన్నతంగా ఎగరేయాలి రాజకీయంగా ప్రజలు పరిణతి చెందాలి సాంఘికచైతన్యం ప్రజల్లో నెలకొనాలి అదీ మనం చేయాల్సింది అప్పుడు ఈ దేశంలో వెలిగిన భానుడు జగజ్జేగీయమానంగా ప్రపంచాన్ని యావత్తూ కాంతి దీధితులతో పునీతంచేస్తాడు గ్రహణం పట్టినందుకు మనం దుఃఖిస్తాం, నిజమే, దుఃఖించకతప్పదు. అయితే గ్రహణాలు పడుతూవుంటాయి, తొలగిపోతూ వుంటాయి కాని లోకాన్ని వెలిగించే ఈ సూర్యుడు — లోకబాంధవుడు — మాత్రం నిత్యమూ ప్రకాశిస్తూనే వుంటాడు ✻

పల్లెసీమ నవ్వింది

చిట్టిమల్లె శంకరయ్య

పంటచేను కంచెపైన
పాలపిట్టల పారద్రోల
వడిసెల రివ్వురివ్వున
వడిగా కొసరికొసరి విసురు
పల్లెపడుచు పల్లెపాటు
పిల్లగాలిలో తూగాడ
పల్లెసీమ నవ్వింది
పంటచేను ఊగింది

నీలాటి రేవునుండి
కల్లాకపటంలేని పడతి
కడువ చంకనబెట్టి
పిడికెడు నడుం తూగాడ
ఎదను దోపు నడకలతో
ఇంటిదారి వస్తుంటె
పల్లెసీమ మురిపెంతో నవ్వింది
తోటలోని నాగమల్లె విరిసింది

మడిదున్నే రైతురాజుకు
మరులు మనసు మూటగట్టి
సద్దిమూట చంకబెట్టి
సాగివచ్చు పల్లెపడుచు
ముగమున ముత్తెమంటి చెమట మొలచింది
ముక్కు ముక్కర ఎగసి ఎగసి ఆడింది
పట్టణానికి కన్నుకుట్టింది
పల్లెసీమ ముద్దుగా నవ్వింది

కొమ్మమీది కోయిలమ్మ
కమ్మని పాటపాడ
మామిడిచిగురు తోపుల్లోనుండి
మరుడు గురితో తూపువేస్తుంటే
ఊరిబైటి తోటలో పసిమి పడుచుపిల్ల
కోరుకున్న ప్రియునిఒడిలో నిద్రపోతుంటే
పాపి ఎవడేని పొంచిచూస్తే
పల్లెసీమ హేళనగా నవ్వింది

గుండెలు చిగురొత్తునట్టి
కొండవాగు మలుపులోని
సెలయేరు గలగలా యని
అలలతో ఆడి పాడ
చెట్టుచెట్టు ఊగింది గుట్టగుట్ట పెరిగింది
పుట్టలోని కోడెనాగు లేచి ఆడింది
ప్రకృతిమాత ఒడిలోన
పల్లెసీమ పసిపాపలా నవ్వింది

పయిటకొంగు బిగించి
పల్లెపడుచు చేటపట్టి
తూరుపార పడుతుంటె
మేరువులా ధాన్యరాశి పెరిగింది
వేడుకతో రైతు ఎడద పొంగింది
దేశానికి అభ్యున్నతి హెచ్చింది
పట్టరాని సంబరంతో
పల్లెసీమ నవ్వింది

పడమరదిస సందెకెంజాయ అలరింది
పశులు మొయిలుదారి గూడుచేర వస్తుంటె
కోరికోరి కొమ్మమీది రాచిలుకను
గోరువంక మచ్చికతో చికిరింతలాడింది
పంటచేనువీడి ఇల్లాలిపై మరులుగొని
పల్లెదారిపట్టి కాపుబిడ్డ వస్తుంటే
కాపుబిడ్డ దేశానికి జీవగఱ్ఱయని
గర్వంగా పల్లెసీమ నవ్వింది.

భాగ్యచక్రం

ఆరెకపూడి కౌసల్యాదేవి

4

శ్రీహరి బెదురుతూ తండ్రిదెస చూచాడు

శ్రీపతినేత్రాలు నిప్పులు కురిశాయి

"నువ్వు నోర్మూయ్యరా నగేష్ కూసేగాడికి వచ్చి మేసేగాడిదను పాడుజేసిందట !"

"నోరు మూసుకోవలసింది నేనుకాదు మామయ్యా నువ్విలా లక్షలులక్షలు కట్నం తీసుకుంటున్నావని తెలిసి ఏ సీఐడీ లైనా వస్తే అప్పుడెవరు నోరుమూసుకోవలసింది? నీకో కూతురుపుండీ, పరాయి ఆడపిల్లను యిలా నగుబాట్లపాలు జేస్తున్నావా ? ఏరా శ్రీహరీ, నీకైనా సిగ్గులేదూ ఇంతవటకూ వచ్చాక యిలా అల్లరిజేయడానికి ? భార్యకు తిండిపెట్టలేని అప్రయోజకుడివా ? ఆడపిల్ల ధనంమీద బ్రతుకుతావా ?"

"నగేష్," శ్రీనాథ్ గర్జించాడు "అంత కంటె నువ్వింకా అధికంగా మాట్లాడితే మర్యాద దక్కదు జాగ్రత్త !"

"ఆగండి," శ్రీలక్ష్మి కంఠం కంచు గంటలా మ్రోగింది అందరూ ఆశ్చర్యంతో అటు చూచారు "మాగురించి మధ్యన మీకు నిష్ఠురాలు వద్దు మీకు మాపై అభిమాన మున్నది, అంతేచాలు మీ రెవరో తెలియక పోయినా మీకు కృతజ్ఞతలు," అన్నది శ్రీనగేష్‌ను ఉద్దేశించి

శ్రీనగేష్‌తోసహా అందరూ ఆమె ధైర్యస్థైర్యాలకు విస్మయంజెంది చలన రహితులైపోయి చూడసాగారు.

"నాన్నా," స్థిరంగా, గంభీరంగా కుమార్తె తనను సంబోధిస్తూంటే తలెత్త లేకపోయాడు శ్రీనివాసరావు

"నాకు కట్నంయిచ్చి వివాహంచేయ నిశ్చయించారా నాన్నా ? అది నా ఆదర్శానికి వ్యతిరేకమని తెలిసి ఎందుకీ పనిచేశారు ? పైగా అది నా నుండి రహస్యంగా దాచి పెట్టారా ?"

అప్పటికే శ్రీనివాసరావు అవనతవదనం పైకి లేవలేదు

"హుం ! ఎంతటి బ్రతుకు బ్రతికినా, ఎంతటి ఉద్యోగాలుచేసి ఊళ్ళేలినా, ఆడ పిల్లను కనడంతో తండ్రు లిలా దిగజారి పోతారు కాబోలు !" స్వగతంగా అన్నట్లే అన్నది శ్రీలక్ష్మి పైకి అందరికీ వినిపించేట్లుగానే "నేను చదువుకుంటున్నాను త్వరలోనే డాక్టర్నై ప్రయోజకురాల్ని కాబోతున్నాను. నా నీడనే పదిమందిని బ్రతికింప జేయగలదాన నౌతున్నాను రూపానికిలోటు లేదు, గుణానికి లోటులేదు మరి, మారని వస్తువులాగా నెత్తిన యింత సొమ్ము పుంచి మరీ కసిని వదిలించుకున్నట్టు వదలించుకో జూస్తున్నారంటే ఏమనుకోను ? లేక నా నీతి నిగ్రహాలపై మీకు నమ్మకం లేదా ?"

"అమ్మా !" బాధతో ఊగిపోయాడు శ్రీనివాసరావు "నువ్వు కూడా ఈ తండ్రి మీద మాటలు విసురుతున్నావా తల్లీ ?"

అందమైన శ్రీలక్ష్మి వదనంలో అరుణిమ తాండవించింది కళకళలాడుతూన్న

జరిగిన కథ

క్రొత్తగా వైద్యశాస్త్రపరీక్షలో ఉత్తీర్ణుడైన శ్రీనగేష్‌కు తన ఊరిలోనే వైద్యశాలను పెట్టి అక్కడి బీదప్రజలకు వైద్యసౌకర్యాలు కలిగించాలని ఉంటుంది. కాలపరిస్థితులవలన శ్రీనగేష్ సైన్యంలో వైద్యాధికారిగా చేరుతాడు ఇతని ఆదర్శం భంగం అయిందని శ్రీపతి సంతోషిస్తాడు కాని ఆ శ్రీపతే, తన కుమారుడు శ్రీహరి సైన్యంలో ప్రవేశించుటకు తనని అనుమతి కోరగా చాల దుఃఖపడుతాడు శ్రీహరి సైన్యంలో చేరుటకు ఢిల్లీ వెళతాడు శ్రీహరిని సైన్యంలోంచి మాన్పించి శ్రీపతి అతనికో సంబంధం ఆవూళ్ళోనే ఏర్పాటుచేస్తాడు వధువు శ్రీలక్ష్మి మెడిసన్ చదువుతుంది కట్నం లక్షాపాతిక వేలు – పెళ్ళికిముందే యిచ్చేట్టు ఒప్పందపడతారు కట్నంసొమ్ములో పాతిక వేలే యివ్వగలుగుతాడు వధువుతండ్రి శ్రీనివాసరావు, మిగతాది పొలం అమ్ముడు పోవక పోవటంవల్ల యివ్వలేక పోతాడు పెళ్ళిపందిట్లో రసాభాసజరుగుతుంది

కనులను కోపం ఆవరించింది కోమల కంఠస్వరాన్ని కర్కశత్వం కైవశం చేసుకొంది. సరళ స్వభావాన్ని కారిన్యతా విర్మొగమాటాలు స్వంతం చేసుకున్నాయి ఒక్కసారి వినోదంగా, జాలిగా చూస్తున్న అందరివైపూ చూస్తూ నిర్భీతిగా ప్రశ్నించింది: "మరి ఏ మన మంటారు నాన్నా ? వీ రందరూ ఎందుకిలా నన్ను ఈనాడు హేళనగా, జాలిగా, చూడాలి? ఎందుకు నే నిలా నలుగురిచే పరిహసింప బడాలి ? ఎందు కిటువంటిస్థితిలో న న్నిమిడ్చారు? కాస్త తిండీ, బట్టాయిచ్చి, చదువు చెప్పించుకొని మీ కూతుర్ని మీ యింట్లో సుఖంగా వుండనీయడానికి ఏ మభ్యంతరం వచ్చింది లక్షాపాతిక వేలు పోసి నన్ను మరొకరికి దానం చేస్తున్నారు ? ఈ ఉన్న దంతా నాకే యిచ్చి మిగిలిన పిల్లల నేం చెద్దామనుకొన్నారు !"

శ్రీనివాసరావు మందస్వరంతో అన్నాడు "నేను కోర్టు మునసబుగా, జడ్జీగా పనిచేసినప్పుడు ఈ శ్రీపతిగారికి ఎన్నో వ్యవహారాలలో ప్రతిఫలాపేక్ష లేకుండా అనేక సాయాలు చేశాను వరుడు చక్కటివాడు, విద్యావంతుడు అని వదలుకోలేకపోయాను నాచే ఎన్నో ఉపకారాలు పొందిన శ్రీపతి ఈ మాత్రం ఆదుకోలేడా అనుకొన్నాను "

"హుఁ !" నిర్లక్ష్యంగా అన్నది శ్రీలక్ష్మి "మనిషిలో ఆ మాత్రం విశ్వాసమే వుంటే శునకానికి ఈ ప్రపంచంలో అంత విలువ ఎందుకుంటుంది నాన్నా ? అక్కర్లేదు ఇంత హీనంగా దిగజారిపోయిన ఈ వ్యవస్థ సమూలంగా నాశనమైపోయి, కన్యలందరూ ఆజన్మాంతం అవివాహితలుగానే వుండిపోయినా నాకు చింత లేదు కాని ఈ పాడు పద్ధతి మాత్రం నేను హర్షించలేను "

"అమ్మాయ్, కాబోయే అత్తవారినే మాటలు మీరుతున్నావ్," శ్రీపతి హెచ్చరించాడు

"అత్తవారు !" హేళనగా పలికింది శ్రీలక్ష్మి "మరలకంటె హీనమైపోయిన మనుషులు ఇక బాంధవ్యాలూ, వరసవావిలూ ఎక్కడ ? ఇక ఆ ఆశలేమీ లేవు అయ్యా, వెళ్ళిరండి ఇంత కఠినాత్ములైన మీకు కోడరికమూ, అంత అప్రయోజకుడైన మీ అబ్బాయికి కాపురమూ చేయవలసిన కన్య ఎవరో చాలా దురదృష్టవంతురాలు "

"ఛీ ఛీ, అవమానం ?" శ్రీనాథ్ శ్రీరాంలు కాలితో నేలను తన్నుతూ అరిచారు

"అవుమ మాకు జరిగిన అవమానానికి ప్రత్యవమానం ఇది. మా నాన్నగారు పెళ్ళి చేయడానికీ, మీరు చేసుకోవడానికీ నే నేమీ బొమ్మను కాను ఈ జన్మలో ఇక మీకూ మాకూ బంధుత్వం కుదరదు సత్వరం వెళ్ళిరండి "

"అమ్మా ! తల్లీ ! ఏమిటిది ? ఇది మనకే అవమానం ఆ విషయాలు నేనెలాగో సర్దుబాటు చేసుకొంటాను నువ్వు మాట్లాడక ఊరుకో తల్లీ," అంటూ శ్రీనివాసరావు తిరిగి శ్రీపతిని బ్రతిమాలుకోబోతూ కుమార్తె పిలుపువిని ఆగిపోయాడు

"నాన్నా ఇకవారిని మీరు ప్రాధేయపడ్డారంటే నామీద ఒట్టే ప్రాజ్ఞులూ, వివేక



వంతులూ అయిన ఆడపిల్లలను కూడా ఈ దేశంలో తలిదండ్రులు లిలా ఇంకా పిన్న వారిని- అమాయకులనూ చూచినట్లే చూడ డంతోనే సమస్య లిలా అధికమైపోతు న్నాయి ప్రభుత్వంవారి ప్రణాళికలు పాడై పోతున్నాయి యువకులవల్లా, పెద్దలవల్లా మాసిపోని ఈ వరకట్న దురాచారాన్ని నామరూపాలు లేకుండా నశింపజేయడానికి ఇక యువతులే కంకణం కట్టుకోవాలి ప్రభుత్వం వద్దని శాసించినప్పటికీ కట్నాలు యిచ్చేవారు యిస్తున్నారు, తీసుకునేవారు తీసుకుంటున్నారు వరులు నిర్లజ్జగా అమ్ముడై పోతున్నారు ఛీ ఇంతింత డబ్బుపోసి కన్నవారిని ఉసురుపెట్టి ఒక విశ్వాసఘాతకుని, అప్రయోజకుడిని కొను క్కుని అతడి వంశాభివృద్ధి చేసేకంటే అభిమానవతియైన కన్య ఆజన్మాంతం కన్యత్వంతోనే హాయిగా వుండిపోతే మేలు అసంభవమైననాడు కళ్యాణంకంటె మరణమే మంచిది ”

వధువుతల్లి పరుగు పరుగున వచ్చింది లోనుండి కుమార్తెనోరు చేతితో మూస్తూ “అనుకోని ఈ సంఘటనకు అమ్మాయిమతి కాస్త చెదరినట్లుంది అన్నగారూ మీరు క్షమించాలి అనుకున్న ముహూర్తం దాటి పోకుండా కాస్త ఆ మూడుముళ్ళూ పడనీ యండి తర్వాత డబ్బు యిచ్చుకుంటాం లేకుంటే పిల్ల ఏ అఘాయిత్యానికైనా పాలు పడే ప్రమాద ముంది.” అంటూ శ్రీపతిని బ్రతిమిలాడసాగింది

“చాల్చాలు ఈ పొగరుమోతుపిల్ల మన కెందుకు?” అని శ్రీరాం శ్రీనాథ్‌లు వగరు స్తున్నప్పటికీ డబ్బే ప్రధానంగాగల శ్రీపతి వ్యవహారం మొదలుకే బెడిసికొడ్తోందని గ్రహించి, మెత్తబడబోయాడు “పోనీ, చిన్నపిల్ల మాటలకేంగాని, ఆ భూమి ప్రస్తు తానికి మాపేర వ్రాయించేయండి తర్వాత డబ్బు సర్దుబాటుచేద్దురుగాని ”

“ఆ మాటలన్నీ అనవసరం ” ఖండి తంగా అన్నది శ్రీలక్ష్మి. “నాకేమీ మతి చెదరలేదు బెంగపెట్టుకోవడానికి, మతిచెడి అఘాయిత్యాలు చేయడానికీ నేనేమీ తెలివి తక్కువదానను కాదు ఎవరో కటికవాళ్ళ కోసం, కన్నవారి కడుపులో కార్చిచ్చు పెట్టను మీరంతా నిశ్చింతగా వుండండి అమ్మా నేనేమీ తొందరపడను కాని మీపై మాత్రం యిక నా వివాహబాధ్యత లేదు. కులం, మతం, ధనం పట్టుకు వ్రేళ్లాడకుండా ప్రాజ్ఞత వచ్చినా పసిదానికిమల్లె తలిదండ్రు లపై బాధ్యత మోపకుండా ప్రతికన్యా తన వరుని తానే ఎంచుకొంటే డబ్బును పిండే ఈ రాబందులందరి రోగం అణగిపోతుంది ఇక నేను ఆపనే చేయదలచుకున్నాను... ఇది కళ్యాణవేదిక కాదు అవమాన సభ ఛీ పౌరోహిత్యాలు, పెద్దలు, మంత్రాలు, హోమాలూ, కంకణాలూ, బాసికాలూ! ఓహ్! ఈ అన్నిటికీ విలువా పవిత్రతా ఒకనా డున్నాయేమో కాని ఈనాడు లేవు ఈనాడు వీటి అవసరమే లేదు మనిషి స్వార్థం ముందు ఈనాడు మీరందరూ — ఇవన్నీ ఏమీ చేయలేవు వీటితో నిమిత్తంలేని పవిత్రమైన మనోబంధం మాత్రమే నేడవ సరం ఏబాహ్యబంధనాలూ వివాహబంధాలూ కాజాలవు '' నుదుట బాసికం, చేతికళ్యాణ కంకణం తీసి నిండుగా ప్రజ్వరిల్లుతూన్న హోమగుండం లోనికి విసిరేసి విసవిసా తన గదిలోనికిపోయి తలుపు మూసుకున్న శ్రీలక్ష్మిని ఎవరికి వారే చిత్రప్రతిమలై, మౌనంగా చూస్తూండిపోయారు

''ఛీ, ఇది ఒక ఆడదా? ఇక దానికే కాదు, ఈ ఊరి ఆడపిల్లకే పెళ్ళికాదు గయ్యాళిమేళం ” చిరచిరలాడుతూ శ్రీపతీ, కొడుకులూ తిరుగుముఖం పట్టారు

“మాటలు తిన్నగా రానీయ్ లేకుంటే ఊరు దాటవ్” యువకుడు చేతికఱ్ఱ నేలకెట్టి కొట్టి సవాలు చేశాడు

“ఔరా కలికాలం!” అన్నా డొక వృద్ధుడు, శ్రీలక్ష్మి ప్రవర్తనను నిరసిస్తూ

“పొయ్యే కాలం నాయనా!” వంత పాడింది ఒక వృద్ధవనిత

“ఫర్వాలేదు ఏ ఆడపిల్లా చేయని సాహసం యివ్వాళ ఒక్క ఆంధ్రుల అమ్మాయి చేయడం నిజంగా గర్వకారణం. ప్రతి ఒక్కరూ యిలావుంటే ధనమదాం ధుల పొగరణగిపోదూ?” అంటూ వ్యాఖ్యా నించిం దొక యువతి

“ఆహాహా! ఏం 'నావెల్టీ!' ఏం 'నావెల్టీ' ఈ అమ్మాయి ముందు ఏ హీరోయిన్ కూడా దిగదుడుపే! ఈ సీనేగనుక ఏ సినీ డైరెక్టరైనా చూచివుంటే గుండెలు బాదు కొని వుండును, తక్షణం తన సినీమాలోకి కాపీకొట్టేసి వుండును పీటలమీద చెడిపో యిన కల్యాణంలో, వరునికాళ్ళు పట్టి కడి వెడు కన్నీరు కురిపించే కన్యలను చూచి చూచి విసుగెత్తిపోయారు ప్రేక్షకులు!” అంటూ ఆశ్చర్యపడిపోయా డొక కాలేజీ విద్యార్థి

కళకళలాడే కళ్యాణమండపమూ, గృహమూ క్షణాలలో వెలవెలబోయాయి. జనం అంతా వెళ్ళిపోయి, “ఇక ఏం చేయడం? ఎలా తలెత్తుకోవడం? పిల్ల కిక ఈ జన్మలో పెళ్ళి ఔతుందా?” ఖాళీ కల్యాణ మందిరం దగ్గఱ నెత్తిన చేతులు వేసుకొని తమలో తాము అనుకుంటూ దుర పిల్లుతూన్న శ్రీనివాసరావు దంపతుల చెంతకు వచ్చాడు శ్రీనగేష్

“మీరా బాబూ! మీరు వాళ్ళతో వెళ్ళిపో లేదా?” శ్రీనివాసరావు ప్రశ్నించాడు

“లేదు ” మందగంభీర స్వరంలో విచారం మేళవించింది “అందరిలాగా బాధ్యతలేకుండా వెళ్ళిపోవ మనస్కరించ లేదు. నాకు బాధ్యత వున్నా లేకపోయినా మగపెళ్ళివారి తరఫున వచ్చాను, జరిగిన దంతా చూచాను మిమ్మల్ని సముదాయించి, క్షమాపణలు తెలుపుకొనవలసిన బాధ్యత మనిషిగా నాపైన ఉన్నదనుకుంటాను. అందుకే హడావుడి అణగి మీరు కాస్త స్థిమితపడేవరకు బయట వేచివున్నాను.”

దంపతులు ఆశ్చర్యంగా చూచారు అత డిని “మీ రెవరో ఈ కాలపు మనుష్యులు

లా లేరుబాబూ ఇంకా ఇటువంటి మనుష్యులున్నారన్నమాట!" అన్నాడు శ్రీనివాసరావు కన్నులొత్తుకుంటూ.

అతడి భార్య అన్నది "మా ఖర్మ ఎవరి ఓదార్పు మాత్రం ఏం చేయగలదు బాబూ? అయినా అసలు వాళ్ళకే లేని విచారం మీ కెందుకు? ఆడదైన తర్వాత అంత అహంకారమా? ఎవో ఒడుదుడుకులొస్తాయి అంత మాత్రాన పదిమందిలో అలా రెచ్చిపోవడమా?"

"కాదు కాదు, క్షమించండి మీరు పొరపడ్తున్నారు,'' చాలా నొచ్చుకుంటూ మాట్లాడాడు శ్రీనగేష్ ''అణకువతో పాటు ఆత్మగౌరవం కూడా అవసరమే నండి మీ అమ్మాయిగారి ప్రవర్తనలో తప్పేమీ లేదు ఈ జరిగినదాని కంతకూ ఒక మగవాడిగా నేను చాల సిగ్గుపడ్తున్నాను అన్ని అక్రమాలకూ నోరు మూసుకు అణగిమణగి పడివుండే ఆడ జాతిలో నేటికి ఒక్కయువతైనా యిటువంటి ఉన్నత విప్లవాత్మక భావాలు కలిగి వుండడం నిజంగా గర్వింపదగ్గ విషయం ఆమెగా రన్నట్లు ఒక విశ్వాసఘాతకుని లక్షలుపోసి కొనుక్కునేకంటే, విశ్వాసంతో పడుండే నాలుగు కుక్కలను గుమ్మం దగ్గఱ కట్టివేసుకుని పోషించడం ఉత్తమం,''

"ప్చ్, మాటల కేంలే బాబూ, ఏదీ? ఇంతమంది వచ్చారు — ఒక్కరైనా పోనీ, 'మీ బిడ్డ కేం లోటు? నేను చేసుకుంటా' నని ముందుకు వచ్చారా? పనులలో లేని మాట లెందుకు? దీని కిక పెళ్లైనప్పుడు గదా నాకు శాంతి"

అంతలో శ్రీలక్ష్మి గాలిదుమారం లాగా వచ్చింది లోనుండి తలుపు తీసుకుని ''ఆ ముహూర్తానికే ఎవడో ఒకడు జాలిపడి ఎందుకు ముడెట్టుకోలేదూ — అని వాపోతున్నావా? అక్కర్లేదు. ఆ జాలి కాస్తా, హారతికర్పూరం లా యిగిరిపోయాక నిన్నేదో మహాపదనుంచి నేను ఉద్ధరించానూ అని, ఆ పైన జీవితాంతం దెప్పుతాడు ఇప్పుడేమీ మహాపద వాటిల్లలేదు అటువంటి జాలి నాకు మానవమాత్రులనుంచి కాదు కదా — ఆ దేవేంద్రుడి దగ్గఱనుంచైనా వద్దు," అంటూ శ్రీనగేష్ దెస తిరిగి అన్నది, "క్షమించండి నిజంగా నేను చాలా మితభాషిణిని కాని ఈ నాడు నా మనస్సూ, నోరూ నా అధీనం తప్పిపోయాయి మీరే గనుక ఇక్కడ ఈ పరిస్థితులలో లేకుంటే — నాకు పరిచయం అవ్వకపోతే నేను ఏకమొత్తంగా పురుష జాతినే ద్వేషించి ఉందునేమో?''

"పోనీండి ఆవేశం వద్దు, మీ మనస్సును శాంతపడనీయండి అంతా మన మేలుకే 'మంచివారిని దైవం పాడుజేయ' దనే నమ్మకం నా కుంది సెలవు, కానీ, మళ్ళీ కలుసుకోగలమో లేదో — ఒక్క మాట చెప్తున్నాను, కోపగించకండి నాకు తెలిసినంతవఱకూ శ్రీహరి చాలా ఉత్తముడు మంచి ఆదర్శాలు కలవాడే అయితే పెద్దలను ఎదిరించలేని నీరసత్వం వున్నది అతడిలో ఒక్క అతదేనన్నమాట ఏమిటి? ఈనాటి యువతీ యువకులలో ఎందరో ఎంతో గుణవంతులే, ఉత్తమ ఆదర్శాలు కలవారే అయితే, కుటుంబ దారిద్ర్యం పరిస్థితుల మాటున, అంతస్థుల మాటున, పెద్దల అధికారాల మాటున, బలహీనతా మెత్తదనాల మాటున ఆ ఆదర్శాలు సమాధి అయిపోతున్నాయి అంతే ఇందుకు ఏ ఒక్క వర్గంవారినీ, జాతివారినీ దూషించ పనిలేదు. యువతి ఒక విధంగా అస్వతంత్ర అయితే, యువకుడు మరొక విధంగా అస్వతంత్రుడు. అదే అప్రయోజకత! తననూ తన సుగుణాలనూ మెచ్చి, ధనాపేక్ష లేని వరుడు లభించాలని కోరుకునే తరుణి, తన సోదరుని విషయంలో మాత్రం ఆ ఉదారతను ప్రదర్శించదు కుమార్తెకు కట్నమివ్వలేక ఉస్సురనే తలిదండ్రులు, కుమారుని విషయంలో మాత్రం తారాపథాన్నుండి దిగిరారు ఇదొక పరిష్కారంలేని విషచక్రం. నా ఉద్దేశ్యంలో — యువతీ యువకులు మాత్రమే ఈ విషచక్రభ్రమణాన్ని విరుగుడు పోసి ఆపుజేయగలరని"

"నిజమే'' ఆలోచనాపూర్వకంగా తల పంకించింది శ్రీలక్ష్మి

''అందువల్ల! నేను చెప్పే ఒక్కమాట ఏమిటంటే...ఒక వేళ శ్రీహరి తన తండ్రిని సరకుచేయకుండా ధైర్యంగా మనిషిలా రావడమంటూ సంభవిస్తే ..మీరు తృణీకరించరాదు అతడు రక్తబంధనాలను త్రెంచుకోలేకున్నాడే కాని, భాగ్య భోగాల కోసం అంతగా తాపత్రయ పడడు అతడి మనస్సు మార్చడానికీ, ధైర్యస్థైర్యాలు కలుగజేయడానికీ నేనుకూడా ప్రయత్నిస్తాను నాకు అతడు చాలా కావలసిన బంధువు ఉత్తమ గుణాలు కలవాడు ఇంకొక విధంగా మీరూ ఆత్మీయులే అయ్యారు. మీ అపూర్వగుణాలను నిజంగా ఎవ్వరైనా మెచ్చవలసిందే! మరి సెలవు."

పన్నీటిజల్లువంటి అతడి వాక్చతురతకు ముగ్ధులై మూగవోయి నిలబడ్డారు శ్రోతలు శ్రీనగేశ్ కనుమరుగయ్యాడు.

(సశేషం)

ప్రబోధసుధాకరము

సంస్కృత మూలము
జగద్గురు శంకరభగవత్పాదులు

అనువాదము
'రత్నాకర'

(దేహనిందా ప్రకరణము)

నిత్యానందైక రసున్,
సత్య జ్ఞానైకరూపు, జన్మాది వికా
రాత్యంతరహితు, నీశ్వరు,
నిత్యును పురుషోత్తమాఖ్యు కృష్ణుదలంతున్ ॥

ఎవని వర్ణించుటకు శక్తి యింతలేక
మౌనమూనె సాక్షాచ్ఛృతి మాటరాక,
అట్టి పరమేశ్వరుండు మాయట్టివారి
వాక్కులకు గోచరుండౌనె వర్ణనమున ? ॥

ఇట్లెటింగియునైన నా యిద్ధమూర్తి
ధరణి పరిభాషితుండయి తనరివలయు,
ప్రవిమలాధ్యాత్మశాస్త్ర సాహముల వలన
పరమ చింతన కీర్తనాభ్యాసములను ॥

పరమ విరాగము లేకయె
పురుషుక కభ్యాస భక్తి బోధాదుల నే
వెరవుల మోక్షార్హత లే
దరయ విరాగంబు ప్రథమమగు సాధనలన్ ॥

త్రయము - వైరాగ్యమాత్మ బోధంబు భక్తి -
ముక్తిసాధనముగ నాది నుక్తమయ్యె,
నందు వైరాగ్యమన విషయాళియందు
వీత తృష్ణయటందురు విబుధమతులు ॥

తనరు నదియు నహమ్మమత్వములచేత
సర్వ దేహాళియందు ప్రచ్ఛన్నమగుచు
తనదు దేహమందు 'నహంత' తనకుచుండు,
'మమత' తనకు భార్యాది దేహములయందు ॥

ఆత్మయెద్ది ? దేహమున కాయాత్మకరయ
విషయతతికి సంబంధ మేవిధమొ ? దీని
నిటు విచారించినట్లైన నెడలునహము,
మమత, కాన విచారమే మఱకు మెపుడు ॥

స్త్రీ పురుషుల కూటమిచే
నా పతితము శుక్రశోణితాంతరమున, క
ర్మా పరిహార్యము దేహము,
ప్రాపించును జీవుడల్ల నల్లన జగతిన్ ॥

తల్లి గర్భకుహను తలమున్కగా, మల
మూత్ర కఫములందు మునిగి, జరర
వహ్నికీలలందు పక్వమౌ నవమాస
ములును, జంతువుగ్రముగ తపించు ॥

విధివశమున ప్రసవవేళ తిరశ్చీన
తాప్తి, శిశువు గర్భమందె నిలువ,
శస్త్రభేదనంబు సలిపి బలాత్కార
మున వెలార్పబడును ముప్పుకొంద ॥

కాక, గర్భనిర్గమనము కష్టతమము
యంత్రమున ఛిద్రమొనరింప నపుడు నిస్స
రణమున, ప్రసూతివాయువుల్ ప్రబలుకొనగ
కలుగు క్లేశంబు వర్ణింప నలవియగునె ॥

ఆధులును, వ్యాధులును, వియోగాత్మ యాత
నలును, దీర్ఘదారిద్ర్యము, కలహమాది
క్లేశములు, జన్మమాదిగా లేదు, నట్టి
వాని వర్ణింప శక్యమౌ వాక్కుకలదె ॥

సతము నేనుబదినాల్గులక్షల మనుష్య
మృగ విహంగయోనుల జన్మమెత్తి, తిరుగు
చును, స్వకర్మ బద్ధుండయి యనుభవించు
యాతనను జీవుడెద్ది సౌఖ్యంబు జగతి ?॥

చరమము నృదేహమంపు, ప్రశస్త విప్ర
జన్మము, స్వకులాచార విచారము, శ్రుతి
విహిత చరణములమరుట బహుళ దుర్ల
భంబు సంసారగతి దుఃఖ బంధురంబు ॥

దేహమిది నశ్వరంబను తెలివిలేక,
ఆత్మకు ననాత్మకును భేదమరయలేక
కడుపుచుందురు జీవిత కాలమెల్ల
ప్రాజ్ఞులును నిష్ఫలంబుగా భ్రాంతులగుచు ॥

హేమకోటుల నిలచిన నెచటనైన
లభ్యమగునె ఆయుః క్షణలవము జగతి ?
సర్వమాయువు మృషగాగ సాగెనేని,
అంతకన్న నేమున్నది అధికహాని ॥

విఫలముగ నరజన్మము వీటిబోవ,
ప్రాప్తమైన పశ్వాది దేహములయందు,
స్వతను సంవేదనమె లేని జడతయందు,
అరయనెచ్చట ఆ పరమార్థవార్త ?॥

సతతము ప్రవాహ్యమానముల్, తుక్కృకములు,
శ్రాంతములు, గజవృషభాశ్వ సైరిభములు,
గార్దభంబులు, పడుకష్ట గతులనయ్యొ
వర్ణనముసేయ శక్యమా, వాక్కుకలదె ॥

మాంసరుధిర మేదోస్థులు, మజ్జ, త్రివిధ
ధాతువులు కుప్పగానున్న తనువుజీటి
తినకయున్నె కాకంబులు, తనువు బాహ్య
మున త్వచాచ్ఛాదితంబయి తనరకున్న ?॥

నాసికాగ్రమునను, వదనమున కఫము,
పాయువున మలమును వెలువడ స్వయముగ,
రోతజెందు దేహము, కలరూపులీలు
తెలియడంతః ప్రస్మృతమును మలమునరుడు ॥

పథి పతితమస్థికనుగాంచి, స్పర్శ భీతి
వేఱు మార్గమునం బోవు, వెనవే...
యెముకలంతట గప్పిన యే భ్యరాశి
తనదు నెమ్మేను గనడహో : ఏ నుజు డెపుడు

అరయ కేశనఖాగ్ర పర్యంత మంత
రమున, పూతి గంధప్రపూర్ణంబు, మేని,
నగరు-కర్పూర చందనాద్యాది పరిమ
ళములనలదు, మాయావిడంబమున నరుడు ॥

యత్నమున దేహనైజ దోషాళిడాచి,
క్రమ సోపాధిక గుణాళి కడువెలార్చి,
వాని దేహగుణాళిగా ప్రస్తుతించు
మూఢుడు, విచారదూరత మోహమంది ॥

గాత్రమునగల్గు గాయము కడుగకున్న
మూడునాళ్ళు, దానజనించు ముమ్మరముగ
క్రిములు, దుర్గంధ సంకీర్ణకములు, దేహ
తత్త్వమిది, శరీరము శీర్ణతాగుణంబు ॥

పుష్పశయ్యోప శోభిత భూరితల్ప
మందు నిద్రించెనే దేహమదియె యిపుడు,
రజ్జుకాష్ఠ సంబద్ధమైన రంగుబాసి,
వహ్నికీలల త్రోయంగ బడియెనయ్యొ ॥

హేమ సింహాసనస్థుడౌ నెవనిగాంచి
మోహమందె నీలోకము, ముచ్చటపడి
అతని తనువు కాలాకృష్టమైన దాని
గాంచి, భయమున మూయును కన్నులిపుడు ॥

ఇట్టు లతి మలీమసమైన యీ శరీర
మెవనిశక్తి స్పందించు పరేశునతని
విస్మరించి అనిత్యతా విద్ధమైన
తనువున నహంత దాల్చును మనుజుడహహ ॥

అమలమైన సచ్చిద్రూపమాత్మ యెచట ?
మాంస రుధిరాస్థి నిర్మిత మలిన దేహ
మెచట ? అంచు లజ్జించు ధీమంతుడెట్టు
లన్యదేహము నాశించు నాస్థమిగిలి ॥

అడవి మల్లె

> జరిగిన కథ చంద్రానికి తలి దండ్రులు లేనందున చిన్నతనంనుంచీ అన్న కృష్ణారావు పోషణలో ఉండి, గయ్యాళి వదినె కాంతమ్మద్వారా దొంగగా నిరూపించబడి శిక్షగా రాటకు కట్టివేయబడతాడు గౌరి సహాయంతో పారిపోయి, ఆత్మహత్య చేసుకోబోతున్న ప్రకాశంను రక్షించి, అతని తండ్రి సహాయంతో అభివృద్ధిలో కొస్తాడు తన అభివృద్ధి దశలో తన ఊరికి వచ్చి నాగేంద్రంచే బలాత్కరింపబడిన గౌరిని రక్షించి ప్రకాశం ఇంటికి వెడతాడు ప్రకాశం జీవితంతో ఎన్నో మార్పులు వస్తాయి గౌరిని అనాథ శరణాలయంలో చేర్చి, తన అన్న వ్యాపార సంస్థను దర్శించి అన్నతో మాట్లాడి అన్నలో వచ్చిన మార్పులని పరిశీలిస్తాడు చంద్రం

11

"నేను దొంగగా ఆ ఇల్లువిడిచిననాడే అది నాఇల్లు కాదని నిర్ణయమయిపోయింది " ఉద్రేకంతో అన్నాడు చంద్రం

తమ్ముడు చాలా ఆవేశంలో ఉన్నాడనీ ఇప్పుడు ఇక ఎంత చెప్పినా లాభంలేదనీ అర్థం చేసుకున్నాడు కృష్ణారావు.

"సరే! నీ ఇష్టం వచ్చినచోటే ఉందువు గానిలే. ఇప్పుడు నాతో పద! భోజనం చేసి వెళుదువుగాని మీ వదిన ఎదురుచూస్తూ ఉంటుంది "

చంద్రం వదినెపేరు వినగానే అదోలా నవ్వాడు కృష్ణారావు తలదించుకున్నాడు

"క్షమించు అన్నయ్యా. నేను రాలేను ఇక నన్ను బలవంతం చెయ్యకు " అన్నాడు చంద్రం కొంచెం సౌమ్యంగా

"మాకోసం కాకపోయినా కనీసం పలకరించే రజని కోసమైనా ఒక్కసారి రారా చంద్రం" అన్నకృష్ణారావు గొంతులో బాధ ఎంత దాచుకోవాలన్నా కనిపించింది.

రజనిపేరు వినగానే చంద్రం హృదయంలో పాలసముద్రం పొంగిది కనీసం తను రజని ఎలా ఉందనయినా అడగలేదు నిజంగా తనలో ఇంత కాఠిన్యం ఉందని తనకేం తెలియదు పసిబిడ్డ రజని తనకేం అపచారం చేసింది? రజని ఎంత అయిందో? ఎలా ఉందో? ఎన్ని కబుర్లు చెబుతుందో? చంద్రం మారుమాట్లాకుండా కృష్ణారావు వెనకే బయలుదేరాడు

కారు చాలా వేగంగా పోతుంది. కృష్ణారావు చాలా ఉద్రేకంగా ఉన్నాడు చంద్రం తాపీగా కూర్చొని అన్ననే గమనిస్తున్నాడు కాని అన్నమీద కలగవలసినంత గౌరవం కలగటంలేదు అందుకే మనిషికీ మనిషికీ ఉండే సున్నితమైన బంధాన్ని తెగేంత వరకూ లాగకూడ దంటారేమో!

"చంద్రం!" కృష్ణారావు ఏదో అడగాలని ఆగిపోయాడు.

"ఊఁ" అన్నాడు చంద్రం ఎలాంటి ఉత్సాహాన్నీ చూపించకుండానే

"పెళ్ళి చేసుకున్నావా?" కృష్ణారావుకు తన అన్న తననే వెక్కిరించి నట్లనిపించింది త నేంప్రశ్న వేశాడు! చంద్రం పెళ్ళిచెయ్యవలసిన బాధ్యత ఉన్న తనే ఈనాడు ఈ ప్రశ్న వేయవలసివచ్చింది ఈ పరిస్థితి కారణంకూడా తనే ఎంత హాస్యాస్పదం!

"నాకు పెళ్ళా! పిల్ల నెవరిస్తారు చూసి చూసి ఒక దొంగకు " అన్నాడు చంద్రం చురుకుగా

మళ్ళీ ఇద్దరిమధ్యా మౌనం

కృష్ణారావుకు తమ్ముణ్ణి గురించి ఎన్ని విషయాలో తెలుసుకోవాలని ఉంది కాని చంద్రం తన ప్రశ్నకు దేనికీ సరయిన సమాధానం ఇవ్వటంలేదు.

శరీరం కాలినప్పుడు మూడురకాలుగా బాధకలుగుతుంది ఒకటి ఆ కాలిన భాగంలో కలిగే బాధ రెండు దానివల్ల శరీరం అంతటా కలిగే బాధ మూడు గాయం మానుతుంది కాని మచ్చ మిగిలిపోతుంది ఆ మచ్చ చూసినప్పుడల్లా దాని తాలూకు పరిస్థితుల జ్ఞాపకంవల్ల కలిగే బాధ, అలాగే చంద్రం ఆనాడు పొందిన అవమానం, బాధను మళ్ళీ మళ్ళీ అన్నగారి ప్రతి ప్రశ్నా జ్ఞాపకంచేస్తుంది అందువల్లనే అన్నకు సరైన జవాబులు ఇవ్వలేకపోతున్నాడు.

ప్రొద్దు వాటాలింది పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి పశువులవెనక నడుస్తూ పాలవాళ్ళు రోడ్లమీద అక్కడక్కడ కనిపిస్తున్నారు

వాసిరెడ్డి సీతాదేవి

రింగు రోడ్డులోవి కృష్ణారావుగారి రెండంతస్తుల భవనం గేటుతెరిచి వుంది ఎదురుగా వరండా గడపలమీద రజని రెండు అరచేతుల్లో గడ్డం ఆన్చి మోకాళ్ళమీద మోచేతులు పెట్టుకొని కూర్చొని వుంది ఆ బాలిక చక్రాల్లాంటి గుండ్రని పెద్దపెద్ద కళ్ళు తదేకంగా గేటువైపే చూస్తున్నాయి ఆమె ముఖంమీద నీరెండ పడుతున్నది ఆకుల మధ్యనుంచి సగం సగంగా కనిపిస్తున్న ముద్దమందార మొగ్గలా ఆమె ముఖం రెండు చెంపల్ని కప్పిన అరచేతుల మధ్య నుంచి కనిపిస్తున్నది

"ఎందుకే ఆ ఎండలో అలా కూర్చున్నావ్ ఇంతవరకూ వచ్చినవాడు ఇంటికి రాక ఎక్కడకు పోతాడులే! రా లోపలకు" అంటూ కేకపెట్టింది కాంతమ్మ తల్లి కేకను వినిపించుకోనట్లే కూర్చుంది రజని

నల్లరంగు కొత్త మోడల్ ఫియట్ లోపలకు వచ్చి ఆగింది రజని కారు దగ్గరకు పరుగెత్తింది

"చూశావా చంద్రం! రజని నీకోసం ఎదురుచూస్తూ గేట్లోనే కూర్చుని వుంది!" అన్నాడు కృష్ణారావు కారు డోర్ తెరుస్తూ

చంద్రం కారుదిగుతూనే రజనిని అమాంతంగా రెండుచేతులతో గుండెలపైకి ఎత్తుకున్నాడు

"ఎంత పెద్దదాని వయావు రజనీ!" అన్నాడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతూ చంద్రం

"మరి! ఇంకా అలాగే మూడేళ్ళ పసిపిల్లలాగే ఉందనుకున్నావా?" అన్నాడు కృష్ణారావు ఆనందం ఉబికివస్తున్న స్వరంతో

రజనిసిగ్గుపడిపోయిందితండ్రి మాటలకు వరండాలోకి వస్తున్న వదినను చూసి రజని నొసటిమీద ముద్దుపెట్టుకొని దించేశాడు చంద్రం

"బాగున్నావా వదినా?'' వదినెనుపలకరించాడు చంద్రం నవ్వుముఖంతో

"రా చంద్రం! ఎంత పెద్దవాడివయావూ? ఇంత కాలానికి మేము గుర్తొచ్చామా?' అంటూ ఎంతో ఆప్యాయం చూపిస్తూ ఆహ్వానించింది కాంతమ్మ

అంతవరకూ తన భార్య చంద్రంపట్ల ఎలా ప్రవర్తిస్తుందోనని భయపడుతూ వచ్చిన కృష్ణారావుకు తలమీదనుంచి పెద్ద భారం దించినట్లయింది ఆమె చూపుతున్న ఆదరణంతా నటన మాత్రమేనని తెలుసు కృష్ణారావుకు కనీసం అలా నటించింది అంతేచాలునని తృప్తిగా నిట్టూర్చాడు కృష్ణారావు

కుశల ప్రశ్నలు పూర్తి అయాయి కాంతమ్మ రెండు వెండిగ్లాసుల్లో కాఫీ తెచ్చి అన్నా తమ్ముళ్ళకు అందించింది సరాసరి ఇంటికి రాకుండా ఎక్కడో దిగినందుకు చంద్రాన్ని ఎత్తిపొడిచింది చంద్రం ఇంత కాలానికి తన ఇంట్లో తనవారి మధ్య కూర్చుని ఉన్నాడు వదిన ఆప్యాయతను చూసిన చంద్రం హృదయంలో దాగివున్న ఆ కాస్తకోపం కూడా కర్పూరంలా కరిగిపోయింది చంద్రం మనస్సు నిండు సంతృప్తితో తొణికిసలాడుతున్నది

గుళ్ళో దేవుణ్ణి తన్మయంలో తదేకంగా చూస్తున్న భక్తునిలా రజని ఒక్క మాట కూడా మాట్లాడకుండా బాబాయినే చూస్తూ కూర్చుంది అది గమనించిన చంద్రానికి నవ్వు వచ్చింది రజనికోసం తను ఏమీ తేలేదు

అసలు తనకు ఆ భావమే తట్టనందుకు బాధపడ్డాడు

''అన్నయ్యా! కారులో రజనీ నేనూ ఒకసారి బజారు వెళ్ళివస్తాము," అన్నాడు చంద్రం

చంద్రం భావాన్ని గ్రహించాడు కృష్ణారావు "ఇప్పుడేం బజారు వెళతావు? రేపు వెళ్లొచ్చులే తొందరేం ఇక్కడ వుండేవాడివేగా?" అన్నాడు కృష్ణారావు

''ఏంమ్మా! రజనీ! బాబాయికోసం



అంతకలవరించే దానివి తీరా బాబాయి వస్తే మాట్లాడ వేం?" అన్నాడు తండ్రి కూతురుతో.

"తను ఊహించుకున్నంత బాగాలేడేమో ఈ బాబాయి." అంటూ నవ్వాడు చంద్రం. కాంతమ్మా, కృష్ణారావుకూడా ఒక్కసారి పక్కున నవ్వారు.

రజని సిగ్గుపడిపోయింది.

"బాబాయికి నీ పుస్తకాలూ అవీ చూపించమ్మా," అన్నాడు కృష్ణారావు.

రజని ఉత్సాహంగా లేచింది. చంద్రం లేచి రజనిదగ్గరకు వచ్చి నెత్తిమీద చిన్నగా మొట్టాడు. రజని నవ్వుతూ బాబాయిచెయ్యి పట్టుకొని తనగదిలోకి తీసుకెళ్ళింది.

అంతసిగ్గుపడ్డ రజని అంతలోనే బాబాయితో కలిసిపోయింది. ఊపిరి సలపనీయకుండా కబుర్లుచెప్పింది. తన పుస్తకాలన్నీ చూపించింది. అందులో డిటెక్టివ్ నవలలూ, చవకబారు కథల పుస్తకాలుచూసి చంద్రం ఆశ్చర్యపోయాడు. ఆ పుస్తకాలను గురించి రజని మాట్లాడుతుంటే చంద్రానికి ఆశ్చర్యంతోపాటు బాధకూడా కలిగింది. చంద్రం రాసిన 'భగ్నప్రేమ'ను గురించికూడా మాట్లాడింది. రజని వయస్సుకు మించి మాట్లాడుతుందనీ, చాలా చురుకైన పిల్లనీ. కాని ఆ చురుకుదనాన్ని సరిఅయిన మార్గంలో పెట్టటానికి పెద్దవాళ్ళు ప్రయత్నించలేదనీ చంద్రం అర్థంచేసుకున్నాడు. ఆ వయస్సులో రజని ప్రేమకథలనుగురించి మాట్లాడుతుంటే చంద్రానికి కొంచెం ఎబ్బెట్టుగా తోచింది.

కొందరిలో శారీరక వయస్సుతోపాటు క్రమంగా మానసిక వయస్సూ పెరుగుతుంది. కొందరి పిల్లల్లో అసలు వయసుకంటే చాలా త్వరగా మానసిక వయస్సు పెరుగుతుంది. ఇలాంటి పిల్లలే పెద్దలకు సమస్యలుగా తయారవుతారు. ఇలాంటి వారికి సరైన అవకాశాలను కలిగించి వాళ్ళ మెదడుకు సరిఅయిన మేతపెట్టి మంచి మార్గంలో నడిపిస్తే ఇలాంటి వారే గొప్పవాళ్ళవుతారు. వారి తెలివితేటలకు సరిఅయిన మార్గం దొరకనప్పుడు తప్పు మార్గంలో పడే అవకాశం వుంటుంది. బుద్ధులు వెర్రితలలు వేస్తాయి. ఎక్కువ తెలివైన పిల్లల విషయంలో తలిదండ్రులు ఎంతో శ్రద్ధ వహించాల్సి వుంటుంది. రజని ఈ కోవకు చెందిన పిల్లే. అతి గారాబంతో ఇది మంచి ఇది చెడు అనికూడా తెలుసుకొనే అవకాశం లేకుండా పెంచుతున్నారు తల్లిదండ్రులు.

కొందరి పిల్లల అసలు వయస్సు పెరుగుతున్నా మానసిక వయస్సు మాత్రం చాలా మందకొడిగా పెరుగుతుంది.

"బాబాయ్! హేమపిన్ని వచ్చింది" అంటూ రజని లేచి తుర్రున గదినుంచి పరుగెత్తింది.

ఆలోచనల్లో ఉన్న చంద్రం ఎవరో వచ్చినట్లున్నారు, రజని వెళ్ళిందనిమాత్రమే అర్థంచేసుకున్నాడు. చంద్రం యదాలాపంగా లేచి హాల్లోకి వచ్చాడు. ఎదురుగా ప్రసాదరావుగారు అతని పక్కనే తెల్లని పట్టుదుస్తుల్లో తెల్లగా, సన్నగా, పొడవుగా, నాజూకుగా ఉన్న ఓ యువతి నిల్చొనివుంది. ఆమెను చూస్తూనే చదువూ, సంస్కారమూ, మూర్తీభవించా యన్నట్లనిపించింది. చంద్రానికి మరో క్షణంలో ఏవో భావం మెరుపులా బుర్రలో మెరిసి, గుండెల్లో 'ధక్' మని నిలచిపోయింది.

ఎవరామె? హేమ! అప్పుడే విచ్చిన మల్లెపువ్వులా ఉన్న ఈమె హేమా?

చంద్రం హృదయం తన పని మర్చిపోయింది ఓ క్షణకాలంపాటు. వెంటనే ప్రమాదాన్ని గ్రహించి తన నడక సాగించింది. కాని ఆ నడక క్రమం తప్పింది. చంద్రం మంత్రముగ్ధుడిలా హేమను అలాగే చూస్తూండిపోయాడు.

చంద్రాన్ని గుర్తించని ప్రసాదరావు కృష్ణారావుగదిలోకి వెళ్ళాడు.

తననే రెప్పవాల్చకుండా చూస్తున్న ఆ అపరిచిత యువకునివైపు చిత్రంగా చూసింది హేమ. ఆమెదృష్టి కుడిచెవుకు కిందగా మెడమీద ఉన్న పెద్ద పుట్టుమచ్చమీద పడింది.

చంద్రం పెదవులు కొంచెంకదిలాయి. కాని ధ్వని బయటకురాలేదు. ఇంతకాలంగా ఆమె హృదయాకాశాన్ని ఏలుతున్న నెలవంక ఈనాడు అనుకోకుండా పూర్ణచంద్రుడై ఆమె ఎదుట నిలచాడు. అనుకోకుండా ఆనందాంబుధిలో మునిగిపోయిన హేమకు ఊపిరి సలపటంలేదు.

తన బాబాయి, హేమ అలా ఒకర్నొకరు చూస్తూ నిలిచిపోవటం చూసిన రజనికి తమాషాగా అనిపించింది. తన చక్రాల్లాంటి పెద్ద కళ్ళను తమాషాగా తిప్పుతూ ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తుంది రజని. మొన్ననుతనుచూసిన సినిమాలో నాగేశ్వరరావూ, కృష్ణకుమారీ, అలాగే ఒకర్నొకరు చూసుకున్నారు అనుకుంది. బాబాయీ, హేమపిన్నీ ప్రేమించుకుంటున్నారు బలే! బలే! రజని తను చదివే నవలల జ్ఞానం, చూసే సినిమాల అనుభవంతో, ఆ వయస్సు పిల్లలకు సాధారణంగా అర్థంకాని విషయాన్ని అర్థంచేసుకున్నట్లనుకొని ఆనందించ సాగింది.

"ఏమోయ్ చంద్రం? ఎవరో అనుకున్నాను సుమా! ఎంత ఎదిగావు? చిన్నప్పుడు నిన్నుచూసి ఇంత స్ఫురద్రూపివవుతావనుకోలేదు సుమా!" అంటూ ప్రసాదరావు, కృష్ణారావుతో కలసి హేమా, చంద్రల దగ్గరకు వచ్చాడు.

చంద్రం, హేమా ఒకేసారి ఉలిక్కిపడ్డారు. తన పరిస్థితిని అందరూ గ్రహించారేమోనని సిగ్గుపడిపోయింది హేమ.

"కూర్చోమ్మా హేమా!" అన్నాడు కృష్ణారావు.

అందరూ కూర్చున్నారు. ప్రసాదరావు చంద్రం గురించి ఎన్నో ప్రశ్నలు వేశాడు కాని చంద్రం కొన్నిటికి ముక్తసరిగా జవాబిచ్చాడు. కొన్నిటికి అసలు జవాబే ఇవ్వలేదు. గతాన్ని జ్ఞాపకం చెయ్యటం చంద్రానికి ఇష్టం లేనట్లుందని అర్థం

చేసుకుని ప్రసాదరావు ప్రసంగాన్ని మార్చాడు హేమ చదువుగురించీ, ఉద్యోగం గురించీ చెప్పసాగాడు

''ఈ విషయాలన్నీ ఎవరిక్కావాలి? అసలు హేమకు పెళ్ళయిందో లేదో ఒక్కరూ చెప్పరేం?'' అని తనలో తనే విసుక్కున్నాడు చంద్రం ఆమెకు వివాహం అయిందో కాలేదో తెలుసుకోవాలనే ఆదుర్దా నిముష నిముషం పెరగసాగింది

సరిగ్గా అదేభావం హేమలోకూడా ఆందోళన కలిగించసాగింది హేమ మౌనంగా అందరి మాటలు వింటూ కూర్చుంది ఇన్ని విషయాలు అడిగే నాన్న చంద్రానికి అసలు వివాహం అయిందో కాలేదో కనుక్కోడేం?

కృష్ణారావుకుకూడా తమ్ముడికి వివాహం అయిందో కాలేదో తెలుసుకోవాలనే కుతూహలం తమ్ముణ్ణి చూసినప్పటినుంచీ పట్టుకుంది తను అడిగితే తమ్ముడు చెప్పడు ప్రసాదరావన్నా అడిగితే బాగుండును అనుకున్నాడు

కాని ప్రసాదరావుకు అసలు ఆ అనుమానమే వచ్చినట్లులేదు చంద్రం రూపురేఖలూ, మాట్లాడే తీరు, అతనిలో కనిపిస్తున్న సంస్కారం, చూసిన ప్రసాదరావు తన హేమ చాలా అదృష్టవంతురాలని మురిసిపోయాడు

''చంద్రం మీ అన్నయ్య ఎంత చక్కని గార్డెన్ పెంచాడో చూశావా?" చంద్రం, హేమలు మాట్లాడుకోవటానికి అవకాశం కలిగించాలనే ఉద్దేశంతో అన్నాడు ప్రసాదరావు

అబ్బే ఇంకా వాడేమీ చూడందే?

ఇంకా మేం వచ్చి గంటకూడా కాలేదు అప్పటినుంచి బాబాయికి కూతురు కబుర్లతోనే సరిపోయింది. "హేమా చంద్రానికి గార్డెన్ చూపించమ్మా." అన్నాడు కృష్ణారావు ప్రసాదరావు అభిప్రాయాన్ని తెలుసుకొని

రజని చటుక్కున లేచింది "బాబాయ్ నేను చూపిస్తాను మన తోట." అంది రజని బాబాయి చెయ్యి పట్టుకు లాగుతూ చంద్రం నవ్వుతూ లేచినిల్చున్నాడు హేమ కూడా లేచి తోటవైపు బయలుదేరింది బాబాయి చెయ్యిపట్టుకుని రజనికూడా ఉత్సాహంగా బయలుదేరింది

"చూడమ్మా రజనీ' వంటింట్లో అమ్మకు కాస్త సాయంచెయ్యి" అన్నాడు కృష్ణారావు

"వంటవాడున్నాడుగా? నేనెందుకు అమ్మకు సాయం చెయ్యాలి?'' అంది తండ్రి పురమాయింపుకు కారణం తెలుసుకోలేని రజని

"వంటసాయం కాదమ్మా కప్పులూ, ప్లేట్లూ అవీ తుడిచి సిద్దంగా పెట్టవద్దూ? మరి బాబాయి వచ్చాడని ఇచ్చే పార్టీలో ఆ మాత్రం నువ్వుకూడా పనిచెయ్యకపోతే ఎలా?" అన్నాడు కృష్ణారావు కూతుర్ని బుజ్జగిస్తున్నట్లు

రజని బుంగమూతి పెట్టుకొని అయిష్టంగా బాబాయిచెయ్యి విడిచిపెట్టి వంటింట్లోకి వెళ్ళింది హేమా, చంద్రం తోటవైపుకు వెళ్ళారు

"బాబాయి అంటే మా రజనికి ఎంత గౌరవమో చూడండి అందుకు మొదటిసారిగా నేను పనిచెప్పితే కిక్కురుమనకుండా వెళ్ళింది'" మురిపెంగా అన్నాడు కృష్ణారావు ప్రసాదరావుతో గార్డెన్ అంతా హేమా, చంద్రం, మౌనంగా తిరిగారు రకరకాల పూలచెట్లతో ఎంతో శ్రద్ధగా పెంచిన ఆ గార్డెన్ చంద్రానికి ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది ముఖ్యంగా హేమ తనకూడా ఉండటంవల్లనే ఈ పూలతోట తనకు ఇంత అందంగా కనిపిస్తుందేమో ననుకున్నాడు చంద్రం

ఇద్దరికీ ఓ ఇష్టమైన కలగంటున్నట్లు అనుభూతి కలిగింది కలలోనే మళ్ళీ తమ కలతల్లో తేలిపోతున్నారు. ఎవరికీ మాట్లాడాలనిలేదు మాట్లాడితే అంత ఆనందాన్నిస్తున్న ఆ అనుభూతి ఎక్కడ కరిగిపోతుందోనని వారి భయం కృష్ణారావూ ప్రసాదరావూ, వాళ్ళిద్దర్నీ ఇలా తోటలోకి పంపించటానికి ప్రయత్నించినప్పుడే హేమ అవివాహిత అని తెలుసుకున్నాడు చంద్రం

అలా ఎంతసేపు తోటంతా కలియ తిరిగారో వారికే తెలియదు మల్లెపందిరి దగ్గరకు రాగానే అక్కడవున్న సిమెంటు బెంచీని చూపిస్తూ ''ఇక్కడ కూర్చుందాం,'' అన్నాడు చంద్రం హేమ అంగీకార సూచకంగా తల ఆడించింది

చంద్రాన్ని మళ్ళీ మళ్ళీ చూడాలని ఉంది హేమకు తనివితీరా చూడాలని వుంది చంద్రం తనను చూడటం లేదనుకున్నప్పుడల్లా చూస్తున్నది చంద్రం ఆ విషయాన్ని గమనించకపోలేదు చంద్రం ముఖంలోకి చూసి మాట్లాడటానికి ఏదో బలహీనత హేమను వశం చేసుకుంది ఎక్కడలేని సిగ్గు ముంచుకొస్తుంది ఆ విషయంఆలోచిస్తే హేమకు చాలాఆశ్చర్యం అనిపిస్తుంది ఏమిటి ఈ అనుభూతి! స్త్రీ మగవాడిని చూసి సిగ్గుపడుతుందంటే ఆమెలోని బలహీనతే అందుకు కారణం అనుకొనేది తను చీటికి మాటికి మగవారి ముందు సిగ్గుతో మెలికలు తిరిగిపోయే ఆడపిల్లల్ని చూస్తే తన మనస్సు ఏవగించుకునేది అలా మగవారి ముందు సిగ్గుపడాలంటే తనకు చాలా సిగ్గు కాని ఈరోజు

తనకు తెలియకుండానే తనలో సిగ్గు ప్రవేశించింది.

"హేమా !" చంద్రం హేమచేతిని మృదువుగా తన చేతిలోకి తీసుకన్నాడు

హేమ ఉలిక్కిపడి చేతిని లాగేసుకుంది కాని అలా చేసిన వెంటనే చంద్రం బాధ పడుతున్నాడేమోనని అతని ముఖంలోకి చూస్తూ-

అవే కళ్ళు! పెద్ద పెద్ద కనురెప్పలు కొంచెం వాలినట్లుండే ఆ కళ్ళు తనకెంతో ఇష్టం చంద్రంకళ్ళు అందమైన ఆడ పిల్లలకు వుండవలసిన కళ్ళు ఆ కళ్ళే చంద్రం ముఖాన్ని సౌమ్యతను కలిగిస్తూ, చూడగానే మంచివాడు అనే భావాన్ని కలిగిస్తాయి

"ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు ?" చంద్రం ప్రశ్నకు హేమ తన ఆలోచనల నుంచి బయటపడింది

"నువ్వు ..మీ...రు రాసిన పుస్తకాలు కొన్ని చదివాను," అంది హేమ గాబరగా, చంద్రాన్ని మాటల్లోదించే ధోరణిలో

చంద్రం పకపకనవ్వాడు హేమ చంద్రం ముఖంలోకి తెల్లబోయి చూసింది, ఆ నవ్వుకు కారణం తెలియక

"ఏమిటి హేమా! మీరు అంటున్నావు? ఈ ఎనిమిది సంవత్సరాల్లోనే నీ మనస్సుకు అంతదూరం అయిపోయానా? అప్పుడు నేనుకూడా నిన్ను మీరు అనాలి కాబోలు " అన్నాడు చంద్రం ఆఖరుమాటల్ని కొంచెం సాగదీస్తూ హేమ వస్తున్న నవ్వును పెదవులతోనే అతికష్టంమీద బంధించింది.

"హేమా ! ఎంత పెద్దదాని వయావు ? అన్నాడు చంద్రం హేమ సౌందర్యాన్ని కళ్ళతోనే తాగుతూ తననే రెప్పవాల్చకుండా చంద్రం చూస్తుంటే హేమకు కొంచెం ఇబ్బందిగా అనిపించింది

"అయితే చంద్రం నువ్వు ఇక్కడ నుంచి పారిపోయావుగదా? ఆ తరవాత ఏం జరిగింది ఎక్కడెక్కడికి వెళ్ళావు ... ఏం చదివావు చెప్పవూ?"అంది హేమచంద్రాన్ని వేరేమాటల్లోకి దించాలనే ఉద్దేశంతో

హేమ ప్రశ్నలకు చంద్రం మనస్సు చివుక్కుమంది అవును తను ఇంటినుంచి పారిపోయాడు పైగా దొంగతనపు నేరాన్ని నెత్తిన వేసుకొని పారిపోయాడు హేమ ఆనాడు తనను దొంగగా భావించింది ఈనాడు, ముఖ్యంగా ఇంతకాలానికి కలుసుకున్న ఈ క్షణంలోకూడా హేమ ఆ విషయాన్నే గుర్తుచేస్తున్నది సిగ్గుచేత చెయ్యి లాగేసుకున్న దని తను భావించాడు ఎంత పొరపాటు! హేమ తను ఏం చదివాడో, ఎన్నిడిగ్రీలు పొందాడో, దొంగగా పారిపోయిన తను ఈ మధ్యకాలంలో ఏమేమి చేశాడో తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంది అంటే?...

గతాన్ని త్రవ్వి చంద్రాన్ని బాధించానని తెలుసుకుంది హేమ చంద్రం ముఖంలోని విషాదాన్ని చూసి హేమ తను తప్పుచేసినట్లు బాధపడింది

"చంద్రం! నువ్వురాసిన కవిత్వం ఏదయినా వినిపించవూ?" ప్రసంగాన్ని మార్చే ఉద్దేశంతో ఉత్సాహంగా అడిగింది హేమ

"కవిత్వమా! నేను కవిత్వం ఏమీరాయ లేదు," అన్నాడు చంద్రం ముభావంగా

విచారంగా ఎక్కడకో చూస్తున్న చంద్రంముఖంలోకి చూడసాగింది హేమ తనివితీరా విచారంతో అమాయకంగా కనిపిస్తూ చంద్రంముఖం ఎంతో అందంగాకనిపించింది హేమకు కనీ కనిపించని పాపడితొ వెనక్కువిరిచి దువ్విన నొక్కులు లేని ఆ జుత్తులోపలకు వేళ్ళు దూర్చి గుప్పెడునిండా జుత్తు పట్టుకొని వూపుతూ "ఇంతలోనే అంత కోపమా ?" అని అడగాలనిపించింది హేమకు

"ఒకపాట పాడనా చంద్రం ! ' అంది హేమ ఆ మాట వినగానే తన పాటలంటే ఒకప్పుడు చెవు కోసుకొనే చంద్రం ముఖం సంతోషంతో చాటంత అవుతుందని ఆశించిన హేమ నిరాశతో కుంగిపోయింది

"ఊఁ" అన్నాడు చంద్రం ఎలాటి ఉత్సాహాన్ని చూపకుండానే

హేమ పాడటం మొదలు పెట్టింది చంద్రం ఉలిక్కిపడి హేమవైపు చూశాడు హేమ తలవంచుకొని పాటపాడుతున్నది చంద్రానికి ఆశ్చర్యం, ఆనందం ఒకేసారి కలిగాయి ఆ పాట తను చిన్నప్పుడు రాసింది ఆనాడు స్కూలు వార్షికోత్సవంలో ఆ పాటకే బహుమతి లభించింది తనకు గుర్తులేని ఆ పాటను హేమ ఎంత పదిలంగా తన మనస్సులో దాచుకుందో ! ఆ పాటలో పెద్ద విశేషం ఏమీ లేదు ఏదో చిన్నతనపు తెలిసీ తెలియని భావాలు, కాని హేమ దానికి చక్కని బాణీకట్టిపాడుతుంటే ఎంతో మధురంగా వుంది ఆపాట హేమను తను అపార్థం చేసుకున్నాడు

పాట ఆగిపోయింది "ఎంత బాగుంది?" అన్నాడు చంద్రం తన్మయత్వంతో

"ఏమిటి బాగుంది నా పాటా లేక నీ కవిత్వమా ?" కొంటెగా నవ్వింది హేమ, చంద్రం శ్రుతి కలిపాడు.

"చంద్రం ?" ఏదో అడగాలని మళ్ళీ అడగలేక ఆగిపోయింది హేమ

"ఊఁ అడుగు ! ఆగిపోయావేం ! నీ ప్రశ్న ఏమిటో నేను చెప్పనా ?" అంటూ హేమ కళ్ళలోకి సూటిగా, చిలిపిగా చూశాడు చంద్రం.

హేమ సిగ్గుతో ముడుచుకుపోయింది మల్లెమొగ్గలాగ (సశేషం)

ప్రాచీనాంధ్ర సారస్వతము - రాజపోషణ

— యస్వీ రామశాస్త్రి, ఎం. ఏ

ఆంధ్ర సాహిత్య చరిత్రలోఁ గవిపండితుల నాదరించిన రాజులకుఁగాని కవనము సల్లిన కవిరాజులకుఁగాని కొదువ లేదు తూర్పు చాళుక్య ప్రభువులనుండి మధుర తంజావూరి నాయకరాజచంద్రుల వఱకు నాంధ్ర సాహిత్యలత రాజవృక్షము నాశ్రయించి వర్ధిల్లిన దనుటలో నతిశయోక్తిలేదు తూర్పు చాళుక్య నృపులచే నంకురార్పణము గావింపఁబడి విజయనగర రాజన్యులచేతను దత్సామంత మండలేశ్వరులైన తంజావూరు మధుర నాయకచంద్రులచే పోషింపఁబడి యాంధ్రసాహిత్యలత మూడు పువ్వు లారు కాయలుగ వర్ధిల్లినది చాళుక్య లాంధ్రభాషకుఁ జేసిన సేవను నన్నెచోడుఁడు కుమారసంభవ కావ్యమున నిట్లు కొనియాడినాడు

"మును మార్గకవిత లోకం
బున వెలయంగ దేశికవితఁ బుట్టించి తెనుఁ
గున నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్"

నన్నెచోడుని యుద్దేశమునఁ జాళుక్యులు దేశభాషను బ్రోత్సహించి తెలుఁగునఁ గావ్యములను వెలయింపఁ జేసిరనుటయై యుండును ఏలన నాంధ్రదేశమును బరిపాలించిన తత్పూర్వ రాజులనే కులనాంధ్రులు వారు సంస్కృత ప్రాకృత భాషలలోనే సర్వ రాజ వ్యవహారములను నడపుచుండిరి ఆ భాషలలోనే గ్రంథ రచనను బ్రోత్సహించిరి చాళుక్యరాజు లనాంధ్రులైనను బ్రజలలో వ్యవహార మాత్రోపయోగియై యున్న యాంధ్రభాషను రాజభాషగఁజేసిరి పూర్తియైన తెలుఁగు శాసనములను వేయించి గ్రంధరచనకుఁ బ్రోత్సహించిరి అందులకు నిదర్శనముగ వారి శాసనములలో దేశీయమైన ఛందో విశేషములతోఁ గూడిన పద్య రచన కన్పట్టుచున్నది భారతాంధ్రీకరణము వారియొక్క సత్కృషికిఁ దగిన సత్ఫలమని చెప్పవచ్చును అది వారి నిరంతర భాషాసేవకుఁ జిహ్నమని కొనియాడవచ్చును అవ్యవస్థమైయున్న భాషకొక వ్యవస్థను జేకూర్చుటకు వారు చోళుల నాఁటి తమిళ సంఘములవంటి పండిత పరిషత్తుల నేర్పఱచిరి భారతావతారికను బట్టి యీ విషయము తెలియనగును

"పరమ వివేక సౌరభ సద్గుణ సత్స
భాంతర సరసీవనం
బుల ముదంబొనరంగొనియాడి
వేడుకన్"

దీనినిఁబట్టి తేలిన దేమనఁగా నాంధ్ర సాహిత్యమున మనకుపలబ్ధములైన కావ్యములలో నాది కావ్యమని చెప్పుకొనఁదగిన భారతము రాజరాజు ప్రేరేపణమున వెలసిన దగుటచే నాంధ్ర సాహిత్య వికాసమున రాజుల ప్రోత్సాహముతోఁ బ్రారంభమైనదని చెప్పుటయే లెస్స

నన్నయయుగము తరువాత శివకవి యుగమున నుండిన శివకవు లనేకులు నరాంకితము నొల్లక, రాజాశ్రయమును నిరసించి తమ గ్రంథములను దైవాంకితముఁజేసిరి ఈ యుగముననే కవిరాజశిఖామణి నన్నెచోడుఁడు కుమారసంభవ కావ్యమును రచించి తన గురువునకును నిష్టదైవమునకును నంకితము గావించెను అతని గ్రంథ మాంధ్ర సరస్వతికొక యపూర్వాలంకారమని చెప్పఁదగియున్నది ఈ యుగమున వెలసిన శైవమత గ్రంథముల మాట యటుండ పావులూరి మల్లన తన గణిత శాస్త్రమునుగూడ శివాంకితముగానే రచించెను

శివకవి యుగము తరువాత తిక్కన యుగముననే యాంధ్ర సాహిత్యమునకు రాజాదరణము లభించినది తెలుఁగున వెలసిన రామాయణములలో మున్నెన్నదగిన రంగనాధ రామాయణ మీ యుగముననే పుట్టినది ఏతద్గ్రంథ రచయితలైన గోన బుద్ధారెడ్డి, కాచివిభుండు, విట్ఠలుడు కవిత్వము చెప్పిన రాజులే వారి గ్రంధకర్తృత్వమును శంకించి యిటీవల దానిని రంగనాధుఁడను నొక కవికి గొంద రంటగట్టిరి కాని కొందఱు పండితులు సవిమర్శకముగ దానిని ఖండించిరి వారి తరువాత నెల్లూరు సీమను బరిపాలించిన మనుమసిద్ధి యొనర్చిన సాహిత్యసేవను గొనియాడవలసియున్నది

"ఏ నిన్ను మామాయనియెడు
దీనికిఁ దగనిమ్ము భారతీకన్యనని"

యాప్యాయముగ తిక్కన రచించిన నిర్వచనోత్తర రామాయణము సంకితము, బొందెను తిక్కన తన భారతమును నరాంకితమున కిష్టపడక దైవాంకిత మొనర్చినను సమ్మహాకావ్య నిర్మాణమునకు వలయు సౌకర్యములనెల్లఁ జేకూర్చి కొనసాగింపఁ జేసిన మనుమసిద్ధిని స్మరింపక తప్పదు.

మనుమసిద్ధి తరువాత నాంధ్రకవిత్వము రాజాదరణదశనుండి తప్పినది, దీని కుదాహరణముగ నాగయగన్నఁడు వ్రాయించిన మారన మార్కండేయ పురాణమును జెప్ప

వచ్చును కాకతిప్రభువుల కాలమున రచియింపఁబడిన కావ్యములకెల్లఁ గృతిపతులు తత్సేనానులు మాత్రమేకాని, కాకతీయ రాజులు స్వయముగ వ్రాయించి కృతివహించిన ఆంధ్రకావ్యము లెవ్వియు గానరావు

కవిత్రయములో నొకడైన యెఱ్ఱాప్రెగ్గడ సైతము మొట్టమొదట వేమభూపాలుని తమ్ముఁడును సేనానియునగు మల్లనాయకునిచే నాదరింపఁబడినవాఁ డగుటచే నెఱ్ఱన యుగమునందలి కవిత్వముగూడ రాజాదరణ దనతోఁ బ్రారంభించియుండ లేదు కాని మల్లసేనానిచేఁ బ్రోత్సహింపఁబడినను నెఱ్ఱనకు వేమభూపాలు డిచ్చిన ప్రోత్సాహము పొగడఁదగినది. ఎఱ్ఱనచే రామాయణము, హరివంశమును వ్రాయించి కృతిపతిత్వమునుఁ బడసెను వేమభూపాలుడు ఆంధ్రకవితా చరిత్రమునందు సుప్రసిద్ధ కవితాపోషకులలో నొక్కఁ డగుటయే కాక సంస్కృతాంధ్రముల యందత్యంత ప్రతిభకలవాఁడు అమరుక కావ్యమునకు సంస్కృతమున వ్యాఖ్యవ్రాసెను

ఎఱ్ఱన యుగములోని వేమభూపాలుని వలె శ్రీనాథుని యుగమునందుఁగూడ రెడ్డి రాజులే సుప్రసిద్ధ కవితాపోషకులని చెప్పక తప్పదు రెడ్డిరాజులలోఁ గృతిపతియైన వాఁడు కాశీఖండ కృతిపతి వీరభద్రారెడ్డి యొక్కడేయైనను శ్రీనాథ కృతిపతులెల్లరును గూడ రెడ్డిరాజుల మంత్రులో, సేనానాయకులో, భాండాగారాధ్యక్షులో యగుచున్నారు కృతిపతిత్వమును బొందినను బొందకపోయినను దనను సన్మానించుచుండిన కొందఱు రాజులను దన చరమదశలో శ్రీనాథుడీ క్రింది విధమున స్మరించుకొనెను

"కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబులే రాయఁడిచ్చు
కైలాసగిరిఁబండె మైలార విభుఁడేగె
దినవెచ్చమే రాజు తీర్పఁగలడు
రంభఁగూడెఁదెనుంగు రాయరాహుత్తుండు
కస్తూరికేరాజు బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి
మఱిహేమపాత్రాన్న మెవ్వనిపంక్తిగలదు?
భాస్కరుఁడు మున్నెదేవుని పాలికరిగెఁ
గలియుగంబున నిఁకనుండఁ గష్టమనుచు
దివిజకవి వరుగుండియల్ దిగ్గురనగ
నరుగుచున్నాఁడు శ్రీనాథు డమరపురికి"

పై పద్యమును సూక్ష్మముగఁ బరిశీలించినచో శ్లాఘ్యము, నద్భుతమునైన శ్రీనాథుని గుణ విశేషము తన్నాదరించిన వారి యెడ నాయకున్న ప్రేమయు నాయా రాజుల వితరణశీలమును గోచరించును శ్రీనాథుని బహురాజాస్థాన ప్రవేశములు, తదుపాత్త బహువిధ సత్కారములు ఆంధ్ర సాహిత్యమున కానాఁటి ప్రభువులెంతటి ప్రోత్సాహము నిచ్చిరో తేటతెల్లము గావించుచున్నది

శ్రీనాథుని తరువాత నాంధ్రసారస్వతమున స్వర్ణయుగమని చెప్పఁదగిన రాయల యుగమున నాంధ్రసాహితీ సరస్వతిఁగవి పండితులకు సాహితీ సమరాంగణ చక్రవర్తి రాయలొనర్చిన సేవ కొనియాడఁదగినది కవితా పోషణాది గుణములలో భోజరాజాదుల పేళ్ళు చెప్పినను నింత సర్వగుణ సంపత్తి వారికి లేదు నానా భాషా కవుల నతనివలెఁ బోషించిన రాజులేఁడు తెనుఁగు రాజభాష యగుట నా సారస్వత మన్నింటినిమించి యభివృద్ధి గాంచెను రాయల పేరోలగము గవిపండితుల పాలిటి కల్పతరువని చెప్పవచ్చును అష్ట దిగ్గజము లనెడి కవు లతని యాస్థానమున నుండినట్లు శాసనాధారములను బట్టియు తెలియుచున్నది కవి పోషకుఁ డగుటయే గాక స్వయముగ నాంధ్రప్రబంధ మణిహారమున నాయకమణి యనదగు నాముక్తమాల్యదను స్వయముగ రచించిన మహాకవి, యుగకర్త రాజకవులలో నింతటి వైదుష్యముగల కవిరాజు మఱియొకఁడు లేఁడు ఆనాఁడు ముఖ్యముగ వెలసిన ప్రక్రియ ప్రబంధమే యని చెప్పవచ్చును. కృష్ణరాయ భూపాలలాలితయైన యాంధ్ర ప్రబంధకన్య సర్వాలంకారములతో సర్వాంగసౌష్ఠవముగ వర్ధిల్లినది ఆంధ్ర సారస్వతమునఁ గవిపండితుల నెందఱో రాజు లాదరించిరి గాని వారి యాదరణ వేఱు రాయ లొనర్చిన సేవవేఱు సర్వ విషయములలోను వారినుండి పృథక్కరింపఁ దగిన విశేషగుణము లాయనలో రాశీభూతయై యున్నవి పెద్దనచెప్పిన చాటువును బట్టి యతఁడాతని యెడ చూపిన యాదరణ వ్యక్తమగును

"ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూత యొసఁగి యెక్కించుకొనియె
మను చరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకి తనకేలఁ బట్టియెత్తె"

శ్రీ కృష్ణదేవరాయల యాస్థానమున నాంధ్రభాషాయోష యమూల్యాభరణములను సేకరించుకొని యష్టదిగ్గజములతో సరస సారస్వతగోష్ఠి వినోదములఁ బ్రొద్దులు పుచ్చినది ఆయన యాదరణమున నాంధ్రవాగ్దేవత బహువిధముల నానావిధ శోభలతోఁ బ్రసన్నమైనది

తరువాతి యుగమున నాయకరాజులు స్వయముగాఁ గవులై కవిపండిత పోషకులై యాంధ్రసాహితీ సర్వతికి నూత్నములగు నలంకారములను గైసేసిరి సాహితీ సమరాంగణ సార్వభౌముని తలపింప లేకున్నను నాచక్రవర్తినే సర్వథాయనుకరించిన వారు గావున నాయకరాజుల కాలమునఁ గూడ నాంధ్రవాగ్దేవత నీరసింపలేదు. క్షీణ యుగమునఁగూడ సామ్రాజ్యములు పోయినను వాగ్దేవతోపాసన విషయమున నాఁటి జమీందారులుగూడఁ బరాఙ్ముఖులుగాలేదు యథాశక్తిని వారు పండితకవుల నాదరించుచునే యుండిరి వేయేల ధనవంతులను వారి ఇండ్ల శుభకార్యములు జరిగినప్పుడు గూడ వేదవిదులతోఁబాటు కవులనుగూడ సత్కరించుట మన సంప్రదాయము కావున నాంధ్రవాఙ్మయము శోభాయమానమై విలసిల్లుటకుఁ బ్రభువుల ప్రోత్సాహమే మూల కారణము

(మిగతా 24 వ పేజీలో)

ఆచార్య నాగార్జునుడు

యర్రమిల్లి ప్రభాకరరావు

ఆచార్య నాగార్జునుడు బహుముఖ ప్రజ్ఞాశాలి భారతదేశమున బౌద్ధమతము క్షీణదశలో యున్నపుడు ఆయన ప్రవచించిన మాధ్యమిక వాదము దానికి పునరుజ్జీవనము కల్గించి ఆ మతము జన్మభూమిలో మరల మహోన్నత వైభవముతో విరాజిల్లుటకు అవకాశము కల్గించినది ఈ ప్రపంచ ప్రఖ్యాత తత్త్వశాస్త్రవేత్త బీహారులోని 'విదర్భ'లో జన్మించినను తన జీవిత కాలములో అత్యధికభాగము ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలోని కృష్ణానదీ తీరమున యున్న 'శ్రీపర్వతం అను కొండపై గడపెను అందుచే ఆ పర్వతము ఆయన పేర 'నాగార్జునుని కొండ'యని పిలువబడుచున్నది

నాగార్జునాచార్యుడు ఆంధ్రదేశమును పరిపాలించిన శ్రీ యజ్ఞ శ్రీ శాతకర్ణి సమకాలికుడు ఆయన క్రీ శ 134 నుండి 194 వరకు నివసించియుండెనని చరిత్రకారుల అభిప్రాయము ప్రఖ్యాత బౌద్ధమతాచార్యులు ఆర్యదేవుడు, నంద, బుద్ధోపరిత మొదలగువారు ఈయన శిష్యులు క్రీ శ 3వ శతాబ్దమున సింహళము నేలిన విహారతెష్యునకు, అభయునికి ఆర్యదేవుడు సమకాలికుడని తెలియుచున్నది

నాగార్జునుడు పాళీ సంస్కృత భాషలో అనేక గ్రంధములను రచించెను చైనీయుల వ్రాతలను బట్టి ఆయన 24 గ్రంథములను రచించెనని తెలియుచున్నది వానిలో చాలావరకు చైనా, టిబెట్ భాషలకు అనువదింపబడినవి శాతవాహన ప్రభువు ఆయనకు వ్రాసిన లేఖ గల్గిన 'సుహృల్లేఖ', మాధ్యమిక వాదమును గూర్చి తెల్పు 'ప్రజ్ఞాప్రదీప శాస్త్రకారిక' ఆయన ముఖ్యమైన రచనలు ఇవిగాక చీనా వాఙ్మయమునుండి ప్రజ్ఞా పారమిత శాస్త్రము, ప్రజ్ఞా మూలశాస్త్రటీక, మూల మాధ్యమిక శాస్త్రము, శూన్యసప్తాధియధ్యంతానుగమ శాస్త్రము, ద్వాదశనికాయ శాస్త్రము, దశభూమివిభాషశాస్త్రము వివాదసమాన శాస్త్రము, ప్రమాణ విహేతనం, ఉపాయకౌశల్య హృదయశాస్త్రము, విగ్రహవ్యావర్తికారికలు మొదలగు గ్రంథములను ఆయన రచించినట్లు తెలియుచున్నది సుహృల్లేఖ గ్రంధములను చైనా యాత్రికుడు ఈట్సింగ్ చీనాభాషలోనికి అనువదించెను క్రీ శ. 4వ శతాబ్దములో చైనాదేశమును సందర్శించిన కుమార విజయుడు ఆయన గ్రంధములను చీనా భాషలోనికి అనువదించెను

నాగార్జునుని జీవితమునుగూర్చి అనేకములైన కథలు వ్యాప్తిలో నున్నవి ఆయన మహిమను, శక్తిసంపదలను వెల్లడిచేయు కథలనేకములు ఆయనయొక్క అమోఘ జ్ఞాపకశక్తికి తార్కాణము — ఆయన త్రిపిటకములను 90 రోజులలో పఠించి తిరిగి దానినంతయు ఆపుపుగ చెప్పుటయే ఆయన ఈయొక్క ధీశక్తికి సింహళదేశపు మతాచార్యుడగు 'దేవుడు' ఆశ్చర్య చకితుడై ఆయన శిష్యుడుగ చేరెను

గౌతముని త్యాగమయ పరోపకార జీవిత సిద్ధాంతములతో గూడిన బౌద్ధమతమునకు నాగార్జునుడు సౌందర్యారాధనతో గూడిన ఆధ్యాత్మిక తత్త్వమును జోడించి 'సమన్వయ వేదాంతి గ ప్రపంచమునకు సాక్షాత్కరించెను ఆయన ప్రబోధించిన వ్యతిరేక వాదములో శంకరాచార్యుని మాయావాదమును ఆధ్యాత్మిక వేత్తలు గాంచగల్గిరి "ఆత్మకు నివాస స్థలములేదు అది శాశ్వతముకాదు అశాశ్వతముగాదు అది నిత్యమైనదికాదు అనిత్యమైనదికాదు దానికి ఉనికిలేదు, ఉనికి కలదు దానికి జననములేదు, మరణములేదు శాశ్వతలేదు, క్షణభంగురత లేదు ఏకత్వము లేదు, ద్వైతములేదు, భావి లేదు గతములేదు" అని ఆయన ఆత్మను నిర్వచించెను ఈ విధముగ నాగార్జునుడు బుద్ధుని శూన్యవాదమునకు, శంకరాచార్యుని మిథ్యావాదమునకు ఒక సేతువును నిర్మించి భారతీయ వేదాంత వికాసమునకు దోహదము చేసెను ద్వంద్వ భావములన్ని మిధ్యలేకాబట్టి అవే మన భ్రమలకు ఆద్యప్రకృతులనియు, అశాంతి, దుఃఖముల కాలవాలమైన ఈ భ్రమలనుండి మానవుడు దూరము కాలేనంతవరకు సుఖ దుఃఖసమ్మిశ్రితమైన ఈ జీవితమునుండి విముక్తి ప్రాప్తించదనియు ఆయన బోధించెను తన సిద్ధాంతములను నాగార్జునుడు భారత, సింహళదేశములందు ప్రచారముచేసి భారతీయులలో నూతనోత్తేజమును కల్గించెను ఆయన కొంతకాలము 'నలంద' విద్యాపీఠములో ఆచార్యుడుగ పనిచేసెను నాగార్జునుడు శ్రీపర్వతముపై ఒకస్థూపమును, మహాచైత్యమును, మహా విహారమును యజ్ఞ శ్రీశాతకర్ణి సహాయమున నిర్మించెను ఐదు అంతస్థులుకల్గి, పదునైదువందల గదులతో సకల సదుపాయములు కల్గియున్న ఆ విహారముయొక్క

నాలుగవ అంతస్థులో నాగార్జునుని అపూర్వ గ్రంథసంచయము యుండెడిది నాగార్జునుడు త్రిపిటకములను, భూగోళ, లోహ, విజ్ఞాన, రసవాద, రసాయన, రత్న, ఆరోగ్య, వైద్య శాస్త్రములకు చెందిన సమస్త గ్రంథములను సేకరించియుండెను ఈ విధముగ క్రీ శ 2 వ శతాబ్దములోనే వివిధ శాస్త్రగ్రంథములను సేకరించి నాగార్జునుడు ఆంధ్రదేశమున తొలి గ్రంథాలయ వ్యవస్థాపకుడుగ వినుతికెక్కెను

నాగార్జునుడు అద్వితీయ మేధావి సకల శాస్త్ర పారంగతుడు ఆతడు వైద్యశాస్త్ర నిపుణుడని బాణ భట్టు ప్రశంసించెను ప్రాచీన భారత వైద్య గ్రంథములన్నియు ఆయనను స్మరించెను చైనా దేశములో వివిధ రోగములకు నాగార్జునుని చికిత్సను శిలాఫలకములపై చెక్కించిరి పి సి రే గారు తమ భారతీయ రసాయనిక చరిత్రలో ఆయనను 'భారతీయ రసాయనిక శాస్త్ర పితామహుడు' అని పేర్కొనియుండిరి

అన్నభేదిని ప్రపంచములో మొదట తయారు చేసినది నాగార్జునుడేయని శాస్త్రజ్ఞుల అభిప్రాయము ఆయన 'రసవాద మున పండితుడని ప్రఖ్యాతివహించెను ఈ విధముగ బౌద్ధశాస్త్రాచార్యునియందు ప్రపంచం ఒక గణితాచార్యుని, ఒక మంత్ర వేత్తను, ఒక రసాయనిక శాస్త్రవేత్తను, రసవాద శాస్త్రవేత్తను, వైద్యశాస్త్రాచార్యుని కనుగొనియున్నది

ఆతడు సర్వజ్ఞుడు పూర్ణపురుషుడు ప్రాచీన భారతదేశ ప్రతిభను దశదిశలా వ్యాపింపచేసిన ప్రముఖ తాత్త్వికుడు ఆ కాలమున దేశ విదేశములనుండి శ్రీ పర్వత విహారము విద్యార్థులను ఆకర్షించి జ్ఞాన భిక్షను ప్రసాదించెను ప్రపంచ ప్రఖ్యాతి గడించిన విక్రమశిలా విశ్వవిద్యాలయము (క్రీ శ 8 వ శతాబ్దము) నాగార్జునుని యొక్క శిల్పమూర్తిని ప్రవేశ ద్వారము యొక్క దక్షిణదిశలోనుంచి ఆ విజ్ఞానవేత్తను పూజించినది

ఒకనాడు విశ్వవిఖ్యాతి నార్జించి మహోన్నత విద్యా కేంద్రముగ వర్ధిల్లిన నాగార్జునుని కొండ ప్రపంచమునకు జ్ఞానభిక్ష పెట్టినది ఈనాడు అచట నిర్మాణములో యున్న మహోన్నత ప్రాజెక్టు ఆంధ్రదేశము నంతను సుభిక్షము చేయును నాగార్జునుడొకమారు తన రసవాద శాస్త్రము వలన బంగారము తీసి అచ్చటి ప్రజలను క్షామము నుండి రక్షించెనని యొక కథ వాడుకలో యున్నది. అటులనే ఆయన వసించిన ప్రాంతమున నిర్మింపబడుచున్న నాగార్జున-నందికొండ ప్రాజెక్టు ఆంధ్రదేశమును మరింత సిరిసంపదలతో తులతూగునట్లు చేయును


ఈ పూర్ణపురుషునిగూర్చి నెహ్రూ పండితుడు "అసాధారణ మేధావంతుల నక్షత్ర వీధిలోనాగార్జునుడు భారతదేశము ఉద్భవింప చేసిన మహోన్నతమైన పురుషులలో ఒకడుగ నిలబడును" అని శ్లాఘించెను ★

(ప్రాచీనాంధ్ర సారస్వతము – 22 వ పేజీ తరువాయి)


ఇంతవఱకు సవ్యముగానే యున్నది. కాని ఇట్టి ప్రోత్సాహమువలన కొన్ని దుష్ఫలితములుగూడఁ గానవచ్చుచున్నవి ఆంధ్ర కవి దారిద్ర్యమెరుగడు ఒక పోతనతప్ప రాజసత్కారములను మరగిన నాటి కవులు వారి ఔదరాభిమానముల నెట్టైన నిలువ బెట్టుకొనవలెనని యత్నించుట సహజము అట్టియాదరములేనివారు ప్రయత్నించుటయు నబ్బురముగాదు, అందువలనసామాన్య ప్రజానీకమును వారి కష్టసుఖములను కవులవగాహన చేసికొనుట కవకాశము లేకపోయినది శృంగారపరత్వము శ్రీమంతులకుండెడి దౌర్బల్యము రాజుల మన్ననలగోరిన కవులను మోహజనకమగు నీ శృంగారమునే బహుధా సాగించిరి. కాని తక్కిన రసములయెడ నాదరణ చూపలేదు ఎద్దియైన నొక కావ్యమును రచించి రాజసత్కారమును పొందదలచిన కవులు గతాను గతికముగా వ్రాయుటకు యత్నించు చుండిరి కావుననే నాటి వాఙ్మయము ప్రజా జీవితమును బ్రతిబింబింపఁ జేయక రాజాస్థానములను తద్వైభవాడంబరములను మాత్రమే వ్యక్తము చేయుచున్నది ఇది దాని దుష్ఫలితము




విజయవాడలో ఉపరాష్ట్రపతి




కృష్ణాజిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు విజయవాడ రైలు స్టేషన్‌లో ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు



విజయవాడ పురపాలక సంఘం పౌరసన్మాన సభలో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి




భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకిర్‌హుస్సేన్ విజయవాడలో మ్యునిసిపల్ నీటి పథకాన్ని (5. ఎం. జి. డి. ప్లాంట్) ప్రారంభించారు. పురపాలక వ్యవహారాలమంత్రి శ్రీ చెంచు రామానాయుడు అధ్యక్షత వహించారు



ఉపరాష్ట్రపతిచే ప్రారంభించబడిన మ్యునిసిపల్ నీటిపథకపు ఒక దృశ్యం


ఆంధ్రప్రదేశ్‌లో గౌరవనీయ అతిథులు




నేపాల్ రాజు మరియు రాణీరత్నలకు విశాఖపట్నం విమానాశ్రయం వద్ద ఆంధ్రప్రదేశ్ రెవిన్యూమంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి స్వాగతం




విశాఖపట్నం నౌకానిర్మాణ కేంద్రంవద్ద నేపాల్ రాజు మహేంద్ర మరియు రాణి రత్న



భారతదేశంలోని పోలిష్ రాయబారి మిస్టర్ ఓగ్రాడ్‌జిన్సి మరియు ఆయన సతీమణి రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌ను కలుసుకున్నారు




పోలిష్ రాయబారి మరియు ఆయన సతీమణి ఆనంద నిలయంలో ముఖ్యమంత్రిని కలుసుకున్నారు




మద్రాస్ గవర్నర్ శ్రీ జయచామరాజవడియార్
రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌తో



నల్లగొండజిల్లా యాదగిరి గుట్టమీది నరసింహస్వామి దేవాలయాన్ని శ్రీ జయచామరాజ వడియార్ సందర్శించారు



జనవరి 3 న, హైదరాబాదులోని ఆనందనిలయంలో, జమ్మూ కాశ్మీరునుండి వచ్చిన కొందరు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిని కలుసుకున్నారు



రెండురోజుల సందర్శన నిమిత్తం, నలుగురు సభ్యులున్న ఒక సోవియట్ ప్రతినిధివర్గం జనవరి 4 న నగరానికి విచ్చేసింది.




జనవరి 4 న, స్థానిక రచయితలతో సోవియట్ ప్రతినిధివర్గం


హెచ్. ఎమ్. టి. అయిదవ యూనిట్ ప్రారంభం



డిసెంబరు 27 న హిందూస్థాన్ మెషిన్ టూల్స్ అయిదవ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు



సభికుల దృశ్యం



ఆ సందర్భంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి




జనవరి 16 న, జాతీయ కబాడీ ఛాంపియన్‌షిప్ విజేతలకు ఫతేమైదాన్‌లో, రెవిన్యూమంత్రి శ్రీ రామచంద్రారెడ్డి బహుమతి ప్రదానం చేశారు




హైదరాబాద్‌లో, మరాఠీ సాహిత్య సమ్మేళనం 46వ వార్షిక సమావేశాన్ని రక్షణ మంత్రి శ్రీ చవాన్ ప్రారంభించారు




సమ్మేళనపు సభికుల ఒక దృశ్యం



జనవరి 4న హైదరాబాద్‌లో ఆర్థికమంత్రి డాక్టర్ యమ్. చెన్నారెడ్డి స్టీవెన్‌జాన్ అంబులెన్స్ సమ్మేళనానికి ప్రారంభం జరిపారు



పరేడ్ దృశ్యం




అంబర్‌పేటలో జరిగిన స్టీవెన్‌జాన్ అంబులెన్స్ సమ్మేళనంలో



డిసెంబరు 28 న, నాగార్జునసాగర్ డాం ప్రదేశాన జరిగిన నాగార్జునసాగర్ మరియు శ్రీశైలం కంట్రోలు బోర్డు సమావేశపు ఒక దృశ్యం.




గుంటూరు జిల్లా మంగళగిరి టి. బి. హాస్పిటల్‌ను డిసెంబరు 31 న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి సందర్శించారు.



డిసెంబరు 29 న, బంగారం బాండ్లలో మదుపుకొరకు, హయత్‌నగర్ పంచాయత్ సమితి అధ్యక్షుడు శ్రీ కె. ప్రభాకరరెడ్డి 5417 గ్రాముల బంగారాన్ని ఆర్థికమంత్రి డాక్టర్ చెన్నారెడ్డికి సమర్పించారు.



1966 జనవరి 1 న, హైద్రాబాద్‌లో, 26 వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనానికి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం జరిపారు: ఆ ఉత్సవానికి హోం మంత్రి శ్రీ మీర్ అహ్మద్ అలీఖాన్ అధ్యక్షత వహించారు.




విశాఖపట్నంలో, రాణి చంద్రమణీదేవి బాలబాలికల వైద్య శాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు




వైద్యశాలలోని ఒక రోగితో ముఖ్యమంత్రి




డిసెంబరు 26 న, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో, ప్రణాళికా సంఘసభ్యులు డాక్టర్ వి.కె.ఆర్.వి. రావు స్నాతకోపన్యాసం ఇచ్చారు




సభికుల ఒక దృశ్యం




శ్రీకాకుళంలో, జిల్లాపరిషత్తు కార్యాలయ భవనానికి కేంద్ర మంత్రి డాక్టర్ యస్. సంజీవరెడ్డి ప్రారంభోత్సవం చేశారు; నీటిపారుదల, వ్యవసాయశాఖమంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు




పట్టణ మరియు గ్రామీణపథకం గోష్ఠి సందర్భంగా ఏర్పాటు చేయబడిన ప్రదర్శనానికి హైదరాబాద్‌లో మునిసిపల్ పరిపాలన శాఖామంత్రి శ్రీ చెంచురామానాయుడు ప్రారంభోత్సవం చేశారు




జనవరి 4న, ధోన్ తాలూకా కొట్టపల్లి గ్రామంలో
రాక్‌బ్లాస్టింగ్ యూనిట్‌ను కేంద్ర మంత్రి డాక్టర్
ఎన్. సంజీవరెడ్డి ప్రారంభించారు



గుంటూరు జిల్లా తక్కెళ్ళపాడులో డిసెంబరు 30న గుంటూరు
ఛానల్ పథకానికి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి
శంకుస్థాపన చేశారు



శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన, జనవరి 6న,
అనంతపురం జిల్లా ధర్మవరం సమితి కార్యాలయానికి కేంద్ర
మంత్రి శ్రీ సంజీవరెడి శంకుసాపన చేశారు



జనవరి 3న సికింద్రాబాద్‌లోని దుర్గాదాస్ వీధిలో కమ్యూనిటీ
హాల్‌కు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి ప్రారంభోత్సవం
చేశారు; ఈ ఉత్సవానికి మునిసిపల్ పరిపాలనాశాఖమంత్రి
శ్రీ యన్. చెంచు రామానాయుడు అధ్యక్షత వహించారు.

సీరియల్ నవల

11

ఆదేరోజు నర్సుకు ఒక ఉత్తరం రాస్తూ "నిన్ను ఒక్కసారి గుంటూరు పిలిపించాలని మీ నాన్నగారు అనుకుంటున్నట్టున్నది. ఆయన నీక్కూడా ఉత్తరం రాయవచ్చు. ఉత్తరం రాగానే బయలుదేరి వెళ్ళు. ఆ తరువాత మన ఇద్దరి సమస్యా పరిష్కారమవుతుంది" అని రాశాను

డాక్టరుగారి దగ్గిరనుంచి తిరుగుటపాలో జవాబు వచ్చింది. నన్నే గుంటూరు రమ్మనీ, మా పెళ్ళి తానే చేయిస్తాననీ ఆయన రాశారు తన

జరిగిన కథ

డాక్టరు కనకంగారు తను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించే వ్యక్తి. ఆయన తన ఆదర్శాలలో సాహిత్యానికి చాల విశిష్ట స్థానం యిచ్చి తనవద్దకు వచ్చే వారందరినీ తన ఆదర్శానికి అనుగుణంగా సాహిత్యం రుద్దగా, ఆదాయం తగ్గుతుంది తన సిద్ధాంతాలను అమలు పరచగల విద్యార్థి ఒకడు రోగిగాచేరి, ఆయన ఇంటిలోనే నివాసిగాఉండి కుటుంబ సభ్యుడుగా ఉంటాడు. వారి అమ్మాయి నర్సు స్నానం చేస్తున్నప్పుడు చెరువులో పడగా ఆమెను రక్షించి ప్రాణదానం చేస్తాడు ఆ విద్యార్థి సెలవుల తరువాత పరీక్ష హడావిడిలో ఉండగా డాక్టరుగారు తమ అమ్మాయిని ఆమె తాతగారింటికి తీసుకువెళ్ళమంటారు అక్కడి ఆకర్షణవలన నర్సు అక్కడ ఉండడానికి నిశ్చయించుకుంటుంది తరువాత ఆ విద్యార్థి తన పై చదువుకోసం మద్రాసు వెళ్ళి సెలవులలో గుంటూరులో డాక్టరుగారిని కలిసి అక్కడి విషయాలను నర్సుకు తెలియజేస్తాడు నర్సుకు, తన తల్లికి కుమారుడు పుట్టకాడేమోనని ఆందోళన కలుగుతుంది. నర్సు తన తలిదండ్రులకు చాలకాలమైనా ఉత్తరం వ్రాయదు. నర్సుకే తన ఆస్తిని ఆమె తాతగారు వ్రాస్తారు ఆ విద్యార్థి డాక్టరుగారికి, తన వివాహం విషయమై ఉత్తరం వ్రాస్తాడు.

వారసత్వం

టెలిగ్రాం అందగానే బయలుదేరటానికి సిద్ధంగా వుండమన్నారు

మరో నాలుగైదు రోజులకు టెలిగ్రాం వచ్చింది. రాత్రి మెయిలుకు బయలుదేరి గుంటూరు చేరాను. నర్సు వచ్చి వున్నది

"మా తాత చాలా పేచీ పెట్టాడు పెద్దపోట్లాట జరిగింది. నేనాయనకు ఎదురుతిరిగి నానా మాటలూ అడగాలి సొచ్చింది ఆయనకు దడిచి మా నాన్నకూ, అమ్మకూ ఉత్తరంకూడా రాయకుండా ఉన్నందు కిదేనా మెప్పని అడిగాను నా కంతకోపం ఎన్నడూ రాలేదు. నా వెర్రికోపం చూసి ఆయన తగ్గి, కాళ్ళబేరానికి వచ్చాడు. నౌకరు నిచ్చి రైలుస్టేషనుదాకా పంపాడు నేనింకో రైలెక్కుతానని భయమో ఏమిటో!" అన్నది నర్సు

మళ్ళీ డాక్టరుగారిల్లు వెనుకటిలా వున్నది. కాకపోతే ఇప్పుడిద్దరు గర్భిణీ స్త్రీలున్నారు పెళ్ళిళ్ళ రిజిస్ట్రారు దగ్గిర అప్లికేషను వేశాం. పదిహేను రోజుల అవతల మాకు చట్టబద్ధంగా వివాహమయింది

వెంటనే పట్నం పోదామనుకున్నాను గాని డాక్టరుగారు రెండు రోజులుండమని కోరాడు.

మా పెళ్ళి అయిన మూడోనాడే బెజవాడనుంచి మనిషి వచ్చాడు. మునలాయనకు స్ట్రోక్ వచ్చిందట, డాక్టరుగారు అపాయము శంకించి "అందరమూ బయలుదేరుదాం. అంతగా అయితే మేమిద్దరమూ ఏ హోటల్లో అయినా దిగుతాం రైలు ఆలస్యమవుతుంది. బస్సులో పోదాం" అన్నాడు

బస్సులో వెళ్ళినాకూడా మేము బెజవాడ చేరేసరికి దీపాలు పెట్టారు.

కొడవటిగంటి కుటుంబరావు

అందరమూ ముసలాయన ఇంటికే వెళ్లాం తిన్నగా. డాక్టరుగారు పైకివెళ్ళి తండ్రిని చూశాడు అంతకుమునుపే వచ్చిన డాక్టరు "లాభం లేదు. నిముషాల్లోవుంది" అని మాకు చెప్పాడు

మరో ఇరవై నిమిషాలకు ముసలాయన అస్తమించాడు ఆ రాత్రి అందరమూ శవజాగారం చేశాం జవలేని మనిషి సుందరమ్మగారుకూడా, ఎంతమంది చెప్పినా నడుం వాల్చలేదు

మర్నాడు డాక్టరుగారే తండ్రి తలకు కొరివిపెట్టాడు

*   •   *

ఆ తరువాత చెప్పవలసిందాఏ లేదు తాతగారి ఆస్తి నర్సుదయింది ఆమె తల్లినీ, తండ్రినీ తనవద్దనే వుండమని అడిగింది వాళ్ళిద్దరూ ఒప్పుకోలేదు

"ఎప్పుడు కావలిస్తే అప్పుడు వచ్చి పోతూంటాం ఇప్పుడు నీ యిల్లేగదా" అన్నాడు డాక్టరుగారు

నేను మద్రాసుతిరిగి పోలేదు. నేను తిరిగిరావటం లేదనీ, గది మరెవరికన్నా ఇచ్చుకోవచ్చుననీ మా ఇంటివాళ్ళకు రాసేశాను.

ఫిబ్రవరి మొదటివారంలో డాక్టరు గారి భార్య మరొక ఆడపిల్లను కన్నది. బారసాల అంటూ జరగలేదుగాని. పిల్ల పుట్టిన పదకొండోరోజున నర్సు తల్లి దండ్రులకూ, చెల్లెలికీ చాలా కట్నాలూ. కానుకలూ తెచ్చింది అప్పటికి నర్సుకే అయిదునెల్ల కడుపు.

ఆమె కాన్పుకు డాక్టరుగారూ, భార్యా వచ్చి పదిహేనురోజు లున్నారు. నర్సు మగపిల్లవాణ్ణి కన్నది. ముసలాయన పేరు పెట్టుకుంటే బాగుంటుం దని డాక్టరుగారన్నాడు నరసింహారావని వాడికి పేరు పెట్టాం


నాకు నర్సు భర్తగా ఉండటంతప్ప వేరేఉద్యోగంలేదు అప్పుడప్పుడూ కథలు రాసి నా అస్తిత్వాన్ని సమర్థించుకుంటూ వస్తున్నాను డాక్టరుగారు కూతురు దగ్గిరవచ్చి ఉన్నట్టయితే ఆయనక్కూడా పని పాటా లేకుండాపోయి ఉండేదే, నా మాదిరిగానే ఆయనకూడా నర్సు జీవితం జీవిస్తూ కూర్చోవలసి వచ్చేది.

నర్సు ఆస్తిని జలగలాగా పట్టుకున్నది. అందులో సగం నీ చెల్లెలికి రాసి ఇచ్చెయ్యి. మీ తాత ఆస్తి అనుభవించటానికి నీకెంత హక్కున్నదో దానికీ అంతా ఉన్నది అని ఒకసారి బుద్ధితక్కువై సూచించాను.

నర్సు తోకతొక్కిన తాచల్లేఅయి. "ఎందుకూ? నా చెల్లెలికి ఏ లోపమూ రాకుండా నేను చూస్తానని నీకు నమ్మకం లేదా? దానికి కావాలన్నంత చదువు చెప్పిస్తాను ఎంత కట్నమైనా సరే ఇచ్చి మంచి మొగుణ్ణి తెస్తాను నాకు నా వాళ్ల పైన ఉన్న ప్రేమ చూపటానికి డబ్బు తప్ప – ఈ ఆస్తి తప్ప – మరేముంది?" అన్నది

మాటలు వేరేమోగాని భావాలు ముసలాయనవే

మరుసటి సెప్టెంబరులో యుద్ధం వచ్చేసింది. డాక్టరుగారు యుద్ధంలో



చేరాడు ఆయన తిరిగి వచ్చినదాకా సుందరమ్మగారూ, పిల్లా మా దగ్గరే ఉన్నారు. డాక్టరుగారి జీతంలో కొంత వాళ్ళకు ముట్టుతూనే వచ్చింది

ఆరోజుల్లో నర్సు ప్రవర్తనను నేను జాగ్రత్తగా గమనిస్తూ వచ్చాను. తల్లి తనను ఏమీ అడక్కపోవటం నర్సుకు బాధగా ఉండేది ఆవిడ తనను రోజూ డబ్బులో, చీరెలో, వస్తువులో అడుగుతూ తనపైన ఆధారపడిఉంటే నర్సు పరమానందంచెందేది ఉండేది కాని అలా జరగలేదు.

"ఎంత డబ్బుంటేనేం? నాకు నిజంగా నువుతప్ప ఎవరూ లేరు!" అని నర్సు నాతో చాలాసార్లన్నది

నిజమే నేనొక్కణ్ణే ఆమెపైన ఆధారపడి బతుకుతున్న వాణ్ణి!

యుద్ధంనుంచి తిరిగివచ్చాక డాక్టరుగారు గుంటూరులోనే ప్రాక్టీసు పెట్టాడు. ఇప్పుడాయనది మంచి ప్రాక్టీసు కాని వాళ్ళ ఇంటి వాతావరణంలో మార్పు లేదు ఇంకొంచెం ఫర్నిచరు జాస్తి ఉన్నది. డాక్టరుగారి లైబ్రరీ ఇప్పుడుచాలా పెద్దది


మా ఇంట్లో ఖరీదైన వస్తువులున్నాయిగాని, సంస్కృతిలేదు రేడియోగ్రాం అస్తమానం మోగుతూంటుంది అదినిశ్శబ్దంగాఉంటే నర్సుగాని, పిల్లలుగాని సహించరు అది మోగుతుంటే వినరు మా ఇంటినిండా గుట్టలుగుట్టలుగా డిటెక్టివు పుస్తకాలు!

ఎప్పుడన్నా గుంటూరు వెళ్ళినప్పుడు నా ప్రాణానికి హాయిగా ఉంటుంది. వాళ్ళింట్లోకూడా రేడియోవుంది. అది మోగుతున్నప్పుడుకూడా ఇల్లు ప్రశాంతంగానే ఉంటుంది.

నా మరదలు సరోజిని మా పెద్దవాడి ఈడుదే, కాని మా వాడు ఏకులాగా ఉంటాడు, సరోజిని చాలా బాగా ఉంటుంది మా పిల్లలందరి తలలోనూ వాల్వులున్నాయి వాళ్ళ తలలో పుట్టే భావాలు బయటికొస్తాయిగాని, బయటి నుంచి ఒకభావంకూడా వాళ్ళ తలలోకి ప్రవేశించినట్టు కనబడదు

నాకా, మానవప్రయత్నంలో-అంటే నా ప్రయత్నంలో - విశ్వాసంపోయింది నన్ను చాలా మంది మిస్టర్ నర్సు అంటారని నాకు తెలుసు.

(సమాప్తం)



బతికిన కాలేజి

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్ 11

జరిగిన కథ

పెద్దలకు నచ్చక పెళ్ళిచూపులు ఆగినా, అబ్బాయి పట్టూమాత్రం, అమ్మాయి రాధనే పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకొని, స్నేహితుడు చింతా సలహాతో తండ్రిని ఒప్పిస్తాడు. తీరా పెళ్ళిపీటలమీద పెళ్ళికూతురు రాధ కాకపోగా పట్టూ లేచిపోయి తిరిగి చింతా కోరికపై ఇంటికి వస్తాడు. అక్కడ రాధ కల్యాణి, తమ పెళ్ళి విషయంలో తల్లితో అభిప్రాయభేదము కలిగి, రామలింగయ్య సలహాపై నాట్య ప్రదర్శన ఇచ్చి అది సరిగా జరగక పోవటంతో నటరాజ మార్తాండశర్మవద్ద నాట్యం నేర్చుకుంటారు. శర్మగారు వెళ్ళిన తరువాత కల్యాణి ఉద్యోగంకోసం బెంగుళూరు వెళ్ళాలని సిద్ధపడగా రామలింగయ్య కోరికపై ఆగిపోతుంది. పేరయ్య తెచ్చిన సంబంధాలేమీ ఎవరికీ నచ్చవు.

11

"శ్వరమాజీ ఆముక్కనటంతోచే, నేనన్నాను. ఇద్యన్నా కొత్తోళ్ళని ముందుకి తీసుకురావటమేనండీ, ఈ రోశయ్యఇట్టం కూడా, అసలీముక్క తెల్పించే, నటీరావు దగ్గరికెఎందుకుపోతావండి, అన్నారు." అని కాస్త ఆగాడు రోశయ్య. మెల్లగా క్రీగంట రామలింగయ్యవంక చూస్తూ, "తల్లీ, ఈపెద ర్సనంఉట్టినే ఇచ్చావనుకోండి, మీపేరు దేశమంతా మోగిపోతాది. లచ్చలు కురిసిపోతాయి," అన్నాడు.

"అయిదువేలకు దమ్మిడీ తగ్గదు." అన్నాడు రామలింగయ్య.

"అయ్యో భావగారూ, అదేంటది. ఏదో అయిదో, ఆరో – వందలంటే నాయంగాని – ఊరుపేరులేని డ్యాన్సర్లని–"

"ఒరేయి, నీ ఆటలు నాదగ్గరసాగవు. పోయి మోసయ్య. శర్మంతటివాడు నటీరావుకన్నా గొప్పవిద్య వీళ్ళదగ్గరుందని చెప్పిన తరవాత ఇంక ఊరుపేరు ఎవడ్రా చెప్పేవాడు?"

అసలు ఆసామీల సంబధం లేకండానే రోశయ్య రామలింగయ్య మధ్య, బేరసారాలు మధ్యాహ్నం భోజనాలవేళదాకా సాగాయి. అయినా పరిష్కారం దగ్గర పడుతున్న సూచనలేమీ కనబడలేదు. రోశయ్యని ఒంటరిగా వొదిలేస్తే, పిల్లల్ని అమాయకుల్ని చేసి, అన్యాయం చేస్తాడన్న భయంకొద్దీ, రామలింగయ్య, అతన్ని తనింటికే భోజనానికి పిల్చుకుపోయాడు, బేరసారాలు మధ్యాహ్నానికి వాయిదావేసి.

* * *

ఇంక పట్టూ ఏం చేస్తున్నాడో కాస్త పరామర్శిద్దాం. నిజానికి పట్టూ ఏమీ చేయడం లేదు. అతడు ఉన్నాడంతే, బతికున్నాననడానికి నిదర్శనంగా, తనకు పెళ్ళి చేయాలని తల్లితండ్రులు చేసే ప్రయత్నాలన్నింటినీ ప్రతిఘటిస్తున్నాడు. ఇది గాక అతను చేస్తున్న మరో రెండు పనులు – ఏవో రెండు మెతుకులు తినడం, తన గదిలో తలుపు మూసుకుని పడుకోటం. అంటే, మంచంమీద వెల్లగిలా పడుకుని రెప్పమూత పడకుండా ఇంటి కప్పువేపు చూస్తుంటాడు. అది నిద్ర అనండి–సమాధి అనండి.

అతను మిస్టర్ చింతానికూడా కలుసుకోడం లేదు. న్యాయానికి మిస్టర్ చింతా ఒక్కడే అతని దగ్గర పెళ్ళి విషయం ఎత్తడు. పట్టూకి బుద్ధిచెప్పి పెళ్ళి కొప్పించమని రామయ్య అతన్ని ఎన్నిసార్లైనా బతిమాలాడు. మిస్టర్ చింతా మాత్రం, 'వివాహమనే అగాధంలోకి తన ప్రాణమిత్రుణ్ణి తొయ్యటానికి, తన చేతులు సహసించవ' న్నాడు. అంచేత పట్టూ మిస్టర్ చింతాని కూడా తప్పించుకు తిరగడానికి కారణం, పెళ్ళికి సంబంధించే బలవంతం మాత్రం కాదు.

మిస్టర్ చింతా చుట్టూ ఖులాసా అంటు వ్యాధిలా వ్యాపిస్తుంది. పట్టూ జీవితాంతం దాకా విషాద సముద్రం మధ్య మునిగి తేలుతూ గడపాలని నిశ్చయించుకున్నాడు. మిస్టర్ చింతా దగ్గర క్షణం కూచుంటే చాలు, అతని ఖులాసా తనలోని పవిత్ర విషాదాన్ని కాస్త అవతలికి నెట్టుతుందని అతని భయం. జరిగిన విషమ సంఘటన ఫలితంగా, తన ప్రేమ భగ్నమై పోవడమే గాక, ఇద్దరు అమాయక కన్యల జీవితాలు భగ్నమై పోయాయి. ఒక కన్యని తను తోసిపుచ్చాడు. అంచేత రెండో కన్యని వివాహమాడ్డానికి అర్హత తను కోల్పోయాడు. తను చేసిన అకృత్యానికి – తను కావాలని చెయ్యకపోయినా – నిష్కృతిగా సుఖాన్నీ సంతోషాన్నీ అతను త్యజించాలి. అది అతని పవిత్ర బాధ్యత. అయితే మిస్టర్ చింతా, దగ్గరకొచ్చాడంటే ఈ దిగులూ, ఈ విషాదం సడలిపోతాయి. పవిత్రమైన, గంభీరమైన, దేవాలయంలోకి జులాయితనంలాగ వెకిలితనంలాగ, వొచ్చి పడతాడు మిస్టర్ చింతా. పట్టూ మనస్సులో రకరకాల దృశ్యాలు, బరు

వైనవి, విషాదభరితమైనవి, ఎన్నో వొచ్చిపోతుంటాయి. తరుచు అతని ప్రేయసి — ఆ పేరుతెలియని అమ్మాయి అతని ప్రేయసి కావడం, ఆమెకతను తనమనస్సు విప్పి చెప్పడం, ఎన్నోసార్లు అతని ఊహలో జరిగిపోయింది — ఆ దృశ్యాల్లో ప్రత్యక్షమవుతుంటుంది. ఇద్దరికీ మధ్య ఊహా సంభాషణ నడుస్తుంది. ఇద్దరికళ్ళనించీ పవిత్రమైన విషాదాశ్రువులు గంగా యమునల్లాగ ప్రవహిస్తాయి. కాని ఈ రెండు ప్రవాహాలూ ఏకంకాకండా మధ్య చితికిపోయిన జీవితమొకటి పెద్ద పర్వతంలాగ అడ్డుపడుతుంది — ఆ జీవితం కళ్యాణిది. సరిగ్గాఇదేఘట్టం 'ప్రేమశిథిలాలు,' నవలలో ఎంతబాగా వర్ణించాడు 'ప్రేమశ్రీ'!! ఇంతకీ 'ప్రేమశ్రీ' ఆడదా మొగాడా? 'ప్రేమశిథిలాలు,' నవల రోజుకీ పదిసార్లు చదువుతున్నాడు పట్టూ, ముఖ్యంగా ఆఖర్ని ప్రేయసీప్రియులు కలుసుకున్న ఘట్టం. మిస్టర్ చింతాకంట ఈపుస్తకం పడితే అతను ఎగతాళిగా నవ్వుతాడు. కుర్రతనపు రాతలంటాడివన్నీ, ఈ నవలమీద తన తల్లిదండ్రులికీ మంచి అభిప్రాయంలేదు, అంచేత తలుపుమూసుకుని ఏకాంతంగా చదువుకుంటాడు పట్టూ.

ఒకసారి ఈనవలపేరు చెప్పకండానే, తన పరిస్థితికి ఈ ఘట్టాన్ని అన్వయించి, పట్టూ మిస్టర్ చింతాఎదట ఏకరువు పెట్టాడు తన ఆవేదనంతా. ఆ విషాదోత్సాహంలో తనకూ తన ప్రేయసికీ మధ్యనడిచే సంభాషణంతా తు_చ తప్పకండా అప్పగించాడు. యువకుడైన మిస్టర్‌చింతా ఆవిషాదంలో పాలు పంచుకుంటాడని ఆశించాడు. మిస్టర్ చింతా అతనివేపు చిలిపిగాచూస్తూ దారుణమైన విమర్శ ప్రారంభించాడు.

"బ్రదర్! ఇదంతా ఏ కుర్రకుంకో రాసిన చచ్చునవల్లోంచి ఏకరువు పెడుతున్నావు. అవునా? మొదటిసంగతి, ఆరెండోపిల్ల, అంటే నువ్వు మొట్టమొదట చూసి, ప్రేమించినపిల్ల, అసలుందో లేదో, ఉంటే ఎక్కడుందో. అసలామె ఎవరో నీకేమీ తెలీదు. రెండోసంగతి. నువ్వు ఏకారణంవల్ల ఈపిల్ల — అంటే పెళ్ళికూతురు — జీవితం నాశనం చేశావో ఆ రెండోపిల్లకి తెలిసే అవకాశం బొత్తిగాలేదు. ఒకవేళ తెలిసినా, ఆమె నీమీద అనురాగం వొలకబోస్తోందనుకోవడం అవివేకం, కొంత అహంకారం కూడాను. నీ మనస్సులో ఏముందో తెలుసుకోడానికి ఆమెకు దివ్యదృష్టిలేదు. కనురెప్పపాటు మాత్రం ఒకపరిస్థితిలో, అంటే ఆమెనుచూసి మతిపోయి నువ్వు బోర్లాపడ్డస్థితిలో నిన్నామె చూసింది. ఇంతవరకూ నిన్నామె గుర్తుంచుకోడమే అసంభవం. అల్లా గుర్తుంచుకోవాలీ అంటే ఆ అమ్మాయి గొప్ప డిటెక్టివ్ అయుండాలి. ఒకవేళ ఆమె నిజంగా పెద్దతరిఫీదుపొందిన డిటెక్టివే అయినప్పటికీ, ఆమెకు గుర్తున్నప్పటికీ, పెళ్ళిపీటల మీదనించి నువ్వు పారిపోయివచ్చి, ఒక అమాయకురాలి జీవితాన్ని నాశంచేశావని తెలిసినపుడు ఆమెకు నీమీద ఎటువంటి అభిప్రాయం కలుగుతుంది? నువ్వు వట్టి పురుగువని అసహ్యించుకుంటుందిగాని, చచ్చినా నిన్ను ప్రేమించదు. బ్రదర్! ఇకమీద ఈ చచ్చునవలలు చదవడం మానేసి కాస్త పెరగాలినువ్వు."

ఆ తరవాత పట్టూ మిస్టర్ చింతాని కలుసుకోవడమే మానేశాడు.

అంచేత గది అవతల మిస్టర్ చింతా గొంతు వినపడ్డంతోటే పట్టూకి దిగ్భ్రాంతి



కలిగింది. అతనా సమయంలో 'ప్రేమశిథిలాల'లో అతని కత్యంత ప్రియమైన ఆఖరుఘట్టం చదువుతున్నాడు.

'నీముఖం నాకింక చూపించకు,' అంది కల, ఆవేదన, దుఃఖం, ఆవేశం మిళితమైన అశ్రురుద్ధమైన గొంతుకతో.

'కలా, నా ప్రేమగులాబి, ఈలోకమనే కరకు రథచక్రాల క్రిందబడినలిగి ధూళిలో ఏకం కావలసినదేనా? నా వలపు తేనె సంప్రదాయమను విషసర్పం ఆకలికడుపున కాహుతి కావలసినదేనా......'

అప్పుడుతట్టాడు తలుపు మిస్టర్ చింతా. పట్టూ అదిరిపడి లేచాడు. అతనికి తెలీకుండానే ఆ నవలని పరుపుకింద దాచేశాయి అతని చేతులు.

''పట్టూ మైడియర్ ఫెలో, నిద్రా?'' అన్నాడు మిస్టర్ చింతా మళ్ళీ తలుపు తట్టుతూ. పట్టూ కళ్ళుతుడుచుకుని తలుపు తెరిచాడు.

అతనితోపాటు కమ్మని కరోనా చుట్టఘాటు, జులాయితనంలా ప్రవేశించింది, విషాదం చీకటి అలుముకుపోయిన ఆ గదిలోకి. అతని పొట్టిచేతికర్ర బంగారపు పొన్ను నవ్వులాగ మెరిసింది. పట్టూ ఈ దాడికి తట్టుకోలేక మంచంమీద కూర్చున్నాడు. కాస్త వెనకాలగా గుమ్మంలో నిలబడ్డ రామయ్యన్నాడు,

"అప్పటినించీ ఇలాగే ఉన్నాడు."

"అతనిసంగతి నా కొదిలి పెట్టండి," అన్నాడు మిస్టర్ చింతా. రామయ్య వెళ్ళిపోయాడు.

"లేచి డ్రెస్ వేసుకో," అన్నాడు మిస్టర్ చింతా.

"నే నెక్కడికీ రాను," అన్నాడుపట్టూ.

"లే," అని రెట్టించాడు మిస్టర్ చింతా.

"ఎక్కడికి?"

''ఇప్పు డొక నాట్య ప్రదర్శనముంది. మనం వెడుతున్నాం."

''నే నింకేనాట్యం చూడను. నాకసలు నాట్యాలంటే రోత.''

"రోతయితే ఆ నర్తకినెల్లా ప్రేమించావు?''

"ఆమెనాట్యం చూసినకళ్ళతో ఇంకే నాట్యం చూడదలచుకోలేదు; అది అమర నాట్యం. ఆమె అప్సరస."

"ఈ నాట్యం అమరనాట్యం కాదని నువ్వెలా చెప్పగలవు? ఒకరుకాదు ఇద్దరు డాన్సర్లున్నారు. అందులో అధమం ఒకత్తె అయినా అప్సరసకాదని రుజువేమిటి? ఈ పిచ్చివాగుడు కట్టిపెట్టి ఇంకలే. ఏవిటల్లా నిలబడ్డావు, పాఠం చదువుకునిరాని మొద్దబ్బాయిలా ముఖంపెట్టి?"

''నన్నొదిలి పెట్రో నీకు పుణ్యముంటుంది.''

"పట్టూ నాసంగతి నీకుతెలుసు. వొద్దు వొద్దంటే ఒప్పుకునే రకంకాదునేను. రెండు టిక్కట్లు కొన్నాను మొదటివరసలో. ఎవరో కొత్తడాన్సర్లట, వాణి, రాణి. నటరాజ మార్తాండశర్మ శిష్యురాళ్ళట. అంచేత విశేషం ఏదో ఉండితీరాలి. ఇంక అరగంటే వుంది. నీకు అయిదునిమిషా లిచ్చాను డ్రస్సుచేసుకోడానికి."

పట్టూ నిట్టూర్చాడు. మొహం కడుక్కోటానికి లేచాడు,

ఇక్కడో చిన్నవిషయం చెప్పాలి.

రంగస్థలంమీద అసలుపేర్లు రాణించవని, రామలింగయ్య కల్యాణికీ రాధకీ, వాణీ, రాణీ అని పేర్లుపెట్టాడు. పేరు మార్పుమూలంగా వాళ్ళు ఫలానా దివానుగారి మనమరాళ్ళని ఏవరికీ తెలియదని తన్ను తాను తృప్తిపరుచుకుంది శాంతమ్మ. మారుపేర్లు తమకికూడా ఏదో రక్షణ కల్పిస్తాయనుకున్నారు కల్యాణీ రాధా. అంచేత ఒప్పుకున్నారు.

ఇంటి దగ్గర్నించి బయలుదేరి హాల్లో ప్రవేశించేదాకా, తను ఈ ప్రదర్శనం చూడవలసిన అవసరం లేకుండా ఏదన్నా అవాంతరం రావాలని పట్టూ భగవంతుణ్ణి ప్రార్థిస్తూనే ఉన్నాడు.

ఆ అవాంతరం రానే వొచ్చింది — పర్వతాకారంలో ఉన్న కూతురూ తల్లిరూపంలో వాళ్ళిద్దరూ కలెక్టర్ సతీమణీ, కుమారీ రత్నం. రోశయ్య వాళ్ళిద్దర్నీ మిస్టర్ చింతా రిజర్వుచేసినకుర్చీల్లోకూచోబెట్టాడు.

మిస్టర్ చింతా ఆ సీట్లు తన వన్నాడు. అంతకన్నా మంచిసీట్లు చూపిస్తానని బతిమాలాడు రోశయ్య.

"మిస్టర్ రోశయ్యా! ఇంతకన్నా మంచిసీట్లు నాకనవసరం. నే నేదో డబ్బిచ్చి కొనుక్కున్న సీట్లు నాకుంచాలి. ఇంతకన్నా మంచిసీట్లకు నాకర్హతలేదు. కలెక్టరు సతీమణికీ, వారి కుమారీ రత్నానికీ చూపించండి ఆ మంచిసీట్లు,'' అన్నాడు మిస్టర్ చింతా.

ఎన్నివిధాల బతిమాలినా మిస్టర్ చింతా మంచిసీట్లు పుచ్చుకుని? ఇవి వొదిలెయ్యడానికి ఒప్పుకోలేదు.

"అయితే మీ డబ్బిచ్చేస్తాం పట్టుకుపొండి." అన్నాడు రోశయ్య.

''నాకు కావలసింది డబ్బుకాదు. ఆ రెండుసీట్లూ," అన్నాడు మిస్టర్ చింతా, ఆ సీట్లవంక చూపిస్తూ.

''అది ఈల్లేదయ్యా. ఇట్టంలేకపోతే డబ్బుటుకుపో—'' అనేసి వెళ్ళిపోయాడు రోశయ్య. ఈ ప్రతిష్ఠంభనకి పరిష్కారమార్గం ఇంకేమీలేదనీ, మిస్టర్ చింతా ఇంక చేసేదిలేక వెనక్కితిరిగి వెళ్ళిపోవడం తప్పదనీ ఆశించాడు పట్టూ. అయితే మిస్టర్ చింతాని పూర్తి ఎరగడు పట్టూ.

మిస్టర్ చింతా స్టేజీఎక్కి, సరిగ్గా మధ్యని జేబురుమాలు పరుచుకుని అక్కడ కూచున్నాడు. అసలు ప్రదర్శనంకంటే ఈ ప్రదర్శనం బాగుంది పట్టుకి. అతడు హాలు గుమ్మంలో నిలబడి చోద్యం చూస్తున్నాడు. రోశయ్య ఏం చెయ్యడానికీ తోచక తెర తొలగించి చూస్తున్నాడు లోపలినించి. మిస్టర్ చింతా తన కరోనా చుట్టతీశాడు. వెంటనే రోశయ్య పోలీసుని పిలిచాడు సంజ్ఞచేసి. మిస్టర్ చింతా చుట్టవెలిగించగానే, ఆ మిషమీద అతన్ని బయటికి

లాగించి పారెయ్యొచ్చు ననుకున్నాడు, కాని మిస్టర్ చింతా అతనికా అవకాశం ఇవ్వ లేదు. చుట్ట నోట్లోపెట్టుకుని అతన్ని ఉరికే ఊరించాడంతే. ప్రేక్షకులవంక తిరిగి చిరునవ్వినవ్వి, చుట్టమళ్ళీ జేబులోపెట్టాడు మిస్టర్ చింతా.

రెండో గంటయి పదినిమిషాలైంది. స్టేజిమధ్యని మిస్టర్ చింతా కూచుని వుండగా ప్రదర్శనం సాగడానికి వీల్లేదుగనక మూడోగంట ఎంతకీ మోగలేదు. దూరంగా ప్రేక్షకులమధ్యనించి ఒకగొంతు,

"ఏంటయ్యా ఈగొడవ ?" అంది.

"అడగవలసిన ప్రశ్న అడిగాడు, ఆ పెద్దమణిశి ఎవరో, వారిల్లా దయచేసి దానికి సమాధానం తెలుసుకోడం ఎంతైనా అవసరం. దయచెయ్యండి," అన్నాడు మిస్టర్ చింతా, పక్కని సిద్ధంగాఉన్న మైక్ చేత్తోపట్టుకుని, ఆపెద్దమనిషి ఇరుగుపొరుగు అతన్ని ముందుకుతొయ్యడానికి ప్రయత్నించారు. కానిమూకలోంచి బయటపడ్డం అతని కిష్టంలేక కుర్చీ నంటిపెట్టుకు ఉండిపోయాడు ఆ పెద్దమనిషి. మైక్ పనిచేస్తోందని తెలియగానే మిస్టర్ చింతా ప్రారంభించాడు.

"జెంటిల్‌మెన్ మిస్టర్ రోశయ్యా సంతకంతోఉన్న ఈ రెండు టిక్కట్లమీదా, నాకూ నామిత్రుడికీ మొదటి వరసలోని 23, 24 నంబర్లుగల కుర్చీలు రిజర్వు చేసినట్టు స్పష్టంగాఉంది. అనుమానం ఉన్న పెద్ద మనుష్యులు వచ్చి వీటినిచూడొచ్చు. ప్రదర్శనం ప్రారంభం కావడానికి పది నిమిషాలు ముందుగానే నేనూ మా స్నేహితుడూ ఇక్కడికివచ్చాం. ఈ నంబర్లుగల కుర్చీలు ఖాళీగాలేవు. అవి ఖాళీచేయించి మాకిప్పించడం న్యాయం,"

ఎక్కడో ఒకమూలనుంచి "కలెక్టరుగారి పెళ్ళాన్ని ఎట్టా లెగ్గొడతాడయా," అన్నారెవరో. మిస్టర్ చింతా దానికి సమాధానంగా చెప్పాడు." కలెక్టర్‌గారితో గాని వారి సతీమణితోగాని నాకెటువంటి పేచీలేదని ఇందుమూలంగా పెద్దలందరికీ తెలియజేస్తున్నాను. కలెక్టరుగారి కుటుంబానికి నాకులేనటువంటి హక్కులు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకి వారే ప్రదర్శనానికీ డబ్బుపెట్టి టిక్కట్లు కొనక్కర్లేదు. మామూలుమనిషినైన నాకటువంటి హక్కులెల్లా ఉంటాయి? ఆవిషయమైన పేచీ పెట్టుకోడానికి నే నెంతటివాణ్ణి? అయితే నాకూకొన్ని హక్కులున్నాయి. నేను డబ్బెట్టి ఏసీట్లు రిజర్వు చేయించుకొన్నానో, అవినాకోసం ప్రత్యేకించి ఉంచాలి. అదీ నాకూ మిస్టర్ రోశయ్యకీ మధ్య జరిగిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని అతిక్రమించడానికి మిస్టర్ రోశయ్యకి హక్కులేదని నావాదం."

"అంతకన్నా మంచిసీట్లు సూపిత్తానన్నానుగా," అన్నాడు రోశయ్య తెరలోంచి ఇవతలికివచ్చి.

"మహాశయులారా! మిస్టర్ రోశయ్య వాదంమీరు విన్నారుగా. మనకందరికీ ఏవిధమైన ప్రదర్శనం, ఏ సీట్లు ఇస్తానని ఆయన వాగ్దానంచేశారో, మనం వాటికే అర్హులం. మంచీ చెడ్డలవిషయం అప్రస్తుతం. ఆయనదృష్టిలో మంచి మనందరికీ మంచి అవుతుందన్న నమ్మకం ఏమిటి? ఉదాహరణకి, ఎవరో వాణీ రాణీ అనబడే వారి నాట్యప్రదర్శనల చూపిస్తానని మిస్టర్ రోశయ్య మనకి టిక్కట్లు అమ్మాడు. ఇప్పుడు మిస్టర్ రోశయ్య తనే ఆడవేషం వేసుకుని వచ్చి, నేనే నాట్యం చేస్తాను, ఆ అమ్మాయిల నాట్యంకంటే నా నాట్యమే బాగుంటుంది, అన్నాడనుకోండి. మనం ఒప్పుకుందామా ?"

ప్రేక్షకులలో నవ్వులు; రోశయ్య ఏదో చెప్పబోయి, ఏం చెప్పాలో తోచక విరమించుకున్నాడు. మిస్టర్ చింతా చెయ్యెత్తి అన్నాడు.

"నే నిది నవ్వులాటకోసం అనడంలేదు. మిస్టర్ రోశయ్య, మిస్‌వాణీ, మిస్ రాణీ కన్న బాగా డాన్సు చెయ్యొచ్చు. అదికాదనడానికి మనకేమి అధికారంలేదు. అయితే మనం చూడ్డానికి వచ్చింది మిస్‌వాణీ, మిస్ రాణీలనాట్యం. అందుకే మనం టిక్కట్లుకొన్నాం. అంతేగాని మిస్టర్ రోశయ్య డాన్సు చూడ్డానికి కాదు. అది ఎంత బాగున్నాసరే,"

ఈ ప్రతిష్టంభన అనంతంగా సాగేదే, ఇంతలో కలెక్టర్‌సతీమణి లేచినిలబడింది రోశయ్య నుద్దేశించి అంది.

"ఇవి వారిసీట్లని మాకుతెలీదు. మేమే ఇంకో సీట్లలోకిపోయి కూచుంటాం," అంటూ కదలబోయింది. రోశయ్య అమాంతంగా కిందికి దూకాడు ఆమె కడ్డుగా.

"అమ్మా ?" అన్నాడు. ఆ తరవాత ఇంకేమనడానికీ తోచక ఊరుకున్నాడు. ఈసంగతితెలిస్తే, కలెక్టరుగా రేమంటారో నని అతనిభయం, కాని వెంటనే మిస్టర్ చింతా అందుకున్నాడు.

"అమ్మా! మిస్టర్ చింతా, మంచీ మర్యాదా మరిచిపోయి, కేవలం పట్టుదల కోసం, ఇద్దరు ఒంటరిగావచ్చిన స్త్రీలను తమ సీట్లలోంచి లేవగొట్టేటంత బ్రూట్ కాదు. మీరు ఆ సీట్లలోనే కూచోవాలి. అది నా ప్రార్థన.''

"అయితే ఎందుకింత గొడవచేశావు?" అన్నారెవరో.

"జెంటిల్‌మన్. నేను చేసినగొడవ ఎందుకో కొద్దిక్షణాలలో మీకే అర్థమవుతుంది. ఇప్పుడు మిస్టర్ రోశయ్య ఈ మైక్ దగ్గరకువచ్చి, తను ఇంకొకరికి రిజర్వుచేసిన సీట్లలో, మర్యాదస్తులైన కలెక్టర్ సతీమణినీ వారి కుమార్తెనూ, వారికి నిజస్థితి చెప్పకండా కూచోబెట్టినందుకు, హృదయపూర్వకమైన క్షమార్పణ చెపుతారు,"

మిస్టర్ చింతా కిందికి దిగాడు, రోశయ్య పైకిఎక్కి అందరికీ క్షమార్పణ చెప్పక తప్పలేదు. ఆ తరవాత అతి మర్యాదగా మిస్టర్‌చింతాకి పట్టూకి కొంచెం పక్కగా రెండు కుర్చీలు వేయించి కూచోబెట్టాడు.

ఇంత హడావిడీ అయిన తరవాత, ఈ

పర్యవసానం పట్టాకి ఎంతమాత్రం తృప్తిగాలేదు. ఒకవేళ ప్రదర్శనం ఆగిపోక పోయినా, అధమం అధికారుల సహాయంతో మిస్టర్‌చింతానీ తనినీ హాలునించి బయటికి లాగేయించడంగాని, మిస్టర్‌చింతా తనంతట తనే కోపగించి వెళ్ళిపోవడం గాని జరుగుతుందనీ, తనకి ప్రదర్శనం చూడవలసిన దురదృష్టం తప్పుతుందనీ ఆశ పడ్డాడు. అందరికన్నా అతనికి మిస్టర్ చింతామీద ఎక్కువ కోపమొచ్చింది అనవసరంగా తనలో ఆశలు రేకెత్తించి ఆఖరికి తన్ను మోసగించాడేమోనన్న అనుమానం కూడా అతనికి మనసులో కలక్కపోలేదు. అంచేత వ్యక్తిగతమైన తన అసమ్మతిని తెలియజేయడానికి ప్రదర్శనం అయిపోయేంత దాకా కళ్ళుమూసుకు కూచోవాలని నిర్ణయించుకున్నాడు పట్టా.

మూడోగంట మోగించారు.

మంచి బలమైనమగగొంతు శివపార్వతీ ప్రార్థనశ్లోకం పాడింది. (రామలింగయ్య ఈ అవకాశం తనంతట తను కావాలని పుచ్చుకున్నాడు) శబ్దం చెప్పటానికీ, పాట పాడ్డానికీ నటరాజశర్మ తన శిష్యుణ్ణి ఒకణ్ణి పంపించాడు. అతను గణపతి ప్రార్థనతో ప్రారంభించాడు. తెర మెల్లగా తొలిగింది. గజ్జెలు చప్పుడయాయి నాట్యం నడుస్తోందన్న మాట. పట్టా కళ్ళుమూసుకుని ఆ తాళానికీ రాగానికీ అనుగుణంగా, తను ఆ రోజున అరుగుమీద చూచిన అప్సరస నాట్యం చేస్తున్నట్టు ఊహించుకుని ఆనందిస్తున్నాడు కాని మిస్టర్‌చింతా పక్కనుండగా, ఎదట నాట్యప్రదర్శనం జరుగుతుండగా, కళ్ళు మూసుకు కూచోడం అసంభవమని పట్టాకి తెలీదు పాపం. మిస్టర్ చింతా పట్టా డొక్కలో గట్టిగా పొడిచాడు పట్టా కళ్ళుతెరిచి కోపంగా మిస్టర్ చింతా వంక చూశాడు మిస్టర్‌చింతా అతనిముఖం రెండు చేతులతోనూ స్టేజివంక తిప్పి,

"చూడు!" అన్నాడు

పట్టు చూశాడు.

చటుకుని కుర్చీలో ఎగిరిగంతేసి మళ్ళీ కూచున్నాడు. కళ్ళు నలుపుకుని మళ్ళీ చూశాడు. కళ్ళు మూసుకు తను కంటున్న కల నిజమైందా? లేక అది భ్రమా?

ఆనాడు అరుగుమీద చూసిన అప్సరసే' అనుమానం లేదు

"ఒరేయి, ఆ పిల్లే ఆ అమ్మాయి" అన్నాడు, కొంచెం గట్టిగా

"ఆ పిల్ల అమ్మాయని నువు చెపితేగాని నాకు తెలీదా? కాస్త నోరుమూసుకుని ఆ ప్రదర్శనం చూడు. నీ ప్రదర్శనం అప్పుడే వెనక కుర్చీల వాళ్లుచూసి, విన్నవతలికి మోసెయ్యాలని తీర్మానించుకున్నట్టు నా అనుమానం అంచేత నోరెత్తకు, నాట్యంచూసి ఆనందించు బ్యూటిఫుల్ ఆహా! ఎంతక్లిష్టమైన అడుగైనా ఎంత తేలిగ్గావేస్తోందిరా అమ్మాయి గ్రేట్..." మిస్టర్ చింతాగొంతు తగ్గించి ప్రత్యక్ష వ్యాఖ్యానం నాట్యం జరుగుతున్నంతసేపూ నడుపుతూనే ఉన్నాడు

పట్టా మాత్రం అదేమీ వినడంలేదు రెప్పవాల్చకండా ఆ అమ్మాయిని కళ్ళతో తినేస్తూ కూచున్నాడు

ప్రార్థనాగీతం అభినందుస్తున్నది రాధ అని వేరే చెప్పక్కర్లేదు

సగంలో అతి గంభీరంగా కదులుతూ రంగస్థలంమీదికి వచ్చింది కళ్యాణి

"ఒరేయి. ఆ అమ్మాయి..." అని అరవబోయాడు పట్టా

మిస్టర్ చింతా అతనినోరు నొక్కేశాడు. నవనాడులూ కుంగిపోయి, స్థాణువులా అలాగే ఉండిపోయాడు పట్టా

కల్యాణి నాట్యం చూశాక మిస్టర్ చింతా కూడా తన ప్రత్యక్ష వ్యాఖ్యానం సంగతి మరిచిపోయాడు

విశ్రాంతి సమయంలో మళ్ళీ ఇద్దరికీ మతులొచ్చాయి. ఇద్దరూ హాలు అవతలికి పోయి చుట్టలంటించారు

"ఒరేయి. వాళ్ళిద్దరూ అప్పచెల్లెళ్ళన్నమాట," అన్నాడు పట్టా

"పత్రికలో వేశారుగా." అన్నాడు మిస్టర్ చింతా.

"అదీ నేను చేసిన పొరబాటు, చెల్లెల్ని చూసి అప్పగారనుకున్నాను. అంచే అప్పగారుందని తెలీదు. చెల్లెలే అనుకున్నా తీరా అప్పగార్ని తీసుకొచ్చేసరికి.."

"అట్టెట్టె...నువ్వేం మాట్లాడుతున్నావో నీకే తెలీదు. చెల్లెలొక్కత్తి ఉంటే, మరి అప్పగారుండదూ?"

"అప్పుడు నాకు తెలీదు"

"ఎప్పుడు?"

"మొదట అంచే తరవాతా తెలీదు. You are talking nonsense నిజానికి ఇప్పటిదాకా తెలీదు"

"డాన్సు నీమతి చెడగొట్టినట్టుంది"

"అదికాదురా నాకిప్పు డంతా అర్థమైపోయింది. ఆ అమ్మాయి..." ఇంతలో రోశయ్యొక్కడికి వచ్చాడు

"సార్! డాన్సెట్టాగుంది? కొత్తోళ్ళకి కాన్సు ఇద్దారని, తెగించి ఎట్టేశా, ఈళ్ళ డాన్సు"

"వాళ్ళకి మీ రివ్వడ మేమిటి? మీకు వాళ్ళిచ్చారు చాన్సు ఇలాంటి డాన్సర్లు మీకెక్కడ దొరుకుతారు, మిస్టర్ రోశయ్యా?" అన్నాడు మిస్టర్ చింతా రోశయ్య అతన్ని మంచిమాట చేసుకోడానికని పనిగట్టుకుని వొచ్చాడు మొదట్లోనే ఆ ప్రయత్నం బెడిసి కొట్టడంవల్ల అది విరమించుకుని చెప్పి వెళ్ళిపోయాడు. పట్టా మళ్ళీ మొదలుపెట్టి తన కథ చెబుదామనుకున్నాడుగాని, ఇంతలోనే గంటకొట్టారు మిస్టర్ చింతా చుట్టపారేసి లోపలికి వెళ్ళిపోయాడు పట్టా నిట్టూర్చి అతన్ని అనుసరించాడు

మిగతాసగం ప్రదర్శనం పట్టా నిజంగా చూడలేదు అంచే అతనికళ్ళే చూశాయి, అతని మనస్సంతా రకరకాల ఆలోచనలతో నిండిపోయింది

(సశేషం)

పరిమళములు

శ్లో॥ పతతి కదాచిత్ నభసః ఖాతే పాతాళతోఽపి జలమేతి।
దైవమచింత్యం బలవత్ బలవాన్నను పురుషకారోఽపి॥
క్లేశస్యాంగమదత్వా సుఖమేవ సుఖాని నేహ లభ్యంతే।
మధుభిన్మథనాఽయస్తైః ఆశ్లిష్యతి బాహుభిర్లక్ష్మీమ్॥

—సుభాషితమ్

జలము ఆకాశమునుండి కురిసిన కురువ వచ్చును భూమిని త్రవ్వినయెడల పాతాళమునుండియైనను జలము వచ్చును దైవము శక్తిగలదే అది అనూహ్యము ఐతే, పురుషప్రయత్నము కూడ శక్తిగలదే యగును అనగా ఒకప్పుడు వాన కురియకపోవచ్చునుగాని, భూమిని పాతాళముదాకనైనను త్రవ్వి నీరు తేవచ్చును గనుక పురుష ప్రయత్న సాధ్యముగాని పని యుండదు

కాయకష్టము చేయక సులభముగా సుఖములు లభించవు విష్ణువంతటి వాడుకూడ సముద్రమథనాయాసము చేత లక్ష్మిని పొంది అలసిన హస్తములచేత ఆమెను ఆలింగనము చేసికొనగలిగెను కనుక కష్టపడక సుఖములు లభించవు,

ఆ॥ జలఘటాదులందుఁ జంద్రసూర్యాదులు
కానఁబడును గాలిఁ గదలుభంగి
నాత్మకర్మ నిర్మితాంగంబులను బ్రాణి
కదలుచుండు రాగకలితుఁ డగుచు.

—పోతనామాత్యుడు

నీటికుండలోను తటాకాదులలోను చంద్రసూర్యులు నక్షత్రాదులు ప్రతిబింబించి జలము కదలినప్పుడు వారు గూడ కదలుచుందురు, అలాగుననే ప్రాణులు తమ కర్మల ఫలములుగా నేర్పడిన అవయవములు కదలినప్పుడు తాముకూడ రాగవశులై కదులుచుందురు అనగా, కదలిక ఉపాధికేగాని జీవునకు లేదని భావము

గీ॥ సవిధ కీర్ణపరాగాగ్ని సాక్షిగాఁగ, దమ్మివిందు కరగ్రహణ మ్మొనర్పఁ,
బొలుచు పద్మినికిని నల్లపూసదండ, గట్టినాఁ డన నెలదేఁటిగములు పొదలె।

—మాదయ్యాగారి మల్లన

సమీపమునందు చెదరిపడిన పుప్పొడియను అగ్ని సాక్షిగాగా, పద్మిని పాణిగ్రహణమును సూర్యుడు చేయునప్పుడు, అతడు ఆమెకు నల్లపూసల దండను మెడలో కట్టినాడా యనునట్లు పద్మినిచుట్టు తుమ్మెదలు ఒప్పెను

ఉ॥ కాముని గాల్చి బూడిదను గంధముగా గొని యెద్దు నెక్కుచున్
బాములు దోలు నెమ్ములు గపాలముఁబుం దనమేనిసొమ్ముగా
గాములు గూడి యాడుచును గాడు గృహంబుగ నున్నవాడు గం
గామృత మౌ దలం జిలికినంత సదాశివుఁ డయ్యె నెల్లెడన్.

—కొరవి గోపరాజు.

మన్మథుని దహించిన బూడిదను గంధముగా పూసికొని, యెద్దుపై నెక్కి, సర్పములు, తోలు, ఎముకలు, పురియలు ఆభరణములుగా గలిగి పిశాచములతో క్రీడించుచు శ్మశానము నివాసముగా నున్నప్పటికిని శివుడు పవిత్ర గంగాజల మొకింత తలపైన చిలికిన మాత్రములో ప్రపంచమున కంతటికిని "సదాశివుడు" (సర్వమంగళకరుడు) అయ్యెను. గంగ మాహాత్మ్య మెంత గొప్పదోకదా !

గీ॥ దేశవైశాల్య మర్థసిద్ధికిని మూల - మిల యొకింతైన గుంటకాల్వలు రచించి
నయము పేదకు నరిగోరునను నొసంగి - ప్రబలఁజేసిన నర్థధర్మములు పెరుగు.

— కృష్ణదేవరాయలు

పంటపొలమును పెంచుటవలన ధనము చేకూరగలదు కనుక పాలకులు కొంచెము భూమినైనను విడువకుండా అందులోని కుంటలకు కాలువలు ఏర్పరచి పేదలకు చౌకగా పన్నుపడునట్లు కోరుకు ఇచ్చి వారిని బాగుపరచినయెడల దేశములో ధర్మము, అర్థము రెండుగూడ అభివృద్ధి చెందును.

కం॥ మానంబె తొడవు సతులకు - మానము ప్రాణాధికంబు మాన మఖిల స
మ్మానములకు మూలంబగు - మానరహితమైన బ్రతుకు మానిని కేలా ?

— ముక్కు తిమ్మన

చ॥ మనమున గొన్న నెవ్వగలు మాన్పి ఘటింతురు కావ్యసమ్మదం,
బనఘ కథాముఖంబున హితాహితబోధ మొనర్తు రింపుగాఁ,
గనుఁగొనుకంటె నద్భుతముగా నెఱిఁగింతు రతీంద్రియార్థముల్
ఘనమతు లెల్లవారికి నకారణబంధులుగారె సత్కవుల్.

— సంకుసాల నృసింహకవి

చ॥ సుడిగొని రామపాదములు సోకిన ధూళివహించి రాయి యే
ర్పడ నొక కాంత యయ్యెనఁట, పన్నగ నాతని పాదరేణు వి
య్యెడవడి నోడసోక నిది యేమగునో యని సంశయాత్ముడై
కడిగె గుహుండు రాము పదకంజయుగంబు భయమ్ము పెంపునన్.

— మొల్ల.

సీ॥ శబ్దశంస్కార మెచ్చటను జారగనీక పదమైత్రి యర్థసంపదలఁ బొదలఁ
దలఁపెల్ల నక్లిష్టతను బ్రదీపితముగాఁ బునరుక్తిదోషంబు పొంతఁ బోక
యాకాంక్షితస్ఫూర్తి యాచరించుచును శాఖాచంక్రమక్రియఁ గడవఁజనక
ప్రకృతార్థభావంబు పాదుకో నడుకుచు నుపపత్తి యెందు నతూర్జితముగ

గీ॥ నొకటఁ బూర్వోత్తర విరోధ మొదవకుండఁ దత్తదవయవవాక్య తాత్పర్యభేద
ములు మహాకావ్య తాత్పర్యమునకు నొనరఁ బలుక నేర్చుట బహుతపఃఫలముగాదె.

— పింగళి సూరన.

శిశిరఋతు వాయువు

చ॥ కొలఁది వితస్తమంచులను గొంచుఁ, బయోష్ణిఁ గలంచి, చంద్రభా
గ లహరులందుఁ దేలి, శుచిఁ గాంచి యహస్కరజోర్మిమైత్రి, ని
స్తులమగు సింధుతీరములఁ దూగు సురద్రుమముల్ గదల్చుచున్
పొలిచె హిమాద్రివాయువులు భూపతికిన్ శ్రమదప్రదంబులై

— ఆంధ్రవిష్ణు.

పంచతంత్రము

జరిగిన కథ

సంజీవకుని స్నేహముచే పింగళకుడు జ్ఞానశీలి ఆయెను కరటకదమనకులకు రాజానుగ్రహము పీగెను పొటేళ్ళ పోరాటమున నక్క చచ్చినకథ — దేవశర్మ ఆషాఢభూతిచే మోసగింపబడిన కథ — కులటయైన భార్య తన భర్తను మోసగించుట, మరొక ర్తుక తన భర్తను వధ్యశిలకు పంపిన వివరములను చెప్పి తదుపరి సాలెవాడు రాజకన్యయందు మన్మథ తాపమునకు గురియగుట నెరిగిన స్నేహితుడైన వడ్రంగి వానికొక కీలు గరుడపక్షిని నిర్మించియిచ్చి రాజకన్యను కలసి వచ్చునట్లు ఉపాయముచేసెను కడకు ఈ విషయము గుర్తులవల్ల నెరిగిన పరిచారికలు రాజునకు నివేదించిరి రాజు తన కుమార్తెద్వారా సాక్షాత్తు శ్రీమన్నారాయణ మూర్తియే తన అల్లుడని తెలిసికొని ఇతర రాజుల భూభాగములను ఆక్రమించుకోగా శత్రువులు దండెత్తివచ్చిరి ఆయుద్ధములో శ్రీమన్నారాయణుని కృపవలన శత్రువు లందరు ఈతనిచే ఓడిపోవుటవలన తన విజయమునకు కారకుడైన ఆతనికి తన కుమార్తెనిచ్చి వివాహముచేసెను కనుక బాగుగా ఆలోచించిన పథకము ఫలించును

దమనకుడు చెప్పిన తంతువాయుని కథ విని,

కరటకుడు — భద్రుడా ! నీమాట సత్యమే కాని నాకు చాల భయముగ నున్నది. సంజీవకుడు బుద్ధిశాలి మన ప్రభువైన మృగరాజు అతి రౌద్రుడు నీకు బుద్ధి కౌశలము ఎంతగా ఉన్నప్పటికిని నీవు పింగళకుని ఆశ్రయమునుండి సంజీవకుని విడిపించ జాలనే జాలవు

దమనకుడు — సోదరా ! నన్ను అసమర్థుడనుకొనకుము ఎందుకనగా, మానవుడు ఉపాయ సాధనములచేత ఏపనిని చేయగలడో అది పరాక్రమ ప్రయోగముచేత గూడ అతనికిఅసాధ్యమగును పూర్వమొక ఆడుకాకి కనకసూత్రము ద్వారా ఒక కృష్ణసర్పమును బంధించి చంపించెను.

కర — ఆ కథయేమి ? చెప్పుము

దమనకుడు ఈ క్రిందివిధముగా చెప్పెను

కాకదంపతి - కనకసూత్ర - కృష్ణసర్పముల కథ

ఒకచోట ఒక పెద్ద మఱ్ఱిచెట్టుపైన కాక దంపతులు నివసించి యుండెను ఆ వృక్ష వివరములోనే నివాసముగా ఉన్న ఒక కృష్ణసర్పము, ఆ కాకి ప్రసవించు పిల్లలను ఎల్లప్పుడు భక్షించు చుండెను అందుచేత ఆ కాకదంపతులు దుఃఖపడి ఆ సమీపమున మరియొక చెట్టునీడలో ఉండినఒక నక్క వద్దకు పోయి యీ విధముగా చెప్పిరి.

కా దం — మిత్రమా ! మా తరుకోటరములో ఒక సర్పము ఉన్నది. అది ప్రతిదినము మాపిల్లలను తినుచుండును మాకు ఏమియుతోచుటలేదు మా పిల్లల రక్షణమునకు ఉపాయమును బోధించుము మాకుగూడా ప్రాణాపాయము సంభవించులాగు ఉన్నది.

నక్క — మీరు దుఃఖించవలసిన అవసరము లేదు ఆ క్షుద్ర సర్పమును సులభముగా చంపవచ్చును.

కా.దం ఎట్లుమిత్రమా ! చెప్పుము.

నక్క ఈవిధముగ కథచెప్పెను.

కొంగ - జలచరములు - ఎండ్రకాయకథ

ఒక వనములో అనేక జలచరములతో గూడిన ఒక పెద్ద కొలనుండెను ఆ సరస్సునే ఆశ్రయించుకొని యొక కొంగ యుండెను, కాని అది చాల ముసలిదగుటచేత జలచరములను చంపుటకు అసమర్థమై యుండెను అందువలన ఆహారము లభించక అది ఆకలిచే కృశించి ఆ సరస్తీరములో కూర్చొని కన్నీళ్ళు ధారగా ఏడ్చుచుండెను అప్పుడొక యెండ్రకాయ అచ్చటి యితర జలజంతువులతో కూడుకొని ఆ కొంగవద్దకువచ్చి సానుభూతితో దుఃఖించుచు ప్రేమపూర్వకముగా నిట్లనెను

ఎండ్ర మామా ! ఏలనీవు ఆహారము తినకుండ ఏడ్చుచు కూర్చున్నావు ?

కొం నాయనా ! నిజము తెలిసికొంటివి నే నిప్పుడు చేపలను తినుటమాని వైరాగ్యముతో ప్రాయోపవేశము చేయుచున్నాను అందువలన నన్ను సమీపించినమత్స్యములనుగూడ నేనుతినుటలేదు.

ఎం మామా ! ఆ వైరాగ్యము నీకు ఏల కలిగెను ?

కొం వత్సా ! నేను ఈ సరస్సులోనెపుట్టి పెరిగినాను ఇక్కడపన్నెండేండ్లకరువు రానున్నదని విన్నాను

ఎం ఎవరు చెప్పిరి ?


కొం ఒక జ్యోతిష్కుడు చెప్పెను శనైశ్చరగ్రహము రోహిణిని భేదించుకుని అంగారకుని, శుక్రుని చేరునట. శని గ్రహమునకు ఇట్టి సంచారము ఉన్నప్పుడు 12 ఏండ్ల క్షామము తప్పదని జ్యోతిశ్శాస్త్రములో చెప్ప బడినదట. అప్పుడీసరస్సులో నీరు ఇంకిపోవును అట్టి కరువుపరిస్థితిలోనాతో పుట్టిపెరిగిన ఈజలచరములన్నియుజలాభావముచేత నశించిపోవును వాని వియోగమును నేను భరింపజాలను కనుక ఆదుఃఖముచేత అన్నోదకములను వీడిప్రాయోపవేశము చేయుచున్నాను ఇప్పుడు చిన్న

చిన్న కుంటలలోనున్న జలజంతువులను పెద్ద జలచరములు పెద్దపెద్ద తటాకము లోనికి కొనిపోవుచున్నవి మొసలి, నీటి ఉడుము, నీటికోతి, నీటి ఏనుగు మొదలగు పెద్ద జంతువులు స్వయము గానే బయలుదేరి పెద్ద తటాకములు చేరుచున్నవి కాని, ఈ సరస్సులో నున్న జలచరములు మాత్రము నిశ్చింతగా నున్నవి వీరిని కాపాడువా రెవ్వరును లేరుగదాయని నేను ఎక్కువగా ఏడ్చుచున్నాను" అప్పుడు ఎండ్రకాయ అచ్చటి జలచరముల కన్నింటికిని ఆ సమాచారమును తెల్పెను — ఆసంగతి తెలిసి అచ్చటిమత్స్యకూర్మాదులన్నియు భయపడి ఆ బకమును సమీపించి, "మామా! మాకు రక్షణోపాయ మేమైనఉన్నదా?" అని అడిగెను. అప్పుడు బకము "ఈ సరస్సునకు సమీపముననే ఒకపెద్ద తటాకము కలదు అందులోనీరు సమృద్ధిగా నున్నది ఇరువదినాలుగేండ్లు అనావృష్టి సంభవించినప్పటికిని ఆ తటాకము ఎండిపోక కమల వనశోభితమై యెప్పుడును కలకలలాడుచు నిండి యుండును నావీపుపైన ఎక్కినవాని నచటికి తీసుకొని పోవుదును" అని చెప్పెను ఆమాటలను విను ఆ జంతువు లన్నియు ఆబకమునునమ్మి "నాయనా" అని కొందరు, 'మామా!' అని కొందరు, 'అన్నా' అని కొందరు ఆ కొంగను పిలుచుచు "నేనుముందు, నేను ముందు" అని ఆ బకముచుట్టు చేరెను, అప్పుడా దుర్బుద్ధియగు బకము ప్రతి దినముఆజంతువుల నన్నిటినితనవీపుపై ఎక్కించికొని పోయి ఆ సమీపమందలి యొక బండపైన పడవైచి తృప్తిగా భక్షించుచు తన జీవితము నెరవేర్చు కొనుచుండెను ఇట్లుండగా నొకనాడు ఆ యెండ్రకాయ, "మామా! నీతో నేను గదా మొదట స్నేహముచేసితిని నన్ను విడిచి అందరిని రక్షించు చున్నావు కారణమేమి? నన్ను నేడు నీవీపుపై కొనిపోయి నా ప్రాణములను రక్షించుము," అని అడిగెను అదివిని బకము తనలో "ప్రతిదినము మత్స్యమాంస మును తిని తిని వెగటు కలిగినది నేడు ఈ కుళీరకమును గొనిపోయి నాఆహార మునకు వ్యంజనముగా చేసికొని భక్షింతునుగాక" అని చింతించి దానిని వీపుపైన ఎక్కించుకొని వధ్యశిల వైపు ప్రయాణమయ్యెను అట్లు కొనిపో బడుచు ఎండ్రకాయ దూరమునుండియే ఒక పెద్ద అస్థి పర్వతమును చూచి అవి చేపల యెముకలుగా గ్రహించి బకముతో,

ఎండ్రకాయ. "మామా! ఆ తటాకమెంత దూరములో నున్నది? నా బరువుచేత చాల అలసిపోయియున్నావు చెప్పుము" అని యడుగగా బకము "ఈ జలచరము నేలపై ఏమియు చేయ జాల"దని తలచి నవ్వుచు "ఓ కుళీర కమా! ఎక్కడి తటాకము ఈ ఉపా యమంతయు నా జీవయాత్రకై సాగిం చుచున్నాను కనుక నీవు నీ యిష్ట దేవతను స్మరించుకొనుము ఒక్క క్షణ ములో నిన్నుగూడ ఈ శిలపై వేసి భక్షింపబోవుచున్నాను" అని చెప్పెను. ఈ విధముగా ఆ కొంగ చెప్పుచుండ గనే ఎండ్రకాయ తన కోరల కత్తెరతో తామరతూడువంటి ఆ కొంగమెడను ఖండించి తీసికొనిపోయి మెల్లగా జలా శయమును చేరెను అట్లు వచ్చిన యెండ్రకాయను ఇతర జలచరములు చూచి, 'ఓ కుళీరకమా! నీవొక్కడివే తిరిగివచ్చితివా? ఆ కొంగమామ రాలేదా? అతడేల ఆగిపోయెను? మే మందరము ఉత్సుకులమై అతనికొరకు ఎదిరిచూచుచున్నాము" అని అడిగినవి

ఆ మాటలను విని యెండ్రకాయ, "జల చరములన్నియు మూర్ఖుడు అసత్యవాది యైన ఆ బకము వానినన్నిటిని మోసగించి తీసికొనిపోయి యీ సమీపమునందే ఉన్న ఒక శిలాతలముపై వేసి భక్షించెను నాకు ఇంకను ఆయుష్షు మిగిలియున్నది కాబట్టి విశ్వాసఘాతుకమగు ఆ కొంగ యభిప్రా యమును గ్రహించి దాని మెడను ఖండించి తెచ్చితిని మీరు తొందరపడవద్దు ఇప్పుడు మన జలచరము లన్నింటికిని క్షేమము కలుగగలదు' అని చెప్పెను

పై కథను చెప్పిన నక్కతో వాయ సము, "మిత్రమా! ఆ దుష్టసర్పమును చంపుట యేలాగు" అని యడిగెను ఆ మాటకు నక్క "రాజా ఏలుబడిలో నున్న ఒకానొక పట్టణమునకు పొమ్ము అచ్చట



మంత్రివంటి ఒక ధనవంతుని యింటికి పొమ్ము. అతడు పరాకుగా నున్నప్పుడు అతని యింటినుండి యొక బంగారు గొలుసునుగాని, ముత్యాల హారమునుగాని దొంగిలించుకొని తెచ్చి ఆ సర్పమున్న చెట్టు తొఱియలో పెట్టుము. ఆ పామె దానిని దొంగిలించినదని రాజభటులు దానిని వధించెదరు," అని చెప్పెను.

అదివిని కాకదంపతులు అలాగే చేయుటకు ఆకాశములో ఎగిరి పోయి దారిలో ఒక సరస్సును చూచెను. అచ్చట రాజాంతఃపుర స్త్రీలు తమ ఆభరణములను, వస్త్రములను ఆ కొలని గట్టుపైన ఉంచి జలక్రీడలు చేయుచుండిరి. అప్పు డా కాకస్త్రీ అందులోనుండి ఒక కనకసూత్రమును ముక్కున గరచుకొని యెగిరి తన నివాసస్థానమువైపు ప్రయాణమై పోవుచుండెను. దాని నచ్చటి రాజభటులు చూచి కఱ్ఱలు చేత బట్టుకొని ఆ కాకిని అనుసరించి త్వరగా పరుగెత్తి పోయిరి. ఆకాకి ఆ నగను సర్పమున్న కోటరములో పడవేసి చూచుచు దూరముగా నిలుచుండెను. రాజభటులువెడలి-ఆవృక్షము నెక్కి సర్పకోటరమునందున్న కనక సూత్రమును చూచుసరికి పాము బుసకొట్టుచు పడగను ఎత్తెను. అప్పుడు దానిని వారు కఱ్ఱలతో కొట్టిచంపి, ఆ ఆభరణమును తీసికొని పోయిరి. ఆ తరువాత వాయస దంపతులుసుఖముగాఅచ్చటనివసించుచుండెను."

అను కథలను చెప్పి దమనకుఁడు "ఉపాయములచే సాధ్యముకానిపని ఉండదు. బుద్ధి ఉన్నవానిదే బలము, అదిలేనివాని బలము నిష్ప్రయోజనము. ఎట్లనగా ఒక వనములో బలీయమైన ఒక సింహమును బుద్ధిశాలియైన ఒక కుందేలు పడగొట్టెను." అని చెప్పగా కరటకుడు, "ఆ కథను చెప్పుము" అని అడిగెను.

దానికి దమనకు డీ క్రిందివిధముగా చెప్ప దొడగెను.

(సశేషము)



శివరాత్రి

డా. దివాకర్ల వేంకటావధాని

వివిధక్లేశపరంపరాకులితమై విభ్రాంతచిత్తాబ్జమై
పవలుల్ సైతము సప్రభాకరములై వర్తిల్లియున్ జీఁకటుల్
కలియంజేయఁగ దేశ ముద్ధురభయాక్రాంతిం బ్రకంపించుచున్
శివరాత్రీ! భవదూర్జితాగతి బ్రతీక్షించున్ వెసన్ రాఁగదే

సురలున్ దైత్యులు దుగ్ధవార్ధి దరువన్ క్షోణీతలం బెల్ల భీ
కరహాలాహలవహ్నికీలలకు నగ్గంబై చలింపన్ జగ
త్పరిరక్షాపరుఁడై శివుండు విషమున్ భక్షించి సంక్షోభముం
దెరలం జేసిన పుణ్యపర్వమవు కీర్తింతున్ భవత్సత్త్వమున్

శివునికిఁ బ్రీతి గూర్చెడు విశిష్టత, సర్వజగ మ్ముపద్రవా
ర్ణవపరిలగ్నమై కలఁగ రక్ష ఘటించిన సౌమనస్య మే
యవిధుల నైన ఘోరదురితావళి నైనఁ దొలంచు నేర్పు, నీ
యవిరళపావనత్వము మహత్త్వము చాటెడి శైవయామినీ!

మున్ను కిరాతుఁ డొక్కరుఁడు మూర్ఖతకు న్నిధియై దురాత్ముఁడై
యెన్నఁగరాని హింస లొనరించి శివాలయమందు బద్ధుఁడై
యన్నము లేక యుండి భవదాగతి భక్తులు శైవనామమున్
సన్నుతిచేయఁ దాను నెకసక్కెములాడియు ముక్తి బొందఁడే

అనవద్యంబయి పుణ్యహేతు వయి మోక్షానందసంధాయి యై
చను నీ భూరిమహత్త్వముం దెలుపఁగా శక్యంబె యా బ్రహ్మకున్
జను లెవ్వా రయినన్ యదృచ్ఛ నయినన్ సద్బుద్ధి నైనన్ శివా!
యనినం జాలుఁ ద్వదాగతిన్ భగవదైక్యం బంది శోభిల్ల రే.

ఓర్మిమై నొక్క నాఁ డుపవసించినఁ జాలు
మాలిన్య ముడిగించి మనుపఁ గలవు
ప్రమిదలో నొక్క దీపము పెట్టినం జాలు
నంత స్తమ స్తతి నడఁప నేర్తు
నొదలఁ దెల్లని బూది నదరించినం జాలు
దీప్తసత్త్వంబు సంధింప నోపు
దొక రాత్రి జాగరం బుండఁ గల్గినఁ జాలు
భూరిపుణ్యంబులు చూఱ యిత్తు

శంకరా! శివ! భూతేశ! చంద్రచూడ
సాంబ! ఈశాన! గంగాధరా! యటంచుఁ
బల్కినం జాలుఁ గైలాసవాససౌఖ్య
మీయఁ జాలుదు శివరాత్రి! ఈశనేత్రి!

నీతోడఁ జలి యడంగును
నీతోఁ బున్నెమ్ము లబ్బు నీరాక శివున్
జేతోభక్తి భజింప సు
ఖాతతకైవల్యలాభ మగు శివరాత్రీ!

నరకనివారకమ్ములు వినాకలుషమ్ములు నైన నీ మహా
త్తరనిమిషంబులన్ ధరసుతాహృదయేశుని పూజలం గనన్
వరశివనామకీర్తనలు భక్తిమెయిన్ విన మోక్షలక్ష్మియే
మరులుకొను న్విటుండు సుకుమారుఁడు దీనికి మూద లయ్యెడున్

పదియునొక్కమా ఱుచితపారముతో నమకంబు చెప్పుచున్
మొదలును మధ్య మంతమును బొందని వేలుపు లింగమూర్తికిం
జెదరని భక్తితోడ నభిషేకము చేయుచుఁ గోరికల్ మదిన్
మెదలఁగనీక నీశుభనిమేషము లెప్పుడు పుచ్చువాఁడనో

అనఘభవత్సమాగమన మారసి యే ముపవాసనిష్ఠ చే
కొనుదుము మాకు నోగిరము కొల్లలుగా నిడవమ్మ నిత్యమున్
బనివడి రాత్రి జాగరము భక్తి నొనర్తుము మాకు సంతతం
బొనరుపవమ్మ రాత్రుల సుఖోచితసుప్తి మహేశయామినీ!

తాతయ్యా కథ

జానకీ రామచంద్రన్

"తాతయ్యా! తాతయ్యా? ఒక కథ చెప్పవూ?" అంటూ తాతయ్య చుట్టూచేరి మారాము చేయసాగారు, దాసు–వాసులు దాసు-వాసులు సాయంత్ర సమయములందు తాతను చుట్టు కొని కథలు చెప్పించుకొనుట వారికి దినచర్య

"త్వరగా చెప్పు తాతయ్యా! నాన్న వచ్చేస్తారు." అంటూ దీర్ఘము తీయసాగాడు దాసు "ఏలాటికథ కావాలిరా? .. కుర్ర కుంకల్లారా!" అంటూ నోటిలోవున్న పుగాకును తుపుక్కున వుమ్మివేసి, వచ్చి కూర్చొన్నాడు తాతయ్య

"తాతయ్యా! ఈరోజు మా ఉపాధ్యాయులు 'ఉపాయముచే ఎంతటికార్యమునైన సాధింపవచ్చు' అన్నారు అలాటి దేదైనా ఒక కథచెప్పు తాతయ్యా!" అన్నాడు వాసు

"సరే! అలాగే," అంటూ ఆలోచనలో మునిగాడు తాతయ్య కొద్దిసేపటికి 'ఆ!' అంటూచిటికెవేశాడు అలా అంటే తాతయ్య కథ ప్రారంభానికి నాంది అన్నమాట "సరే! అయితే విను ఈకాలంలో ఏపాదులు అధికముగా వుంటాయి?"

"చిక్కుడు, కాకర, బీర, పొట్లా..." వరుసగా చెప్పసాగాడు దాసు

"రైటో! అలాఅయితే వినండి! మన ప్రక్కింట్లో రామయ్య అనే కోమటీ, అతని భార్యా వుండేవారు రామయ్యకు చిక్కుడు కాయలంటే అమితమైనప్రీతి అందుచే ఒక ఐదారు చిక్కుడుపాదులు వేశాడు ప్రతిరోజూ వుదయము, సాయంత్రము నీరు పోయుట అతని దినచర్య

"ఒకరోజు అతడు తనగదిలోగుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు పెరటివైపున ఏదో అలికిడి అయింది చీమ చిటుక్కుమంటే మేల్కొనే స్వభావ మతనిది కళ్ళునులుము కొని లేచి, మెల్లగా పెరటివైపు దారి తీశాడు చీకటిలో ఏదో .. నల్లని ఆకారము పాదువైపు నక్కినట్లు అగుపడింది

"వెంటనే అతడు బావివద్దకు వెళ్ళాడు ఇటూ అటూ చూస్తూ కాస్సేపు ఏదో ఆలోచిస్తూ నిలబడ్డాడు వెంటనే ఏదో స్ఫురించినవానివలె గట్టిగా నవ్వాడు తరువాత మెల్లిగా బొక్కెన బావిలోనికి వదిలి నీరు చేదాడు ఒక దోసెడు నీరు నోటిలో పోసుకొని బుర్! బుర్! అని పదిలాడు ఇలా గంటలకొలది నీరు చేదుతూ, వుమ్ముతూ వున్నాడు

"ఆ తరువాత! ఆ తరువాత!" దాసు, వాసుల ప్రశ్న

"కాస్త ఓపిక పట్టండర్రా అబ్బాయిలూ! అంత ఆత్రమైతే ఏలా? నిదానంగా మీకు చెప్తేకదా కథ అర్థమవుతుంది మీ రలా ఆత్రపడ్తే నే కథ చెప్పను" తన కడపటి అస్త్రం వదిలాడు తాత దాసు–వాసులు మౌనం వహించారు.

"ఇంతలో అతని భార్య మేల్కాంచి, ప్రక్కమీద భర్త లేనందున, ఆశ్చర్యపోయి వెతుకుతూ పెరటివైపు వచ్చింది భర్త చేస్తుండే పనిని చూచి అసహ్యపడి, దగ్గరకు వెళ్ళి, 'ఇదేమిటండీ? చిన్న బిడ్డలా! అర్ధరాత్రిలో ఈ పని...అవ్వ! ఎవరైనా చూస్తే, నవ్విపోతారు! మీ చిక్కుడు పాదులూ...మీరూనూ...' అంటూ గొణగసాగింది ఆమె మాటలు లెక్కపెట్టకుండా తుపుక్కున ఆమె ముఖముపై నోటిలోని నీటిని వుంచేశాడు

"ఆమె బిత్తరపోతూ చూడసాగింది. మరల ఒక దోసెడు నీటిని నోటిలో పోసుకొని ఆమెవైపు వుమ్మాడు. ఇలా ఒక్కొక్క దోసెడు నీటిని నోటిలో పోసుకొని వుమ్మసాగాడు రామయ్య భార్య 'అయ్యో! అయ్యో! నా మొగుడికి దయ్యంపట్టిందట్రో!' అంటూ కుట్రో! మొట్రో! యని అరవసాగింది ఇంతలో ఇరుగుపొరుగు వారు దబదబ గోడదూకి పరుగెత్తివచ్చారు.

"'ఇదేమిటయ్యా! అర్థరాత్రిలో ఈవెట్టి చేష్టలు,' అని మందలింపసాగారు అతడు ఎవరినీ లక్ష్యపెట్టక పాదువైపు వుమ్మసాగాడు 'ఇదేమిటి! మేము అడుగుతుంటే లక్ష్యపెట్టక పిచ్చిపనులు చేస్తున్నావు? ఎందులకు నీ భార్యను హింసిస్తున్నావు?'... అంటూ గదమాయించారు

"'అదేమిటయ్యా! అలా అరుస్తారు నేను నాలుగుగంటలుగా, ఆ మూడవ మనిషిపై వుమ్ముతున్నాను అతడు నోరు మెదపక ఆ పొదలో కూర్చొన్నాడు కట్టుకొన్న భార్యపైన ఒక్కసారి వుమ్మితే, వూరందరినీ ఒక్కటిగా చేర్చింది ఇలా చేస్తుందని తెలిసే, అలా చేశాను తప్పయిన మన్నించండి మీకందరికి చాల శ్రమకల్గించాను,' అంటూ పాదువైపు నడిచాడు. ఒక్కుమ్మడిగా వచ్చిన జనాన్ని తప్పించుకొనలేక దాక్కున్నచోటనే కూలబడ్డాడు దొంగ.

"ఆ తరువాత?" "ఆతరువాతేముంది? దొంగనుపట్టి పోలీసు స్టేషన్‌లో వొప్పగించారు. ఊరివారు రామయ్యయుక్తికాశ్చర్యపోయి అతనిని అనేకవిధముల పొగిడారు" 'ఉపాయముంటే ఎంతటిపనియైనను సాధింపవచ్చు' అంటూ దాసు–వాసులు ఒక్కుమ్మడిగా లేచారు

వైద్య సౌకర్యాల సత్వర విస్తరణ

ఒక దేశంలో రోగనివారణ సౌకర్యాలు ఆ దేశంలో తగినంతమంది వైద్యులు లభ్యమవుటపై ఆధారపడి ఉంటుంది. కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము, ఒకటవ, రెండవ, మూడవ పంచవర్ష ప్రణాళికలలో వైద్య కళాశాలలను స్థాపించుట, వైద్య శాస్త్ర పట్టభద్రులకు శిక్షణ సౌకర్యములు కలిగించుట ద్వారా వైద్యవిద్యలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన అభివృద్ధికై కృషి చేసినది. నాల్గవ పంచవర్ష ప్రణాళికలో జిల్లాలలోని మరియు తాలూకాలలోని వైద్య శాలలను అభివృద్ధి పరచుటకు తగిన ధనమును కేటాయించుటకు సంకల్పించబడినది.

నాల్గవ, ఐదవ పంచవర్ష ప్రణాళికా కాలములో, ప్రతివెయ్యిమంది ప్రజలకు ఒక పడక ఏర్పాటు చేయుటకు 5000 మందికి ఒక వైద్యుడు ఉండవలెనని ప్రణాళికా సంఘము తలపెట్టింది. అఖిల భారత స్థాయిలో ప్రతి 2500 మంది ప్రజలకు ఒక పడకను, ప్రతి 6,500 మందికి ఒక వైద్యుని సాధించగా, రాష్ట్రస్థాయిలో రెండువేలమంది ప్రజలకు ఒక పడకను, మరియు పదివేలమంది ప్రజలకు ఒక వైద్యుని రెండవప్రణాళిక అంతం వరకు సాధింప బడింది. మూడవ ప్రణాళికా కాలమునకు ప్రతి 1,800 మంది ప్రజలకు ఒక పడకను ఏర్పాటు చేయుటకు అవకాశం ఉండవచ్చు. నాల్గవ ప్రణాళికలో వైద్య శాలలలో పడకల సంఖ్యను 9,000 వరకు హెచ్చించబడునని అంచనా వేయబడ్డది.

రెండవప్రణాళిక చివరలో ప్రతి35,000 మంది ప్రజలకు ఒక వైద్యశాల ఉండెను. నాలుగవ ప్రణాళిక చివరకు ప్రతి 35,000 మంది ప్రజలకు ఒక సంస్థచొప్పున 1970 చివరవరకు జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకున్నను, పై నిష్పత్తి ఉండవచ్చును.

మొదటి, రెండవ, మూడవ ప్రణాళికలలో వైద్యశాఖకు కేటాయించబడిన మొత్తాలు, ఈక్రింద పొందుపరచ బడినవి.

ప్రణాళిక కేటాయింపులు

ప్రణాళికలు	మొత్తం సొమ్ము (కోట్లలో)	వైద్యశాఖకు నిర్ణయించ బడినది. (కోట్లలో)	శాతము
1. మొదటి పంచవర్ష ప్రణాళిక ...	96.49	115.60	1.2%
2. రెండవ ,, ,, ...	180.59	541.11	3.0%
3. మూడవ ,, ,, ...	305.00	610.87	2.0%
4. నాల్గవ ,, ,, ... (ముసాయిదాలు)	700.00	1560.00	2 2%

మూడవ పంచవర్షప్రణాళిక వివరణ

మూడవ పంచవర్ష ప్రణాళికలో వైద్య ప్రజారోగ్యముల ఉద్దేశ్యములు ఈ క్రిందివిధముగా నుండెను.

1. వైద్యకళాశాలలను సంఘటితముగా నుంచుట.
2. శిక్షణ వైద్యశాలలయొక్క పడకల సంఖ్యను అభివృద్ధి పరచుట.
3. జిల్లా, తాలూకాల ముఖ్యకేంద్రములలో ఉన్న వైద్యశాలల అభివృద్ధి పరచుట, ఆరోగ్యసంస్థలను, సంక్రమణవ్యాధుల నిరోధము, ఆరోగ్య విషయాల సర్వీసులను, కుటుంబ నియంత్రణను అభివృద్ధి పరచుట.

8 వైద్యకళాశాలలలో ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను జాతీయ అత్యవసర పరిస్థితిలో 850 నుండి 10,90కు కేంద్ర ప్రభుత్వం యొక్క సహకారంతో పెంచ బడినది. అఖిలభారత వైద్యసంస్థవారు నిర్ణయించిన ప్రకారము అవసరమైన సదుపాయములు మరియు ఉపాధ్యాయులను నిర్ణయించుట జరిగినది.

జిల్లా మరియు తాలూకా

వైద్యశాలల అభివృద్ధి

మూడవ ప్రణాళిక చివరికి ప్రతిజిల్లా ముఖ్యకేంద్రాలలో నున్న వైద్యశాలల్లో 250కి తక్కువ లేకుండ, తాలూకా ఆసుపత్రిలో 50కి తక్కువకాకుండ పడకలు వుండును. 5,000 పడకలను పెంచాలని అంచనా వేయబడినా ప్రస్తుతము 4226 పడకలు మాత్రమే జిల్లా ముఖ్యకేంద్రములు మరియు తాలూకా ముఖ్యకేంద్రముల వైద్య శాలలలో ఏర్పాటుచేయుటకు వీలైనది. 15 జిల్లా ముఖ్యకేంద్రముల వైద్యశాలల్లో శిక్షణ ఇచ్చు వైద్యశాలలను మినహాయించగా, 5 మాత్రమే 250 పడకలు గలవిగా నున్నవి. మిగిలిన జిల్లాల కేంద్రముల వైద్యశాలల పడకల సంఖ్య 80_166వరకు ఉన్నది. తాలూకా ముఖ్యకేంద్రముల వైద్య శాలల పరిస్థితికూడా అంతే.

ఆరోగ్య కేంద్రములు

3వ ప్రణాళిక ఉద్దేశ్యము 448 బ్లాకుల లోను ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును స్థాపించుట. ఇప్పటివరకు 310 ప్రాథమిక ఆరోగ్యకేంద్రములు మాత్రమే స్థాపింపబడినవి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరములో 30_40 వరకు ప్రాథమిక ఆరోగ్య

కేంద్రములు స్థాపించుటకు వీలుకావచ్చును 4వ ప్రణాళికాకాలంలో మరి 100ప్రాథమిక ఆరోగ్య కేంద్రములు స్థాపింప బడగలవు

కుటుంబ నియంత్రణ కార్యక్రమం

పట్టణ ప్రాంతములలో కుటుంబనియంత్రణ పథకము వైద్యశాఖచే కొనసాగించ బడుచున్నది ఇప్పుడు ఉన్న 65 పట్టణ కుటుంబనియంత్రణ కేంద్రములలో 11 ప్రస్తుత ప్రణాళికా కాలములో స్థాపించబడినవి కుటుంబనియంత్రణ కార్యక్రమము, స్టెరలైజేషన్, వెసెక్టమీ, ప్రతి వైద్యశాల యందును జరుపబడు చున్నవి మూడవ ప్రణాళికా కాలములో 6 12 లక్షలు రూ ఈ కేంద్రముల కొరకు ప్రత్యేకించబడినవి

ప్రస్తుతం 8 వైద్య కళాశాలలలో (6 ప్రభుత్వానివి రెండు ప్రయివేటువి) 1,090 మంది విద్యార్థులను చేర్చుకొనుటకు వీలున్నది 4 వ ప్రణాళిక అంతానికి ప్రతి కళాశాలలో 150 మందికి ప్రవేశపు ఏర్పాట్లుండును

నాల్గవ ప్రణాళికలో ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలలను అభివృద్ధి పరచుటకు సంకల్పించ బడినది 18 శిక్షణ వైద్యశాలలు 8,005 పడకల సంఖ్యతో నున్నవి నాల్గవ ప్రణాళికకాలంలో ఒక ప్రత్యేక ఇ ఎన్. టి వైద్యశాల మరియు ఒక ఉన్నత పట్టభద్రుల శిక్షణసంస్థ హైదరాబాదులో ఏర్పాటు చేయబడును దీనివలన శిక్షణ వైద్యశాలల సంఖ్య 20 అవుతుంది

నాల్గవ ప్రణాళికా కాలంలో శిక్షణ వైద్యశాలల్లోని పడకల సంఖ్యను అఖిలభారత వైద్యసంస్థ ఏర్పరచిన ప్రాతి పదికపై హెచ్చించుటకు నిర్ణయించబడినది

జిల్లా ముఖ్యకేంద్ర వైద్యశాలలు

శిక్షణా వైద్యశాలల తరువాత జిల్లా ముఖ్యకేంద్ర వైద్యశాలలే జిల్లా పట్టణాల మరియు గ్రామీణ ప్రజలకు వైద్యచికిత్స చేయుటలో ప్రముఖపాత్ర వహించుచున్నవి 15 జిల్లా ముఖ్యకేంద్ర వైద్యశాలలు మరియు 5 సామాన్య వైద్యశాలలు ఉన్నవి 15 జిల్లా వైద్యశాలలో మూడవ ప్రణాళికా ప్రారంభంలో మొత్తం పడకల సంఖ్య 2,009. 4 వ ప్రణాళిక ప్రారంభానికి పడకల సంఖ్య 2424 అగును

మూడవ ప్రణాళికలో రూ 52 00 లక్షలు జిల్లా కేంద్ర వైద్యశాలలకు రివెన్యూ మరియు కాపిటల్ క్రింద ప్రత్యేకించ బడినది ఈక్రింద ఉదాహరింపబడిన ముఖ్య ప్రాంతములలో వైద్యశాలలు కట్టించుటకు కొంతసొమ్ము ప్రత్యేకించ బడినది

(1) నెల్లూరు. (2) రాజమండ్రి. (3) శ్రీ కాకుళము. (4) నల్లగొండ. (5) ఖమ్మం. (6) మహబూబ్ నగరం

ముఖ్య ప్రాంతములలో వైద్యశాలల నిర్మాణం నాల్గవ ప్రణాళికా కాలమునకు వాయిదా వేయబడెను

నాల్గవ ప్రణాళిక కాలంలో ముఖ్య ప్రాంతాల వైద్యశాలల్లో పడకల సంఖ్య 250 కి హెచ్చించుటకు ఆలోచించడమైనది.

తాలూకా వైద్యశాలలు

3వ పంచవర్ష ప్రణాళికలో 450 పడకలు ఎక్కువ చేయబడినవి ఈ ప్రణాళికలో 35 48 లక్షలు తాలూకా వైద్యశాలల అభివృద్ధి కొరకై కేటాయించబడినవి

శిక్షణ కార్యక్రమము

ఈ దిగువ చూపబడిన శిక్షణ కార్యక్రమము వైద్యశాఖచే నిర్వహించబడెను. ఏ శిక్షణ పథకము క్రింద ఎంతమందిని తీసుకొనుటకు వీలున్నదో ఈ క్రింద చూపబడినది

క్రమసంఖ్య	శిక్షణ పేరు	సీట్లు
1	నర్సులు	841
2	ఆక్జిలరీ నర్సులు, మిడ్‌వైపులు	960
3	ఆక్జిలరీ హెల్త్ వర్కర్లు	50
4.	లాబొరేటరీ టెక్నిషియన్లు	80
5	పబ్లిక్ హెల్త్ నర్సులు (రాష్ట్రము అవల డిప్యుటేషన్‌లో వున్నవారు)	—
6.	లాబొరేటరీ అటెండెంట్లు	60
7	ఫార్మసిస్టులు	58
8	రేడియోగ్రాఫరులు	25
9	డార్కు రూమ్ అసిస్టెంట్లు	24
10	సానిటరీ ఇన్స్‌పెక్టర్లు	200
11	ఆప్‌టీషియన్లు మరియు రిఫ్రాక్షనిస్టులు	12
12.	ఆర్థొపిస్టులు	5
13.	మెడికల్ సోషల్ వర్కర్లు	8

పై శిక్షణ కార్యక్రమములను కొనసాగించుటయేగాక ఈ క్రిందిఉన్న అదనపు కార్యక్రమములు నాల్గవ ప్రణాళికలో తీసుకొనబడును

కుష్ఠువ్యాధి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోకూడా పై వ్యాధి వున్నది ఈ రాష్ట్రములో 5 2 లక్షల మంది పైవ్యాధికలవారు ఉన్నారని అంచనా వేయబడినది భారత ప్రభుత్వమువారు పై వ్యాధిని అరికట్టుటకు ఒక సంపూర్ణ కార్యక్రమమును ఏర్పరచుట మంచిదని, వీటిని నిరోధించు సంస్థలు మరియు ఎస్.ఇ టి సంస్థలను మరియు మంచి పర్యవేక్షణలను ఏర్పాటు చేసిరి పై పథకములో శిక్షణ ఏర్పాట్లు, డివిజనల్ కుష్ఠు వైద్య పర్యవేక్షకులను ఏర్పాటుచేయుట, మరియు పై వ్యాధిని అరికట్టు అధికారి కార్యాలయమును చక్కగా ఏర్పాటుచేయుట శిక్షణ ఆసుపత్రులలో వార్డులను వేయుట మొదలయినవి కలవు ప్రస్తుతము 18 వ్యాధి నిరోధక సంస్థలు, 73 విద్య మరియు నివారణ సంస్థలు, అక్కుతామపల్లి, తిరుపతిలో ఒక శిక్షణాసంస్థ పనిచేయుచున్నవి

వి. డి. సంస్థలు

ఈ రాష్ట్రములో 21 వి డి. సంస్థలు కలవు. సంగారెడ్డి ప్రాంతంలో తప్ప ప్రతి ప్రాంతములోను ఒక సంస్థ పనిచేయుచున్నది. మూడవ పంచవర్ష ప్రణాళిక కాలంలో 3 సంస్థలు ప్రారంభించ బడెను.

క్షయనివారణ కార్యక్రమము

38 క్షయనివారణ సంస్థలు మరియు 5 క్షయనివారణ ఆసుపత్రులు ఇప్పుడు మన రాష్ట్రములో నున్నవి

ఇవియేగాక ఒక క్షయ డిమాన్‌స్ట్రేషన్ మరియు శిక్షణ సంస్థ హైదరాబాదులోను, మరియొక క్షయ నివారణసంస్థ అనంతపూరులోను ఉన్నది

1964-65 సంవత్సరములో టి బి సంస్థలు వరంగల్ మరియు విశాఖపట్టణములో నున్నవి జిల్లాలో టి బి నివారణ సంస్థగా అభివృద్ధి పరచబడినవి

దంత వైద్య సంస్థలు

ప్రస్తుతము ఈ రాష్ట్రములో 23 దంత వైద్యసంస్థలు పనిచేయుచున్నవి ప్రతి జిల్లా కేంద్ర ఆసుపత్రులలో దంత వైద్యశాలలు ఉన్నవి నాల్గవ ప్రణాళికలో ఒక దంత వైద్యశాలను ప్రతి జిల్లా ముఖ్య కేంద్రపు ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని అనుకుంటున్నారు

ఇప్పుడు 14 ఇ ఎన్ టి. సంస్థలు ముఖ్య కేంద్రపు ఆసుపత్రులలో మరియు జనరల్ ఆసుపత్రులలో కలవు

5 వైద్యసంస్థలు ఏర్పాటు చేయుటకు 4వ ప్రణాళికలో 3.50 లక్షలు కేటాయించబడినది

ఈ రాష్ట్రములో 22 బ్లడ్ బ్యాంకులు ప్రతి శిక్షణ ఆసుపత్రిలోను మరియు జిల్లా ముఖ్యకేంద్రపు ఆసుపత్రిలలోను వున్నవి

కరీంనగర్, నల్లగొండ, ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో నాల్గవ ప్రణాళికలో ఈ బ్లడ్‌బ్యాంకులను ప్రారంభించుటకు సంకల్పింపబడినది.

ఈ ఆరుబ్యాంకుల స్థాపనకు 4 50 లక్షలు నాల్గవ పంచవర్ష ప్రణాళికలో కేటాయించబడినవి,

నాల్గవ పంచవర్ష ప్రణాళిక కాలంలో, ఆసుపత్రులలోగల ప్రస్తుత పడకల సంఖ్యను ఎక్కువచేయాలని సంకల్పించబడినది

శిక్షణ కార్యక్రమము

క్రమ సంఖ్య	శిక్షణ కార్యక్రమము	ఎక్కువ సంఖ్యగలవి	డబ్బు కేటాయించ బడినది. (లక్షలలో)
1	నర్సులు .	300	12 00
2	ఆక్జిలరీ హెల్త్ వర్కర్లు ..	50	4 00
3	ఫార్మసిష్టులు	50	1 50
4	ఫార్మసిథెరెపిస్టు ..	6	1 25
5	ఆక్యుపేషనల్ థెరీపిస్టులు ..	6	1 25
		మొత్తము రు	20 00

వైద్యుల మరియు వైద్యశాలల అభివృద్ధి సంఖ్య


క్రమ సంఖ్య	వివరములు	1955-1956	1960-1961	1964-1965
1	అల్లోపతి			
	(ఎ) ఆసుపత్రులు .	169	319	360
	(బి) ముఖ్యవ్యాధి నివారణ ఆసుపత్రులు ..	13	78	82
	(సి) వైద్య సంస్థలు ...	124	601	921
	(డి) పడకలు ...	12,340	19,345	22,250
2	ప్రభుత్వ వైద్యులు :			
	(ఎ) వైద్యశాఖ ...	643	1826	2599
	(బి) ప్రజారోగ్య శాఖ ..	151	222	—
3	ఆయుర్వేదము			
	(ఎ) వైద్య సంస్థలు ..	495	627	765
	(బి) వైద్యులు మరియు డాక్టర్లు ..	43	636	738
4	యునాని			
	(ఎ) వైద్య సంస్థలు ...	59	—	70
	(బి) వైద్యులు, హకీములు ..	72	92	107

అంటు వ్యాధుల ఆసుపత్రులు

క్రమ సంఖ్య	శిక్షణకార్యక్రమం పేరు	ఎక్కువ సీట్లు (ఆలోచించ బడినది.)
1	ఐ డి ఆసుపత్రి విశాఖపట్టణము	48
2.	ఐ డి ఆసుపత్రి గుంటూరు	40
3	ఐ డి ఆసుపత్రి, తిరుపతి	40
4	ఐ డి ఆసుపత్రి భద్రాచలం	40
మొత్తం		168

సంపూర్ణ ఆరోగ్యప్రమాణం అనుభవించడం ప్రతిమానవుని ప్రాథమిక హక్కులలో ఒకటిగా నున్నది భారతదేశం సంక్షేమదేశం గాబట్టి దేశ అభివృద్ధి ప్రణాళికలలో ఆరోగ్య పథకాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చింది స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఆరోగ్య రంగంలో ఎంతో అభివృద్ధి సాధించటమైనది ఇవి మంచి ఆరోగ్య సదుపాయములను అందించుటయే గాక అంటువ్యాధులను తగ్గించుటకు మరియు నివారించుటకు ఉపయోగపడును. ✱

నిమిషానికి 20,000—22,000 కంటే యెక్కువ పార్లు...



అసలు ప్రతి నెల సుమారు రెండున్నర కోట్ల చార్మినార్ సిగరెట్లు అమ్మకమగుచున్నవి! అవును, నిజంగా ఇండియాలో ప్రజాదరణ పొందిన సిగరెట్ చార్మినారే—ఎక్కువగా కూడా! ఎందుచేత? ఎందుకనగా, చార్మినార్ యొక్క అసమానమైన సువాసన, అద్వితీయమైన రుచితో ఇతర సిగరెట్టేదియు పోటిరాదు. వజీరు సుల్తాను టుబాకో కంపెనీవారు దానిని యేవిధముగా చేయుచున్నారో తెలుసా! నాణ్యమైన పొగాకుతో, ప్రత్యేకమైన పద్ధతులతో, నిపుణులైనవారు ప్రావీణ్యతతో తయారు చేయుటవలననే! ఈ ఫేక్టరీ ఆగ్నేయాసియాలో చాలా పెద్దది.

ప్రవీణులు చార్మినార్ కోసం ప్రత్యేకంగా పండించిన నాణ్యమైన పొగాకును యెంచుకొనెదరు. నేర్పరులైన పనివారు ఆకులను తీయుదురు. కాని జాలా లేబరేటరీలో ప్రతి పెండెను పరిశీలించెదరు. త్రిపక్వమొనరించిన పొగాకును నిపుణులు మిశ్రమం చేయుదురు తరువాత, ప్రత్యేకముగా చార్మినార్కు మాత్రమే నియమించబడిన అరవను విధానము జరిపించెదరు అటు పిమ్మట, నిమిషానికి 20,000 (22,000) కు మించిన సిగరెట్లు కావలసియున్న అగత్యతను పూరించేనిమిత్తం...అత్యంత వేగముగా సిగరెట్లను తయారుచేసే ఆటోమేటిక్ యంత్రాలలోనికి ఆపొగాకునంతా పంపెదరు.

చార్మినార్ వంటిది వేరొకటి లేదు—భారతదేశంలో ఘనమైన సిగరెట్.

ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్

భారతదేశమందు ఘనత వహించిన సిగరెట్ నిర్మాతలు!

CWVS-2-8 TL

ముఖ్య వార్తలు

రాష్ట్రంలో

డిసెంబర్ 23 : విజయవాడకు ఉపరాష్ట్రపతి డాక్టర్ జకీర్‌హుసేన్ రాక.

డిసె 24: ఉపరాష్ట్రపతిచేత విజయవాడ నీటి సరఫరా పథకానికి ప్రారంభోత్సవం.

డిసె 25: మరాఠీ సాహిత్య సమ్మేళనం 46వ వార్షిక సమావేశాన్ని రక్షణమంత్రి హైదరాబాద్‌లో ప్రారంభించారు.

డిసె 27: హిందుస్తాన్ మెషిన్ టూల్స్ యొక్క అయిదవ ఫ్యాక్టరీకి కూకట్ పల్లిలో ముఖ్యమంత్రిచేత ప్రారంభోత్సవము.

డిసె 30: తక్కెళ్ళపాడులో గుంటూరు ఛానల్ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

జనవరి 9: ఆహార లోపానికి సంబంధించిన ఆరోగ్య సమస్యలమీద ఒక జాతీయ గోష్టికి కేంద్ర ఆరోగ్యమంత్రి హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం చేసారు.

జన 22: నీటి పారుదల, డ్రైనేజ్‌లకు సంబంధించిన అంతర్జాతీయ కమిషన్ ప్రతినిధులు హైదరాబాద్ వచ్చారు.

జన 24: స్వర్గీయశాస్త్రి అస్థికలను రెవిన్యూ మంత్రి హైదరాబాద్‌కు తీసుకవచ్చారు.

భారతదేశంలో

డిసె 29: అవాడీఛారీ శకటాల ఫ్యాక్టరీ నుండి మొట్టమొదటి మధ్యరకం టాంకు బయటికి వచ్చింది.

డిసె 31: కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ. టి. టి. కృష్ణమాచారి రాజీనామా.

జన 1: కేంద్ర ఆర్థికమంత్రిగా శ్రీ శచీంద్ర చౌధురి ప్రమాణ స్వీకారం.

జన 3: చండీగఢ్‌లో 53వ ఇండియన్ సైన్సు కాంగ్రెసుకు రాష్ట్రపతిచే ప్రారంభోత్సవం.

జన 6: ఢిల్లీలో, కేంద్ర ప్రభుత్వ రవాణా శాఖ డిప్యూటిమంత్రి శ్రీ అహమద్ మొహియుద్దిన్ అస్తమయం.

శ్రీ మొరార్జీదేశాయి అధ్యక్షతన, కేంద్ర ప్రభుత్వంచే ఆరుగురు సభ్యులతో పరిపాలన సంస్కరణల కమిషన్ నియామకం.

జన 7: ఢిల్లీలో, భారత–సోవియట్ దేశాల మధ్య ఒక వాణిజ్య ఒప్పందం కుదిరింది.

జన 8: బొంబాయిలో శ్రీ బిమల్‌రాయ్ అస్తమయం.

జన 11: స్వర్గీయ శాస్త్రి అంత్యక్రియల సందర్భంలో సోవియట్ ప్రధాని మిస్టర్ కోసిగిన్ ఢిల్లీ రాక.

ప్రధానమంత్రిగా శ్రీ గుల్జారీలాల్ నందాచేత ప్రమాణస్వీకారం.

జన 12: పూనాలో, పూనా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డాక్టర్ యన్. వి. గాడ్గిల్ అస్తమయం.

స్వర్గీయశాస్త్రి అంత్యక్రియల సందర్భంలో అమెరికా ఉపాధ్యక్షుడు మిస్టర్ హ్యూబర్ట్ హంఫ్రీ ఢిల్లీరాక.

జన 15: కేంద్ర పునరావాస శాఖామంత్రి శ్రీ త్యాగి రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు.

జన 19: పార్లమెంటులో కాంగ్రెసు పార్టీ నాయకురాలిగా శ్రీమతి ఇందిరాగాంధీ ఎన్నిక.

జన 20: కేరళగవర్నరు పదవికి శ్రీ ఎ. పి. జైన్ రాజీనామా.

జన 21: భారత సైనికాధిపతితో చర్చలకు పాకిస్తాన్ సైనికాధిపతి జనరల్ మూసా ఢిల్లీ రాక.

జన 22: గడచిన సెప్టెంబరు సంఘర్షణల సందర్భంలో పట్టుబడిన వైమానిక యుద్ధ ఖైదీలను భారత, పాకిస్తాన్ దేశాలు పాలం విమానాశ్రయంలో మార్పిడి చేసుకున్నాయి.

జన 24: భారత ప్రధానమంత్రిగా శ్రీమతి ఇందిరాగాంధిచే ప్రమాణస్వీకారం.

విదేశాలలో

జన 3: భారత ప్రధాని శ్రీ శాస్త్రి, పాక్ అధ్యక్షుడు అయూబ్ తాష్కెంట్‌కు ఆగమనం.

జన 4: ఐక్యరాజ్యసమితి సైనిక ప్రధాన పరిశీలకుడు జనరల్ రాబర్ట్ నిమ్మో, రావల్పిండిలో అస్తమయం.

సోవియట్ ఆధ్వర్యాన తాష్కెంట్‌లో భారత, పాకిస్తాన్‌ల అగ్రస్థాయి సమావేశం ప్రారంభం.

జన 8: సిలోన్‌లో అత్యవసర పరిస్థితి.

జన 10: సమస్యల పరిష్కారానికి బల ప్రయోగాన్ని వ్యతిరేకిస్తూ తాష్కెంట్‌లో భారత, పాకిస్తాన్ దేశాల ప్రకటన; తాష్కెంట్ సమావేశం పరిసమాప్తి.

జన 11: గుండెనొప్పి కారణంగా తాష్కెంట్‌లో శ్రీ లాల్‌బహద్దుర్ శాస్త్రి నిర్యాణం.

జన 15: నైగేరియా రాజధాని లాగోస్‌లో సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకొన్నది.

జన 21: ఇటలీ ప్రధానమంత్రి మిస్టర్ ఆల్డో మోరో రాజీనామా.

జన 24: ఏర్ ఇండియా బోయింగ్ 707 జెట్ లైనర్ ఒకటి జనీవా సమీపంలో మౌంట్ బ్లాంక్ సానువుల్లో కూలిపోయింది; విమానంలోని 117మంది మరణించారు. ఇదే ప్రమాదంలో భారత అణుశక్తి కమిషన్ అధ్యక్షుడు డాక్టర్ హోమీభాభా అసువులు కోల్పోయారు.

మహాశివరాత్రి

గడియారం రామకృష్ణశర్మ

భారతీయుల మహాపర్వములలో శివరాత్రి ముఖ్యమైనది. ఈ పర్వము మాఘమాస కృష్ణచతుర్దశీ దినమున వచ్చును. ఆ దినమున హిందువులు ఉపవాసముండి రాత్రియంతయు జాగరణము చేసి మహాదేవునకు అభిషేకములు, యామపూజలు చేసి, శివ భజనలతో గడపెదరు. శివరాత్రిని గూర్చియు, తద్వ్రతమును గూర్చియు, పురాణాదులలో విశేషముగ తెలుపబడి యున్నది.

శివరాత్రి:– శివప్రియా, తదుపాసనార్థా, రాత్రిః శివరాత్రిః మాఘే కృష్ణ చతుర్దశ్యాం రాత్రౌహి శివపూజన వ్రతాదికం క్రియతే ఇతి తస్యా రాత్రేః తత్ ప్రియత్వం[1].

(శివునకు ప్రియమైనట్టి ఆయననుపాసించుట కుద్దేశించినట్టి రాత్రిని శివరాత్రి యందురు. మాఘమాసమునందలి కృష్ణచతుర్దశి రాత్రియందే పూజావ్రతాదులు చేయబడును కావున ఆరాత్రి శివునకు ప్రియమైనది.)

"మాఘమాసస్య శేషేయా ప్రథమే ఫాల్గుణస్యచ
కృష్ణాచతుర్దశీసాతు శివరాత్రిః ప్రకీర్తితా[2]." (నాగరఖండం)

"మాఘేకృష్ణ చతుర్దశ్యాం ఆదిదేవో మహానిశి
శివలింగ తయోద్భూతః కోటిసూర్య సమప్రభః."
(ఈశాన సంహిత).

(దాక్షిణాత్యుల మాఘకృష్ణ చతుర్దశిని ఔత్తరాహులు ఫాల్గుణ కృష్ణ చతుర్దశియందురు. ఆ దినమే శివరాత్రి అనబడును. నాటి అర్థరాత్రమున ఆదిదేవుడు కోటిసూర్యుల తేజముతో శివలింగ రూపమున నుద్భవించెను.)

కావుననే మాఘకృష్ణ చతుర్దశి శివరాత్రి మహాపర్వమైనది. ఈ విషయము పురాణములలో గూడ పేర్కొనబడెను. శివరహస్య ఖండమిట్లు చెప్పెను.

"హరి సరసిజాసనులు వివాద మొనరించుకొని తేజోలింగము నామూలాగ్రముగ నరయజాలక మరలినంత శివు డందుండి వ్యక్తుడై వరము లొసగిన దిన మగుట మహాశివరాత్రి యనబడినది.[3]"

బ్రహ్మాండము నావరించిన శివతేజోరూపమిట్లు వర్ణింపబడినది.

"ఆపాతాళనభస్థలాంత భువన బ్రహ్మాండ మావిస్ఫురజ్జ్యోతి
స్ఫాటిక లింగమౌళి విలసత్పూర్ణేందు వాంతామృతైః"
(మహావ్యాసము).

మాఘకృష్ణ చతుర్దశియేగాక ప్రతిమాస కృష్ణచతుర్దశియు శివ రాత్రిగా పేర్కొనబడును.

లింగోద్భవగాథ:– బ్రహ్మాండము నావరించి జ్యోతిర్జ్వాలామయమై స్తంభాకృతితో నొక మహాతేజము వెలుగుచుండెను. సకలలోకములును దాని తత్త్వ మరయలేక విభ్రాంతి నందెను. విష్ణుబ్రహ్మలు సాహసించి దాని ఆద్యంతములు పరిశోధించుటకు పూనిరి. బ్రహ్మ హంసరూపమున ఎగిరి అగ్రము నెరుగుటకును, హరి వరాహరూపమున త్రవ్వికొనిపోయి మూలమును తెలిసికొనుటకును ప్రయత్నించిరి. కాని వారు వైఫల్యము నొందిరి. చివరకు మహాదేవు డా స్తంభమునుండి వ్యక్తమై ఇరువుర ననుగ్రహించెను.

సుప్రసిద్ధములగు అలంపురము, శ్రీశైలము, కాంచీపురము, తంజావూరు, త్రిభువనము మొదలైన శివక్షేత్రము లన్నిటిలో నీ లింగోద్భవమూర్తి సుందరముగ చెక్కబడియున్నది.

శివుని లింగాకృతిని గూర్చి కొన్నిగాథలు పుట్టినవి. శ్రీనాథుడు హరవిలాసకావ్యమున దారుకావనవిహారగాథ నిట్లు చెప్పెను. "శివుడు దారుకావనమునకు భిక్షాటనము చేయరాగ మునిపత్నులు సమ్మోహితులై వెంటదవిలిరి. వారి పతులు విషయము నెరుగక ఆగ్రహించి శివుని పురుషాంగము తెగిపడునట్లు శపించిరి. శివుడు తన లింగమును భూమ్యాకాశములకు పెంచి మహత్తును చాటుకొనెను."

ఇట్టి గాథలను స్థూలదృష్టితో పరికించిన పాశ్చాత్యులును, వారి అనుయాయులును శివలింగమును గూర్చి, పానివట్టమును గూర్చి అసభ్యముగా వ్రాయుటకు సాహసించిరి. వీరి వాదములను ఖండించి వివేకానందస్వామి గట్టిగా బుద్ధిచెప్పినాడు[4].

The worship of the Sivalinga originated from the famous hymn in the Atharva Veda Samhita some in praise of the Yupastambha the sacrificial post......... Just so the Yupastambha gave place in time to the Sivalinga and was defined to the high Devahood of Sri Sankara. In the Linga Purana the same hymn is expanded in the shape of stories meant to establish the glory of the great Stambha and the superiority of the Mahadeva.
(Swamy's works Vol IV Pages 357-358 1923 Edition)

(శివలింగము నర్చించు విధానమునకు మూలము అథర్వవేద సంహితలోని యూపస్తంభస్తుతులు– ప్రాచీనభారతమునందు

1 వాచస్పత్యం పుట 5112. 2 వాచస్పత్యం పుట 5112. 3. శివరహస్య ఖండ ఉపదేశ కాండ 30వ అధ్యాయము–
4. "హిందువుల పండుగలు" – కీ. శే. సురవరం ప్రతాపరెడ్డి.

యజ్ఞమే సకల జన సేవ్యమై యుండెను. అందువలన ఆ యూప స్తంభమే మహాశివప్రతీకగా భావించమని అంగరూపమునందెను. ఈ విషయము అంగపురాణమునందు విపులముగా వర్ణింపబడినది.)

స్కాంద పురాణమున లింగశబ్దవ్యుత్పత్తి ఇట్లు చెప్పబడినది.

"ఆకాశం లింగమిత్యాహుః పృథివీతస్య పీఠికా

ఆలయస్సర్వ దేవానాం లయనా ల్లింగ ముచ్యతే[5]."

ఆకాశమును లింగమనియు, భూమి దాని పీఠమనియు అందురు. సకల దేవతలకు అదినిలయమై అన్నిటియందు లయించును గావున లింగ మనబడును.

సుప్రసిద్ధచరిత్రకారులు డాక్టరుఎస్.శ్రీకంఠశాస్త్రిగారిట్లుచెప్పిరి.

"వేదమునందలి అగ్నియొక్క క్రూరరూపమును రుద్రుడని, సౌమ్యరూపమును శివుడని చెప్పెదరు. ఈ యజ్ఞేశ్వరుని జ్వాలలే కాళీ, కరాళీ మొదలగు దేవులు. శివలింగము ఉత్తరారణీ అథవా యూపస్థంభమునకు ప్రతీక. శైవచిహ్నమగు భస్మము యజ్ఞావశేషమైన రక్ష[6]" ఈ విషయము ఋగ్వేదమునం దున్నది.

"త్వమగ్నే రుద్రో అసురో మహోదివః ।

అహోరాజాన మధ్వరశ్య రుద్రం హోతారం ।

త్వమగ్నే ప్రథమో అంగిరాఋషిః దేవో దేవనామభః శివః సఖా।

తవవ్రతే కవయో విద్మనాపసోజాయన్త మరుతో భ్రాజ మష్టయః"

(ఋగ్ 1. 7-31-1).

శివరాత్రివ్రతము : ధర్మశాస్త్రములందును, బహుపురాణములందును మాఘ కృష్ణ చతుర్దశియే శివరాత్రి యనియు, నాడే శివరాత్రి వ్రతమును విధ్యుక్తముగ చేయవలయుననియు చెప్పబడియున్నది. కాని భవిష్య పురాణమునందు మార్గశిర శుక్ల త్రయోదశినాడు 'శివచతుర్దశీ వ్రతము' చేయవలయు నని చెప్పబడినది[7].

స్కాందపురాణమున ఈ వ్రతమునుగూర్చి ఇట్లు చెప్పబడినది. ఈ వ్రతము చతుర్విధములుగ నుండునట[8].

1. సార్వకాలముగ ప్రత్యహమును రాత్రి నాలుగు యామములను నియమముతోశివుని పూజించుటనిత్యశివరాత్రి వ్రతమనబడును.
2. ప్రతి కృష్ణచతుర్దశిని ఉపవాస ముండి రాత్రి నాలుగు యామములు శివారాధన చేయుట మాసశివరాత్రి వ్రతము.
3. అమావాస్యాయుక్త సోమవారమున ఉపవసించి పూజించుట యోగిక శివరాత్రివ్రతము.
4. మాఘకృష్ణ చతుర్దశినాడు ఉపవసించి పూజించుట మహాశివరాత్రి వ్రతము.

వ్రతవిధానము : మహాశివరాత్రినాడు నిద్ర లేచినది మొదలు రుద్రుని స్మరించుచు ఉపవసించి రాత్రి నాలుగు యామములు మృత్యుంజయుని పూజించి మేల్కొని మరునాడు పూజాదికము జరిపి భక్తులకు దాన భోజన దక్షిణ లొసగవలెను. ఈ వ్రతమాచరించినవారికి అనంతధనప్రాప్తి కలుగును[9].

శివపురాణమునం దిట్లుకలదు. "శివరాత్రినాడు ఉపవసించి రాత్రి నాలుగు జాములలో పార్థివలింగమునకు పూజాభిషేకము లొనర్చి స్వామికి ఆయా జాములలో చెప్పబడిన శాక, దాన ఫలములు నివేదన చేసి పంచాక్షరీ మంత్రమును క్రమవృద్ధితో జపించి మరునాడు పార్థివలింగము నర్చించి విధివిహితముగ విసర్జించి శివభక్తులకు దాన భోజన దక్షిణలు సమర్పించవలెను[10].

రాత్రి నాలుగు జాములలో చేయు అభిషేకములందు మొదటి జామున పాలతో, రెండవ జామున పెరుగుతో, మూడవ జామున నేయితో, నాల్గవ జామున తేనెతో చేయవలెను.

"దుగ్ధేన ప్రథమే స్నానం దధ్నాచైవ ద్వితీయకే

తృతీయేచ తథాజ్యేన చతుర్థే మధునా తథా॥ [11]."

ఈ వ్రతమునకు ఉపవాసము మిగుల ముఖ్యము.

"నస్నానేన నవస్త్రేణ నధూపేన నచార్చయా

తుష్యామి నతథా పుష్పైః యథా తత్రోపవాసతః[12]"

శివరాత్రి వ్రతోద్యాపనము :- ఈ వ్రతమును పైవిధముగ విడువక పండ్రెండు సంవత్సరములు గాని, యిరువదినాలుగు సంవత్సరములుగాని చేసి యథావిధి ఉద్యాపనము చేయవలెను.

"ఏవమేవం వ్రతంకుర్యాత్ ప్రతి సంవత్సరం ప్రతి

ద్వాదశాబ్దిక మేతద్ధి చతుర్వింశాబ్దికం తథా,

సర్వాన్‌కామాన్ అవాప్నోతి ప్రేత్యచేహచ మానవః.

(ఈశానసంహిత)

ఉద్యాపనవిధి ఇట్లు చెప్పబడినది. "ఈ విధముగ శివరాత్రి వ్రతమును వరుసగా పండ్రెండు సంవత్సరములు చేసి అనంతరము త్రయోదశి ఏకభుక్తుడై చతుర్దశి పూర్తిగ ఉపవసించి రాత్రి సర్వతోభద్ర, లింగతోభద్ర మండలములు వేయించి నడుమ యథాశక్తి శివ పార్వతులసువర్ణ విగ్రహములు చేయించి, ప్రతిష్ఠించి, పూజలు జరిపి, మరునాడు ఋత్విజుల నర్చించి, వస్త్రదానాదు లొసంగవలెను. గోవృషభముల నలంకరించి పై విగ్రహములను వానిపై నుంచి ఆచార్యునకు దాన మొసగవలెను[13]." ఈ విధముగ శివరాత్రి వ్రతకలాపము సంపూర్ణ మగును.

శివరాత్రి మహాత్మ్యము : శివరాత్రి మహాత్మ్యమును గురించి పురాణములలో అనేక గాథలుగలవు. వానిలో ప్రసిద్ధమైనవి తెలుపబడుచున్నవి.

---

5. సం॥ వాచస్పత్యం పుటలు 5116,16. భారతీయ సంస్కృతి, పుటలు. 129-130, 7. భవిష్యపురాణం- ఉత్తరపర్వం 97 అధ్యాయం. 8. శివరహాస్యఖండము. ఉపదేశ కాండము 30 అధ్యాయం. 9. శివరహాస్యఖండ ఉపదేశకాండము 30 అధ్యాయము. 10 కోటి రుద్రసంహిత. 37 – 38 అధ్యాయములు. 11. వాచస్పత్యం. 12. వాచస్పత్యం. 13. కోటిరుద్ర సంహిత. 39 అధ్యాయము.

"ఈవ్రతము నాచరించి త్రివిక్రమ ధాతృ సుత్రాములు విష్ణుత్వ. బ్రహ్మత్వ. త్రివిష్టపాధిపత్యములు పొందిరట. మరుద్వరుణు లాచరించి బలశాలు రైరి. గజానన షణ్ముఖులు గణాధిపత్యమునందిరి. ఈవ్రత విషయమే తెలియక శివరాత్రినాడు ఉపవశించిన కొందరు మహాఫలమునుపొందిరి. ఒక పుళిందుడు శివరాత్రిదినమున పులి భయమువలన బిల్వవృక్షమును నెక్కి, జాగరణము చేసినందున కైలాసప్రాప్తి నందెను. ఒక చండాలస్త్రీ జరాభారముచే కదలలేక శివరాత్రినాడు తిరగలేక మరణించి శివసాయుజ్యము నొందెను[14].

"ఒకమంత్రి పుత్రుడు సుకుమారు డనువాడు దుర్వ్యసనములలోపడి దేశభ్రష్టు డయ్యెను. వానికి చండాల స్త్రీ సంపర్కము, దానియందు సంతానము కల్గెను. ఒకనాడు అగ్నిప్రమాదమువలన అది సపుత్రకముగ చచ్చెను. వాడు అవసానకాలమున శివరాత్రినాడు శివపూజలుచూచి, శివభజనలు వినుచు ప్రాణములు విడచెను. తత్ఫలితముగ కైలాసమున కేగెను[15]. " (ఈశాన సంహిత.)

అజ్ఞానముచే శివరాత్రి వ్రత మొనరించిన వ్యాధుని పరమశివు డనుగ్రహించినాడు.

"ఒక కిరాతుడు శివరాత్రినాడు వేటకు పోయెను. పగలంతయు నేప్రాణి లభింపలేదు. సాయంకాలమున నొక నదీతీరమునందలి బిల్వవృక్షముపై నెక్కి పొంచియుండెను. వరుసగ మూడు యామములలో మూడు జింకలు వచ్చెను. వాడు వానిపై బాణము వేయబోయెను. అతని కదలికవలన చంకలోని నీటిపాత్రలోని కొంత జలము, కొమ్మలలోని బిల్వము, వృక్షమూలమున నున్న శివలింగముపై పడుచుండెను. బాణము నెక్కుపెట్టినపు డంతయు ఆ జింకలు చంపవద్దని, ఇంటికిబోయి తప్పక మరల వచ్చెదమని శపథముచేసి పోయినవి. చివరి జామున మూడు జింకలును వచ్చి చంపగోరెను. వ్యాధునకు జ్ఞానోదయమై జింకలను చంపక వదలిపెట్టెను. శివుడు ప్రసన్నుడై వానికి గుహుడను నామకరణము చేసి, నీవు శృంగిబేర పురాధిపతివై శ్రీరామచంద్రునకు సన్నిహితుడవగుదువని, అనేక భోగము లనుభవించి శివసాయుజ్య మందుదువని, వరములిచ్చి అంతర్హితుడయ్యెను. అంతయు నట్లేజరిగినది[16]."

ఈ మృగలుబ్ధకగాథ లింగపురాణమున మరొకవిధముగ నున్నది.

"ఒకబోయవాడు శివరాత్రినాడు వేటకు బోయెను. ఏ జంతువు లభింపక పస్తుండెను. రాత్రి వేచియుండగా చివరకు మూడు జింకలు విడివిడిగా వచ్చెను. వానిని చంపబోవ అవి ఇంటికి బోయి వత్తుమని చెప్పిపోయి మరల వచ్చినవి. వ్యాధుడు చంపక వదలిపెట్టెను. దేవతలు మెచ్చి జింకలను, వ్యాధుని, సశరీరముగ శివలోకమునకు గొనిపోయెను. ఆ మృగలుబ్ధకులే తరువాత మృగశిరానక్షత్రముగ నైరి[17]." ఈ మృగలుబ్ధకగాథ అలంపురక్షేత్ర (మహబూబునగరం జిల్లా, స్థలపురాణమున మరొక విధముగ నున్నది.

"అలంపురక్షేత్రమునందు రససిద్ధుడు క్షేత్రదైవములచే రసమును సంపాదించి ఆలయ నిర్మాణము చేయుచుండెను. విలసద్రాజు ఆ రసపాత్రకై దండెత్తివచ్చెను. సిద్ధు డాతని శపించి లింగైక్యము నొందును. రాజు పదభ్రష్టుడై అరణ్యముల వసించెను. అతని సేవకుడైన ఒక లుబ్ధకుడు వేటకు బోయి ఒక జింకను చంపబోవును. అది ఇంటికి పోయి తప్పకవత్తునని, మాటతప్పినచో విలసద్రాజు పోయిన పాపమున బోవుదునని చెప్పిపోయెను. ఈ విషయము తెలిసిన రాజు జింకను శాపనివృత్తిని తెలుపుమనెను." అది తెలుపును.

ఈ గాథ అలంపుర బ్రహ్మేశ్వరాలయ మహాద్వారమున ముందున్నతోరణ స్తంభముమీద చెక్కబడియున్నది.

శివరాత్రి మహాత్మ్యమునందలి మృగలుబ్ధక గాధకును మృగశీర్షా నక్షత్రమునకునుగల సంబంధమునుగూర్చి ప్రసిద్ధ విద్వాంసులు కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారును, శ్రీ తిరుమల రామచంద్రగారును విపులముగా చర్చించినారు[18].

మన నక్షత్రముల కన్నిటికిని ఇంచుమించు పురాణగాథలతో సంబంధము కలదని చెప్పవచ్చును[19]. విస్తర భీతితో ఇచట ఆ చర్చను వదలుచున్నాను. శ్రీ తిరుమల రామచంద్రగారు పైకథలోని మృగశీర్షా నక్షత్రమునుగూర్చి చర్చించి మృగశీర్షా నక్షత్రమున వసంత విషువత్తు ఏర్పడుచుండెనని అనేక కారణములను పురస్కరించుకొని శివరాత్రి వసంతఋతు ప్రారంభోత్సవము కాదగునని భావించినారు[20].

ఈ శివరాత్రి మహాపర్వమునందు పరమశివుడు సకలభారతీయులచే ఆరాధింపబడుచున్నాడు. ఈ పర్వమునుగూర్చి ఈశ్వర సంహిత ఇట్లు చెప్పుచున్నది.

"శైవోవా వైష్ణవోవాపి యోవాస్యా దన్యపూజకః
సర్వం పూజాఫలం హంతి శివరాత్రి బహిర్ముఖః."

"శైవుడు కాని, వైష్ణవుడుకాని అన్యదైవమును పూజించు ఏ వ్యక్తిగాని శివరాత్రి వ్రతమును ఆచరించని యెడల, అతడు చేసిన యితరదేవతల పూజ లన్నియు నశించును." అని పై శ్లోక భావము. కనుక ప్రతిభారతీయుడు ఈ శివరాత్రి వ్రతమును విధ్యుక్తముగా నాచరించవలెను.

ఓం _ తత్ _ సత్

14. శివరహాశ్యఖండ ఉపదేశకాండము 30 అధ్యాయము. 15. శివరాత్రి మహాత్మ్యము. శ్రీనాధకవి. 16. కోటిరుద్ర సంహిత 40 అధ్యాయము. 17. లింగపురాణం. 18. చూ, హిందువుల పండుగలు – "హిందువుల పండుగలు, పర్వములు," 19. నక్షత్రములు — శ్రీ. గొబ్బూరు వెంకటానంద రాఘవరావు. 20 హిందువుల పండుగలు — పర్వములు. పుట 282

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.

మన
నూతన
ప్రధాన మంత్రి



Regd. No. H. 133

